నవభారతి



సాహిత్య సాంస్కృతిక మాస పత్రిక

న వ భా ర తి

సాహిత్య సాంస్కృతిక మాస పత్రిక

జూన్ 1958

మూల్యం : రూపాయి

న వ భా ర తి కా ర్యా ల యం
గాంధీ నగరం ★ విజయవాడ—2

విషయసూచిక

చిత్రములు



కలల కన్నులు   చిత్ర శిల్పి : శ్రీ అంకాల వెంకటసుబ్బారావు

*

అభిసారిక

చిత్ర శిల్పి :

శ్రీ కె. భాస్కరరావు

---

*





పచ్చగడ్డి దొడ్డి

చిత్ర శిల్పి : శ్రీ మొక్కపాటి కృష్ణమూర్తి

న వ భా ర తి

సాహిత్య సాంస్కృతిక మాసపత్రిక

సంపుటి 1 ‖ విజయవాడ ★ జూన్ 1958 ‖ సంచిక 1

వక్తవ్యము

భారత జాతీయ జీవనధర్మం సువిశాలమైనది. మానవునికీ మానవునికీ మధ్య అంతస్థుల తారతమ్యం ఉండడం సహజమని గుర్తించింది. మానవస్వభావాన్ని గమనించి వ్యక్తులపట్ల ప్రేమాదరాలు కలిగి, మానవునిలో నున్న మంచితనాన్ని పరమ రమణీయంగా చిత్రించి చూపిస్తూ వచ్చింది. మానవ సంబంధ బాంధవ్యాలు సున్నితంగా సుకుమారంగా చిరకాలం వర్ధిల్లటానికి అనువైనమార్గం వివరించింది. ఈ వివరణను భిన్నభిన్న సంస్కారాలతో కూడిన సామాజిక వ్యవస్థారూపంలో చూపింది. ఇది నేటి మన సాంఘిక జీవనంలోనుంచి ఎందుకు వేరుచేయబడిందో నిరూపించటం కష్టమే అయినా, ప్రస్తుతం మనం చర్చించుకోకతప్పటంలేదు.

మనం దాస్యంచేసినా, స్వాతంత్ర్యం సంపాదించినా, అది వ్యక్తి స్వయంశక్తి మీదనే ఆధారపడి వుంటుందని మన మందరమూ అంగీకరించక తప్పదు.

ఒకే కాలంలో గాంధీ, నెహ్రూ తదితరనాయకు లెందరో జన్మించారు. అందరినీ ఆకర్షించిందీ, ప్రబోధించిందీ, జాతి ప్రతిభా వికాసాలకు రూపురేఖలు తీర్చి దిద్దగలిగిందీ, జాతి నంతటినీ సజీవంగా నడిపించగల్గిందీ, ఒక్క గాంధీగారేనని మనం వేనోళ్లతో నిత్యం పొగడు కొంటూనే ఉంటున్నాం. అయినా గాంధీజీ నడవడికనుగాని, స్థిరసంకల్పాన్నిగాని, ఆత్మ చైతన్యాన్నిగాని, విద్యా విజ్ఞాన సంపత్తినిగాని అలవరచుకొనే సాధనమాత్రం చేయడంలేదు.

గాంధీజీ సాధన స్వార్థరహితమైనది. భావన పవిత్రమైనది. యోజన యుక్తియుక్తమైనది. కార్యదీక్ష అచంచలమైనది. ప్రేమ అపారమైనది. ఇవన్నీ సామాన్య గుణాలు కావు.

సామాన్య మానవులు వీటిని అనుకరించటంకూడా సాధ్యంకాదు. ఈ కారణంవల్ల ఈనాడు భారత దేశాభ్యుదయం అనుకొన్నంత వేగంగా సాగటం సాధ్యంకావటంలేదు.

మనం దేశానికి ఉన్నశక్తి ఎంతో గమనించి, అందుకు తగిన ప్రణాళికను రచించటం ఆమోదయోగ్యంగా ఉంటుంది. కాని ఆచరణలో నేడు అడుగడుగునా ఎదురౌతున్న చిక్కులే మన అంచనాలలో ఎక్కడో లోపం ఉన్నట్లు స్పష్టం చేస్తున్నాయి. అందువల్లనే దేశంలో అసంతృప్తి, నిరుత్సాహం, నిస్పృహ ప్రబలమై, జాతీయతాభిమానాన్ని సైతం చంపివేస్తున్నాయి.

కులద్వేషాలను మతద్వేషాలను రెచ్చగొట్టి, ఎప్పటికప్పుడు, ఎక్కడికక్కడ, తగాదాలను పురికొల్పటం జరుగుతున్నది. ఇందులో ప్రాంతీయ భాషాభిమానాలు, జాతీయ భాషాభిమానాలు. కళాభిమానాలు, విజ్ఞాన సంస్కృతీ వికాసాల ప్రాభవాభిమానాలు పరస్పర ద్వేషాలకు కారణమై, ప్రతి కార్యమూ సాధ్యమైనంత త్వరలో చెడిపోవటానికి మాత్రం తోడ్పడుతు న్నాయి. దీని నంతటినీ ఎవరో కొందరు వ్యక్తుల స్వార్థాలకు అంటగట్టి, యావద్భారత దేశాన్నీ పాక్షిక రాజకీయాలకూ, సిద్ధాంతాలకూ బలిచేస్తున్నారు. ఇందులో న్యాయాన్యాయాలను తర్కించటం మాత్రం లేదు.

ఇలా న్యాయాన్యాయాలను తర్కించని పద్ధతి పాశ్చాత్య సంస్కృతి వల్ల మనకు అబ్బింది. మన నాయకు లందరూ ప్రాచ్య పద్ధతికంటె, పాశ్చాత్య పద్ధతిపై మోజుకలవారు. అందువల్లనే మన కీ అవ్యవస్థ ఈనాడు ఏర్పడింది.

శ్రీ అరవింద మహర్షి పాశ్చాత్య విద్యా సంస్కారాలను చవిచూచి, ప్రాచ్య విద్యా సంస్కారాలే గొప్పవని అంగీకరించి, మానవ కళ్యాణం ఒక్క భారత జాతీయ ధర్మ ప్రబోధం వల్లనే జరుగుతుందని స్పష్టం చేసాడు. మన రాజకీయ నాయకు లందరూ విద్యా విజ్ఞానాల ప్రచారం చేస్తారు దేశంలో విద్యా ప్రమాణం పెంచడంగానీ, విజ్ఞాన వ్యాప్తిపై ప్రేమాదరాలు కలిగి వుండడంగానీ, ఆచరణలో మాత్రం కన్పించడం లేదు.

బుద్ధుడు, శంకరుడు, రామానుజుడు, మున్నగు ప్రవక్తల ప్రబోధ ప్రచారాలే ఒకొక్క నాడు ఒకొక్క విధంగా జాతిని జాగృతంచేసిన సంగతి మనకు తెలుసు. అలాగే ఇటీవల గాంధీ అరవిందుల ప్రబోధం కూడా.

మన పాలకులు పాలితుల యెడల ప్రేమాదరాలు కలిగి ప్రవర్తించాలి. విద్యా విజ్ఞాన సముపార్జనకు, కళాసంస్కృతుల పరిపుష్టికి దోహదంచేసి, పాలితుల మనోవికాసానికి తోడ్పడి నప్పుడు జాతి సచేతనమై కళామయం కాగలదు.

ఇది అసాధారణమైన విషయమే. కాని, పాలకులకు ధర్మచింతన, న్యాయదృష్టి ఉన్న ప్పుడు, ఇది అసాధ్యం మాత్రం కాదు.

ప్రపంచంలో మతంలేని జాతిలేదు. కాని మన దేశంలో మాత్రం మత ప్రసక్తిలేనిజాతిని రూపొందించాలని ప్రతినిత్యం ప్రచారం జరుగుతున్నది. ఇది సహజమా, సహేతుకమాఅన్న మీమాంస బహుతర్కవగా కనిపిస్తుంది.

గాంధీజీ మత ప్రియుడు. ఒక్క మతప్రియుడు మాత్రమేకాదు, మత ప్రవక్త కూడా.

ఈనాడు అందరూ గాంధీజీ మతస్థులమని చెప్పటం చూస్తున్నాం. అయితే గాంధీజీకి ప్రత్యేకంగా ఒక మతం లేదు. ఆయనా హిందూమతస్థుడే.

కాని, మతమంటే, ఎందుకో తెలియని ఈర్ష్యా జుగుప్సలను మనపాలకులు తమ ప్రచారంలో ప్రకటిస్తున్నారు. ఇది మానవాభ్యుదయానికి దోహదం చేయదు; కళాసంస్కృతుల వికాసానికి తోడ్పడదు; మానవుని స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకుకూడా దోహదం చేయదు.

కాబట్టి ఈనాడు కళా ప్రియు లందరికీ ఈ విషయంలో ప్రత్యేకమైన బాధ్యతవుంది. అందుకే సాంప్రదాయకమైన భారతీయ విద్యా విజ్ఞానాలపై మన ప్రజలకు మక్కువ కలిగించి ప్రపంచంలోని మానవవిజ్ఞానంలో భారతీయ విజ్ఞానానికి గల అత్యున్నతమైన స్థాయిని పునః స్థాపించటానికి కృషి చేయాలి.

ఈ లక్ష్యంతోనే, ఆంధ్రదేశంలోని సాహిత్య కళా కోవిదుల సహకారంతో, ప్రముఖుల ఆదరాభిమానాలతో, 'నవభారతి' వెలువడుతున్నది. జాతీయ సాహితీ కళాభిమానులైన పాఠకు లందరూ 'నవభారతి'ని కలకాలం వర్ధిల్లేలాగా ప్రోత్సహించి, మాతో సహకరించగలరని భావిస్తు న్నాము.

భారతనీతి

కొంచెమైనను దగఁబంచి కుడుపుమేలు, పసులయెడ దుఃఖమోర్చి యల్పంబు సుఖము
ననుభవించుట హితము, శత్రునకునైన నిచ్చుటయె లెస్స యడిగినయెడ; నృపాల.

శ్రీమద్రామాయణ కల్పవృక్షము
శిల్ప దృష్టి

[భారత భాగవతములకు వలె తెలుగున సర్వజన శిరోధార్యమైన రామాయణ మహాకావ్యమొకటి లేకుండుట మొదటినుండియు లోటుగనే యుండినది. అట్టి లోటును కవిసమ్రాట్, శ్రీ విశ్వనాథ సత్యనారాయణ రచించిన శ్రీమద్రామాయణ కల్పవృక్షము తీర్చగలదనియే మా యభిప్రాయము. కేవలైతిహ్యమే కాక, ఆది కావ్యమైన రామాయణమును శ్రీ సత్యనారాయణ తమ చిత్రమైన అనల్ప శిల్పకల్పనముతో నాంధ్రీకరించుట వలన, దానికి కొంత వ్యాఖ్యాన మవసరమగుట సహజము. ఒక సాహిత్య పత్రికకు గల యవధిలో నంతటి మహాకావ్యమునకు సమగ్ర వ్యాఖ్య సేయుట సాధ్యము కాకున్నను, పరిత్ప జనోపయోగమునకై అటునట కొన్ని పద్యములను కొన్ని ఘట్టములను సశిల్ప వ్యాఖ్యానముగా ప్రకటింప వలెనని మా యభిమతము.

తత్ప్రారంభముగా ఈ సంచికయందు సూత్రప్రాయములైన నాల్గు పద్యములను, సవ్యాఖ్యానము, ప్రకటించుచున్నాము.
—సంపాదకులు]

౧

కఠిన స్తనోపరి గ్రైవేయ మణికాంతి కర్ణతాటంకంబు గాడిపఱుప,
క్రమ నితంబాగ్రకాంచి కింకిణులతోఁ గరకంకణ ధ్వనుల్ కలఁతఁబూన,
మౌళి క్లప్త శశాంక మాలాతపములపై ఫాలస్థలీజ్యోతి పాఱువెట్ట
తత్కాల విచలితాధరహాస మాధుర్య మాత్మప్రసన్నత నగడుపఱుప
పాలితాన్యోన్య లంఘన స్పర్థములును జాలితాన్యోన్య సౌందర్య సరసములును
నైన పలుకుల కూడిక యనఁగనొప్పు శారదామూర్తి నాయెదఁ జాలుఁగాక.

ఇది సరస్వతీ వర్ణనము. మెడలోని హారమణుల కాంతి చెవిదుద్దుల మణులతో, మొలనూలి మువ్వలు చేతి కంకణముల గంటలతో, తలమీఁది చంద్రకాంతి ఫాలమునందలి జ్యోతితో, నవ్వు ఆత్మ ప్రసన్నతతో సంవాదము చేయుచున్నవి. ఇది శారదా స్వరూపముగా కవి చెప్పినాడు. ఆమె పలుకుల కూడిక- ఆపలుకులు ఒకదాని యర్థము మఱొకటి లంఘించును. ఒకదాని యందమును మఱొకటి దీపింపఁ జేయును. ఇది శారదా స్వరూపము. ఆ శారదామూర్తి తన 'యెదఁజాలు' ననుచున్నాడు. అనఁగా తన రామాయణము ఇట్టి శిల్పముచేత ప్రకాశించునని కవి తాత్పర్యము. (దీనినే కవి 'ప్రసన్నకథ'లో కాని, ఇందారంభింపఁబడిన 'అల్లిక జగిబిగి'లో గాని చెప్పినాడు; చెప్పుచున్నాడు.)

౨

[విశ్వామిత్రుఁడు బ్రహ్మర్షియగుటకు ఉత్తర దిక్కున తపస్సు చేయుచున్నాడు. తత్పూర్వమే మేనకా కథ యైనది. ఇంద్రుఁడు మరల నతని తపోభంగమునకు రంభను పంపించినాడు. రంభయు, మన్మథుఁడు, వాని చిలుక పౌజు, కోకిల బాకాలు, వనమునందు చేరినవి. ఆనాడు శిశిర మంతమైనది. కౌశికీ కుల్యాజలమువదలి ఋషి లేతయెండలో తన యొడలార్చుకొనుచున్నాడు]

చుఱచుఱ నెత్తినై చూచెడు చివురాకు, చివురాకు వెనుకఁ బొంచిన లతాంత
బాణుండు విసరగాఁ బట్టిన పిడిబాకు, పిడిబాకు రివ్వున విసరదూసి

సన్న సవ్వడివోని సన్నని పికివాకు, పికివాకుతో మేళవించి సన్న
గొంతుసవ్వడితోడ గులుకు నచ్చరపోకు, పిసుపీకుగా నొక్క పెట్టఁదోచి,
తోచుటాలస్యముగఁ గింగిణీ చణచణ నినద కన దబ్జపద సమానీత మధుర
గీతికారసవార్ధిపొంగిన తరంగమచ్చరయు గన్నులను హృదయమునఁబొడువ.

చివురా కెత్తినై చూచుట, దాని వెనక పొంచిన మన్మథుఁడు పిడిబాకు విసరుట, ఆధ్వనిలో కలిసిన గొంతుతో రంభమాటాడుట— ఇవన్నియు నొక్కసారి తోచినవి. ఇందలి యలంకారము ముక్తపదగ్రస్తము. ఏకకాలికముగా జరిగిన ఈ వ్యవహారము ముక్తపదగ్రస్తముచేత నైకకాలిక వ్యవహారత్వముగా తోచుట చేయఁబడినది. ఇది యలంకారము నలంకారము కొఱకు కాక, అన్య ప్రయోజనార్థము కల్పించుట.

3

[రామ లక్ష్మణులు గాధేయుని వెంట విశాలా నగరమునకు పోయిరి. అచట విశాలాపతి వారిని కలిసికొనెను. రామలక్ష్మణులను చూచెను. ఆ పూర్వమే గంగావతరణము, స్కంద జన్మ వృత్తాంతము, సముద్ర మథనము మొదలైన కథలు విశ్వామిత్రుఁడు రామలక్ష్మణులతో చెప్పెను. ఆ విశాలాపతి రామలక్ష్మణులను జూచి ఇట్లన్నాడు.]

నడకయొన్గుల మృగేంద్రములది, యాకృతి వ్యాఘ్రపుంగవములయదియు, నంద
మది జయంత కుబేరులది, కన్నుదీప్పు కల్హార నీరేజంబులదియ; యీ కు
మారు లెవ్వరు? దేవతా రూప వంతులు కత్తిదాల్చిన తీరు, గార్ముకంబు
పట్టిన తీరును, గట్టిన తీరు తూణీర యుగ్మము; సమానీత మైన
గంగ వ్యోమ భూమిగత రెండుపాయలో? స్కందుఁడును విశాఖుడిందు చనిరో?
సృష్టి మూలహేతు విష్టి రెండయ్యెనో? ప్రభువు లేల నడచి వత్తురొక్కొ?

చూచుచున్న యారాజునకు వారు కత్తిదాల్చిన తీరు, గంగ స్వర్గ మర్త్య లోకములయందు రెండు పాయలుగా నున్నట్లున్నదఁట. కార్ముకము పట్టిన తరహా స్కంద విశాఖులిద్దఱు వచ్చుచున్నట్లున్నదఁట. అమ్ముల పొదులు కట్టిన పద్ధతి సృష్టి మూలహేతువైన యిష్టి రెండుగా వచ్చినట్లున్నదఁట.

వారు వినిన కథలలోని యాత్మ వారియందు ప్రకాశించుచున్నదని దీని యర్థము. వారా కథలను విన్నలక్షణ మట్టిది. ఆ కథలను వారాత్మలతో వినిరి. ఆ లక్షణములు వారి శరీరములయందు సంక్రమించెను. ఈ సంక్రమించుట బుద్ధిశాలి యైనవానికి విస్పష్టముగా గన్పించుచున్నది. కథలు ఎట్లు వినవలయునో; రామలక్ష్మణులెట్టి శుశ్రూషా పరులో దీనియందుఁ జెప్పఁబడినది.

౪

[దశరథుఁడు పుత్రకామేష్టి చేయవలయునని నిశ్చయించినాడు. అతని భార్యలు దీక్షా గ్రహణము చేసినారు. రాజానంద వివశుఁడై మేడపై కెక్కినాడు. చంద్రోదయ మగుచున్నది.]


క్రతుయత్న మెంతదూరము వచ్చెనోచూడ వెల్లేన్గు వజ్రి పంపించె నొక్కొ,
యజ్ఞాగతునకు నారాయణునకు మున్ గదలి పాంచజన్యంబు తరలె నొక్కొ,
యాగ ఫలంబైన యమృత కుంభముమింటఁ దెరలి ప్రాగ్దిశ బయల్దేరె నొక్కొ,
మైత్రావరుణి ప్రేమ మంజు లాశీర్వాద వల్లిక తలపూవు వదరె నొక్కొ,
అష్ట తనువుల హోత్రియైనట్టి తనువుఁబూని, రుద్ర సంరంభ విభూతి చెదరి
ముందునకుఁదూగెనోయననిందుబింబ మల్లఁబ్రాచిబారెడు పైనిహాసులొలికె.

క్రతువులు దేవతలకు ప్రియములు. అందుచేత నింద్రుఁడు ఈ క్రతు వెంతదూరము వచ్చిన దని కనుగొని రమ్మని యైరావతమును పంపించెనేమో! ఈ యజ్ఞమునకు నారాయణుఁడు రాఁగలడు. ఆయన కంటె ముందర నాయన శంఖము వచ్చెనేమో! ఆయాగమునకు ఫల మమృత కుంభము. అదే బయలుదేరెనేమో! వశిష్ఠుని ఆశీర్వాద మను తీవ పూవు పూచెనేమో! అని ఉత్ప్రేక్షలు. ఇవి, కథాసంబంధములు. ఈ కావ్యమున పలుచోట్ల చేసెడి వర్ణనము లిట్లు కథాద్యోతకములై కాని అచట నున్న మనః పరిస్థితిని జెప్పెడు నట్టివై కాని యుండును. ఆ చంద్రుని చూచి నంతటనే దశరథునకు తాను చేయబోవు మహాయజ్ఞము నం దమితోత్సాహము కల్గినదని యర్థము. ఇన్ని యుత్ప్రేక్షలైన తర్వాత చంద్రుఁడు చంద్రుఁడుగానే భాసించినాడు. శివుఁ డష్టతనువు. పంచభూతములు, సూర్యచంద్రులు, యజమానుఁడు- ఈ ఎనిమిది శివుని తనువులు యజమానుఁడైన తనువు యజ్ఞాకృతి. అది చూచుచున్నది. ఆవేళ చంద్రుఁడు కూడ నతని యొక తనువుగదా! అతఁడు ముందునకు వచ్చినాఁడు. చంద్రుఁడు చంద్రుఁడుగా భాసించుచునే యున్నాడు; కాని శివునియొక్క తనువులలో నొకఁడన్న బుద్ధి స్ఫురింపఁజేయుచున్నాడు. క్రతు కిరణమునకు ఉత్సాహము కల్పించుచున్నాడు.

జూలై నెల సంచికలో.

బాలకాండమునందలి

సముద్ర మథనగత శిల్పము



పునరాగమనము

చిత్రశిల్పి : శ్రీ వెల్లటూరి పూర్ణానందశర్మ

యశోధర

విద్వాన్, శ్రీ ప్రయాగ కోదండరామశాస్త్రి, బి ఏ

సుమ దామ సుందర భ్రమమాణ బంభర ప్రణదిత ద్వార తోరణముతోడ,
పార్శ్వస్థ తరు లతా పరిపుష్ట పరభృత ప్రత్యగ్ర రాజ మార్గములతోడ,
స తటిత్సగ ర్జాబ్ద సమ సజ్జిత మదోత్థ, బృంహి తానేకప శ్రేణితోడ,
విరజీకృత మహాధ్వ విలస ద్రజోగంధ, మిళ దప్సర స్స్వర మేళతోడ,
నెదురు సనుదెంచి, తన కన్ను లెల్ల విచ్చి, పట్టపగలింటి దివిటీలు పట్టినిలచె :
నాగతుం డగు నన్న తథాగతునకు, కపిలవాస్తు పురంబు స్వాగత మొసంగ.

౨

ఆతడు వచ్చునంచు వినినంత, యశోధర మేను వెల్లనై
చేతము జల్లనెన్ – తనకు చేసిన యెగ్గొక సిగ్గుగా, తదీ
యాతతమూర్తి హృత్కుహరమందు వెలింగిన యంత, చెక్కిళుల్
లేత గులాబి పూత లయి, లేమ సమస్తము విస్మరించెడున్.

౩

దాసీ జనమ్ము కైసేసి తోడ్కొని పోవు టెరుగునో యెరుగదో జరిగిపోయె,
రాణమై వచ్చిన రాచ బిడ్డను గాంచెనో లేదో కాని, చే యూది నడిచె,
చతురంత యాన మన్మతి యున్నదో లేదో, పట్టితో పాటు తా పదము మోపె,
ఘంటా పథమ్ము సింగారమ్ము జూచెనో, చూపు నీలా టెల్లచో జెమర్చె,
తలవని తలంపుగానో, లో దలచినట్టి తలపు ఫలముగనో, యశోధర విషణ్ణ
తాప్రసన్నత లాకృతి దాల్చి చూచు గౌతముని రాక కగ్ర భాగమునయందు.

౪

మృణ్మయ పాత్ర చేగొని దరిద్ర గృహమ్ముల వెంట భిక్షుకుం
డున్మిష దాత్మ తేజమున నొప్పెడు వాడొక డేగ, జూచి 'మా
రాణ్మణి' యన్న తత్ప్రజ విరావమునన్, వివశీకృతాంగయై
తన్మయ చిత్తయై సతి, తదర్థము, పర్వున బోయె నయ్యెడన్.

౫

శ్రీ కరం బైన గౌరీ శంక రాచ్ఛ తేజః పూర్ణ శిఖరంబు జాడ నిలచి
తనవంక జూచియు, మనసున కందని మమత సూపుచు, తన్ను మరులుగొలుపు
పతిని ద్వంద్వాతీతమతి నయ్యతిని జూచి, యొద్దకుసాగి, బాహువులు సాచి,
మొనసి కంఠాశ్లేష మొనరించుకొని, యంత-నవశమ్ము లగు నింద్రియముల వలన
తనకు ప్రాపైన తరు మూలమునకు నొదుగు, చలిత లతవోలె తత్పదంబులకు వ్రాలి
విడువనేరద, యొకమాట నుడువనేరదాయశోధర; యేమి తాదాత్మ్య మొక్కొ!

౫

గౌతము మూర్తిలో, నొక వికారము లేదు, తదీయ దృష్టి ని
ర్వాత పద ప్రదీప శిఖ ద్భాతి వెలింగెడు; పౌరు లెల్లరున్
చేతులలో నెదల్ మొగిచి నిల్చి; రతం డట నా మెమూర్ధమున్
చేతుల బుచ్చి తె మ్మనిన చెన్ను ఘటించెను; లేచె నామెయున్.

౬

లేచి, యాతనివంక లో గన్నులు సాచి, పుల్కు పుల్కున జూచి, పొడ మొసంగ బడని శూన్యత్వంబు పొడగాంచి, కాంచిన యంత నయ్యది తనయందు దోచి నటులనై, శూన్యంబులైన చూపుల వాని నటులనే చూచుచు, నల్ల నల్ల నడుగు వెన్కకునైచి, యెడగల్గ నిల్చి – తానీ యెల్ల వాన వ్యాపించి నట్టు లెల్లయవి తనయందు భాసిల్లినట్టు – లౌక మహాద్వైత బుద్ధి లోనొదవి, యంత నా యశోధర తేజోమయాత్మ లగ్న మానసమ్మున నక్షి పద్మములు మోడ్చె.

౭

అంత ననంత కాంతుల వియత్తటినీ విసృతాంబు శీకరా
త్యంతము, లద్భుతావహము, లభ్రగర త్కరి కుంభ ముక్తము
క్తాంత రమేయ రోచి రుదయంబులు, శక్ర ధను ర్విలాస వి
క్రాంతములై ధరం గురిసె, కల్ప లతాంత నితాంత వర్షముల్.

౮

తత్ప్రభాసార సమభిషిక్తార్ద్ర మూర్తి, బుద్ధదేవుడు, తా మును ముందు నడువ నతని వెనువెంట నామెయు; నంత నెల్లవారు సాగిరి ముక్త సంసారు లగుచు.

*

హేతువాదము

హేతు బుద్ధిని విశేషంగా ఉపయోగించి చేసే సంస్కరణలూ, విధి నిషేధాలు నిబంధించే సంస్కరణలూ సాధారణంగా ఆధ్యాత్మిక జ్ఞాన సంపత్తి, నిరంతర తత్పరతా లేని మతాలను సృష్టిస్తాయి. ఇట్టి మతములు నిస్సారములై స్వరూప ప్రాబల్యములు లేక శుష్కములును నీరసములును అగును. నిజంగా హేతువాదము ఉపయోగపడవలెనంటే, అది సర్వదా ఆధ్యాత్మికోన్నతితో ఆత్మ దృష్టితో సమన్వితమై యుండవలెను. శుష్క హేతు వాదము నిరర్థకము.

—శ్రీ అరవింద మహర్షి

భ ద్ర కా ళి

శ్రీ 'అమరేంద్ర'

౧

"ఎవరూ?" అంటూ ఉలిక్కిపడి లేచింది భద్రమ్మ.

"ఎవరూ లేరులే. నేనే" అని చెప్పులు తొడుక్కుంటూ బదులు పలికాడు భర్త ఈశ్వర్రావు.

"ఇంకా పడుకోలేదుటండీ? ఎక్కడికీ బయలుదేరారు? అర్ధరాత్రివేళ ఎక్కడికండీ?" అంటూ లేచివచ్చింది భద్రమ్మ.

'నిద్ర రావటంలేదు. కాస్సేపు అల్లా వెన్నెట్లో నది ఒడ్డుకి వెళ్దామని బయలుదేరాను." అన్నాడు ఈశ్వర్రావు ఖద్దరు శాలువ మీద వేసుకుంటూ.

"కళ్ళుమూసుకుంటే అదేపడుతుంది నిద్ర. ఎవరైనా నవ్విపోతారు. ఈ అర్ధరాత్రి ఒంటరిగా నది ఒడ్డున షికారేమిటండీ?"

"మనస్సుకి కాస్త హాయి దొరుకుతుందని బయలుదేరాను."

"అయితే ఇల్లు మీకు నరకంగా వుందన్న మాట! ఏంకష్టపడి పోతున్నారో నాతో! అసలు నా పొడ అంటేనే మీకు గిట్టదాయె. నేను మీకళ్ళకి భూతంలాగా వుంటానాయె–" అని అనర్గళంగా భద్రమ్మ మాట్లాడేస్తుంటే మధ్యలో అడ్డు తగిలి "ఎందుకిప్పుడీ రభస? నేనేమీ అనకపోయినా ఏమిటీ రగడ?" అని విసుగ్గా, బాధగా అన్నాడు భర్త.

"అవున్లెండి. నేను నోరు కదిపితేనే మీకు రగడగా వుంటుంది. నా నోరు ఒక్కసారి పడిపోయినా బాగుండును పీడా విరగడవుతుంది" అని భద్రమ్మ మెల్లిగా రాగంలోకి దిగి చేత్తో రపీమని తలబాదుకుంది.

ఈశ్వర్రావు గది తలుపు దగ్గరికివేసి మెట్లు దిగబోతున్నాడు. "నామీద ఒట్టు. నన్ను చంపుకున్నట్లే" అని భద్రమ్మ లోపలనుంచి అరిచింది. ఈవొట్లూ తిట్లూ ఒక్కసారి అయితే విలువవుంటుంది. కాని అనుక్షణమూ అవే అయితే ఎవరు లక్ష్యపెడతారు? వెనక్కి తిరగకుండా భర్త ముందుకి సాగిపోతున్నాడు. భద్రమ్మకి ఎక్కడలేని ఆక్రోశమూ పుట్టుకొచ్చింది. చుట్టుప్రక్కల వాళ్ళందరూ అదిరిపడి నిద్రలేచేటంత బిగ్గరగా "అయ్యయ్యో! చచ్చాను. ప్రాణం పోతోంది. తేలరా తేలు. అమ్మో గుండెల దాకా ఎక్కిపోతోందర్రా విషం" అంటూ కేకలు పెట్టింది.

రక్కున ఆగిపోయి గబగబా పైకి వెళ్ళాడు ఈశ్వర్రావు. కేకలు విని ఇరుగుపొరుగువాళ్లు పరుగెత్తుకొచ్చి ఎవరికి తోచిన మందు వాళ్ళు వేస్తున్నారు. భర్త తిరిగి రావటం చూసి భద్రమ్మ కొంచెం స్థాయి తగ్గించింది. కాస్సేపటికల్లా "ఎంత గొప్పమంత్రమండీ, శాస్త్రుల్లు బాబుగారూ! చేత్తో తీసేసినట్లు తగ్గిందండీ. నా ప్రాణం నిలిపారండీ!" అని భద్రమ్మ పక్కింటి శాస్త్రుల్లుగారిని శ్లాఘించింది, బాధంతా ఎక్కడికి ఎగిరిపోయిందో!-ఆ పొగడ్తకు ఉబ్బితబ్బిబ్బయిపోయి తనకి పాముమంత్రం కూడా వచ్చుననీ, సగం పోయిన ప్రాణాన్నయినా తిరిగి రప్పిస్తాననీ ఒక పది నిమిషాలు ఉపన్యాసం ఇచ్చి ఇంటిదారిపట్టాడు శాస్త్రుల్లుగారు. ఎక్కడివారక్కడ సర్దుకున్నారు.

ఈశ్వర్రావు పక్కమీద వాలి భగ్గుమంటున్న కళ్ళని బలవంతాన మూసుకున్నాడు

కిక్కురు మనకుండా భద్రమ్మ మంచం ఎక్కి కాస్సేపట్లో గుర్రు మొదలుపెట్టింది.

అనుక్షణమూ తన మనస్సుని బాధించటంలో భార్యకి ఏం ఆనందం ఏం తృప్తి దొరుకుతయ్యో? ఎందుకిల్లా తనని వేధిస్తూ వుంటుందో? నది ఒడ్డుకి వెళ్ళి అలలమీద వెండి వెలుగులు మెరిపించే వెన్నెల కేసి చూడటం కోసం అతని మనస్సు ఎంతో ఆరాటపడింది. కాని అడుగడుగునా నిరోధాలే! నిద్రపోతున్న భార్యకేసి చూస్తుంటే ఈశ్వర్రావు గుండెల్లో ఏదో దావానలం నాలుకలు చాపినట్లయింది. అతని సర్వస్వాన్ని ఆ జ్వాల దహించి వేస్తున్నట్లుగా వుంది.

౨

"నేను కూడా వొస్తాను మీతో" అని దారికి అడ్డంగా నిలబడింది భద్రమ్మ.

"నువ్వా? దేనికి? నేను ఎల్లుండి తిరిగి వచ్చేస్తానుగా. రేపు ఒక్క రోజేగా మధ్య. రానూపోనూ అనవసరమైన ప్రయాస దేనికి?" అని బుజ్జగింపుగా అన్నాడు ఈశ్వర్రావు, కంఠంలో ఏమాత్రం విసుగుదలా కనపడనివ్వకుండా. విసుక్కుంటే భార్య మరీ రెచ్చిపోతుందని అతనికి తెలుసు. ఇవాళ నెమ్మదిగా చెప్పినా భద్రమ్మ తలకి ఎక్కటంలేదు. వస్తున్నానని రాసి ఆఖరినిమిషంలో మానుకోటానిక మనసొప్పటంలేదు. సభకి సన్నాహాలన్నీ పూర్తిచేసుకొని తనకోసం ఎదురుచూస్తూ వుంటారు. తను వెళ్ళకపోతే వాళ్ళకి చాలా నిరుత్సాహం, ఆశాభంగం కలుగుతయ్. గట్టిగా వద్దని వారిస్తే భద్రమ్మ ఇంకేం అఘాయిత్యం చేస్తుందో? అసలు ప్రయాణానికే ఎసరుపెట్టగలదు కూడా.

"మిమ్మల్ని ఇంతమంది విని సంతోషిస్తూ వుంటారు కదా? నేనేపాపం చేసుకున్నానండీ? ఒక్కసభకైనా నన్ను తీసుకుపోరు కదా? నేనుమటుకు వినకూడదా యేమిటి?" అని భర్త అనుమతికోసం ఎదురు చూడకుండానే పరుపు చుట్ట సర్దుతున్నది.

ఇక భద్రమ్మని ఆపటం ఎవరికీ శక్యం కాదని గ్రహించి ఈశ్వర్రావు 'సరే బయలుదేరూ' అన్నాడు. భార్య మొహం విప్పారింది. గబగబా సర్దేసుకుని ఇంటికి తాళంపెట్టి బండీ ఎక్కింది.

ఆడవాళ్ల ఇంటరులో ఎక్కించాడు ఈశ్వర్రావు తను పక్కపెట్టెలో ఎక్కాడు. ఒక్కత్తే బిక్కుబిక్కుమంటూ కూచుంది భద్రమ్మ. మనస్సంతా అల్లకల్లోలంగా వుంది. తను వెంటపడి రావటం దేనికి? ఎందుకో తన మనస్సులో ఒకటే భయం! ఏ నిమిషంలో అయినా భర్త తన చేతుల్లోంచి జారిపోతాడేమో నని ఒకటే దుడుకు మనసులో. పరిగెత్తే పాదరసంలాగా కనబడతాడు భర్త ఆమె కళ్లకి. విలాసంగా వుండే అతనివేషం, పెదవులమీద మెరిసే చిరునవ్వూ, ఉంగరాలుతిరిగి బుజాలమీదికి పడుతూ నిగనిగలాడే ముచ్చటైన క్రాపూ, ఎవర్ని ఆకర్షించవు? గ్లాస్కో లాల్చీలోంచితొంగిచూసేఅతని బంగారపు శరీరకాంతి చూస్తే ఎవళ్లకి కళ్లు కుట్టవూ? అందుకే భర్తని నిమిషం విడవటానిక్కూడా భద్రమ్మ మనస్సు ససేమిరా ఒప్పుకోదు.

రైలు కదిలేముందు పెట్టెలోకి ఎవరో యువతి వచ్చింది. పలాచటి జార్జెటుచీరలో మిస మిస లాడిపోతోంది. వొంటిమీద తనకున్నవాటిలో వెయ్యోవంతు నగలైనా లేకపోయినా ఆ అమ్మాయికేసి చూసినకొద్దీ చూడాలనిపిస్తోంది. కళ్లు మిలమిల మెరిసిపోతున్నయ్, కాటుక సొగసులతో. చేతివేళ్లు కూడా సన్నగా, పొడుగ్గా అశోకవృక్షపు ఆకుల్లాగా వున్నయ్. నడకలో, కట్టులో, బొట్టులో ఏదో చెప్పలేని ఒయ్యారం నాజూకూ ఉట్టిపడుతున్నయ్. నవ్వుతుంటే గులాబి పెదవుల్లోంచి ముత్యాల్లాంటి పళ్లు వరస తొంగి చూస్తోంది. రైలు కదలబోతుంటే ఒక్కతే వచ్చి ఎక్కింది. బోలెడంత సరంజామా వుంది.

తోడు దొరికినందుకు భద్రమ్మ మనస్సు పొంగిపోయింది "ఏ వూరు వెళ్తున్నావమ్మా" అని మాట కలిపింది భద్రమ్మ.

తనూ భర్తా వెళ్తున్న వూరిపేరే ఆ యువతి చెప్పేసరికి భద్రమ్మ ప్రాణాలు ఎగిరి పోయినయ్.

"ఏం పనిమీద వెళ్తున్నావమ్మా? పేరేమిటో అడిగానుకాను. ఆరి నాతెలివి తెల్లారిపోనూ!" అంది భద్రమ్మ.

"నాపేరు లీల. రేపు అక్కడొక సభలో మాట్లాడటానికి వెళ్తున్నానండీ." అని వినయంగా బదులు చెప్పి కూలీలు సామాను ఎక్కించేటప్పుడు బొమ్మల కేమైనా దెబ్బ తగిలిందేమోనని ఒక్కొక్కటే విప్పి మళ్లీ కడుతోంది.

కళ్లు అప్పగించిచూస్తూ కూచుంది భద్రమ్మ. ఈ దిసి మొల బొమ్మలేమిటీ? ఆ అమ్మాయి బంగారంలాగా, అల్లాచూసిందే మళ్లీ చూస్తూ, కూచుంటుందేమిటో అని ముక్కున వేలువేసుకుంది.

ఇంతలో పక్కస్టేషను వచ్చింది. "నేను పడుకుంటున్నాను. నీకు ఇంకేమైనా కావాలా? చెంబునిండా మంచినీళ్లున్నయ్యా అంటూ"?

కిటికీ దగ్గిరికొచ్చి లోపలికి తొంగిచూశాడుభర్త.

భర్తకి తనమీద ఇంతఅపేక్ష వుందనీ, ఇల్లా కనుక్కోటానికి వస్తాడనీ అనుకోలేదుభద్రమ్మ. ఒక్కసారి కొండకొమ్ముకెగిరి గంతేసిందావిడ గుండె. తెలియకుండానే కంఠంలో కోమలత్వం నిండిపోయింది. "నాకేం కావాలి!" అంది.

బొమ్మలమీంచి తలపైకెత్తి "నమస్కారం ఈశ్వర్రావుగారూ! మీరూ ఈబండికే వస్తున్నారన్నమాట!" అంది లీల.

"నమస్కారం. చాలా బొమ్మలుకూడా తెస్తున్నట్టున్నారే?" అన్నాడు ఈశ్వర్రావు.

"అవును. ఈ మధ్య మీ పద్యాలకి కొన్ని బొమ్మలు గీశాను. అవి మీకు చూపుదామని"

"ఓహో! అల్లాగా. చాలా సంతోషం."అంటుంటే ఈశ్వర్రావుముఖం చిరునవ్వుతో మెరిసింది. ఉక్కిరిబిక్కిరయి పోతోంది భద్రమ్మ. తను ఉన్నసంగతే మరిచిపోయినట్లు భర్త ఆ అమ్మాయితో నవ్వుతూ మాట్లేడేస్తున్నాడు. ఒకవేళ వీళ్ళిద్దరూ ముందుగా కూడ బలుక్కుని ఒకే రైల్లో వస్తున్నారేమో? అందుకోసమే భర్త తనని కూడా రావద్దన్నాడేమో!

ఇంతలో మళ్ళీ రైలు కదిలింది. భర్త వెళ్ళిపోయాడు. కొంచెంసేపు ఎవరూమాట్లాడలేదు.

"ఈశ్వర్రావుగారు ఏమవుతారండి మీకు? తమ్ముడా?" అని అడిగింది లీల అమాయకంగా.

కొరకొరచూస్తూ, లోపలపళ్లు పటపట కొరుకుతూ "మావారు" అంది భద్రమ్మ. తెలిసే ఈ అమ్మాయి తనని ఎగతాళి చెయ్యడానికి అడుగుతున్నదేమోనని భద్రమ్మ భగ్గున మండిపోయింది.

"అల్లాగా!" అంటూ అక్కడే దిగజారిపోయింది లీల. బలవంతాన గిన్నెడు ఆముదం గొంతుకలో పోసినట్లుగా వుంది లీలకి.

కోపంతో భద్రమ్మ పరుపుచుట్ట మీదికి ఒరిగి కళ్లుమూసుకుంది. తను రావటం ఎంత మంచిదయిందో! లేకపోతే భర్తని ఈ సీతాకోకచిలక తనకి దక్కనిచ్చేదేనా? తను ఎంత లావుగా వుంటేమాత్రం భర్తకి అక్కలాగా అగపడుతుందా? ఇదంతా ఈ జిత్తులమారి ఎత్తిపొడుపు కాకపోతే యేమిటి? అంత హేళనా? అంతమిడిసిపాటా? తనకి అందం లేదని ఒకరు చెప్పాలా యేమిటి? తన ఎత్తుపళ్లు బైటికి పొడుచుకొస్తున్నయ్. తన కళ్లు లోతుగా వుంటయ్. కొంచెం మెల్లవున్నమాట కూడా నిజమే. తను లావుగా, పొడుగ్గా, నల్లగా వున్నానని భద్రమ్మకి తెలుసు. తన వొళ్లు దొందపారి జవజవలాడుతూ వుంటుందని తెలుసు. అన్నీ తెలుసును కనకే, భర్తఎక్కడతన చెయ్యి జారిపోతాడో అని ఒకటేభయం భద్రమ్మకి! పక్కపక్కన నుంచుంటే కాకిముక్కున దొండపండులాగా వుంటాడు భర్త. అందుకే అస్తమానమూ భర్తని తన గుప్పెట్లో వుంచుకోవాలని భద్రమ్మకి అంత ఆరాటం. పెళ్ళి అయిన కొత్తలో నాయనమ్మ చెప్పినమాట భద్రమ్మకి వేదవాక్కు అయిపోయింది. "మంచి మొగుడు దొరికాడని మిడిసిపడబోకు పిచ్చికిల్లా! అందగాడైన భర్తని కొంగున ముడివేసుకోవాలి, జాగర్త" అంది నాయనమ్మ. ఆ మాటలే భద్రకాళి గుండెల్లో ఎప్పుడూ రింగుమంటూ వుంటయ్. అందుకేగా తను ఇవాళ భర్తవెంటపడి వచ్చింది!

3

సభ మంచి పట్టులో వుంది. ఈశ్వర్రావు తనురాసిన పాటలు పాడుతుంటే చీమ చిటుక్కమన్నా వినబడేటంత నిశ్శబ్దంగా వింటున్నారు జనం. ఉత్సాహంగా విద్యార్థులు మధ్యమధ్య చప్పట్లు కొడుతున్నారు. ఈశ్వర్రావు కవి హృదయంలోంచి ఉబికే భావ తరంగాల్లో సభికు లందరూ ఉద్రూత లూగిపోతున్నారు. ఈశ్వర్రావు కంఠంతడి ఆరిపోయింది. ఆగిపోయాడు. పక్కనే కుర్చీలో కూచున్న లీల సభవాళ్ళు తనకోసం ఎదురుగా పెట్టిన కూల్డ్రింకుగ్లాసు మెల్లిగా అతనికిఅందించింది.

గ్లాసు నోటిదగ్గిర పెట్టుకున్నాడో లేదో ముందువరస కుర్చీలో కూచున్న భద్రమ్మ "అమ్మయ్యో!" అని పెద్ద కేకపెట్టి విరుచుకుని ముందుకి పడిపోయింది.

ఈశ్వర్రావు చేతులు గజగజ వణికినయ్. గ్లాసు కిందపడి ఫక్కున ముక్కలైపోయింది. కుర్చీలో కుప్పున కూలబడిపోయాడు.

సభఅంతా రసాభాసఅయిపోయింది. ఎన్నో ఉపచారాలు చేశాకభద్రమ్మకి స్పృహ వచ్చింది.

భార్య మూర్ఛలోవున్నంతసేపూ ఈశ్వర్రావు ముఖంలో కత్తివేస్తే నెత్తురుచుక్కలేదు.

"ఎందుకల్లా వణికి పోతున్నారు?" అని జాలిగా అడిగింది లీల. ఏమీ బదులు చెప్ప లేదు కాని అతని కళ్ళల్లో నీళ్ళు గిర్రున తిరగటం చూసి లీల ఆశ్చర్యపోయింది. అతని ముఖం మీద ఏదో మూగబాధ, మండే ఇనుముతో వేసిన ముద్రలాగా, కొట్టవస్తూ కనిపించింది.

భద్రమ్మ మూర్ఛ తేరుకున్నాక మళ్లీ సభ సాగింది. లీల చిత్రకళనిగురించి కోకిలకంఠంతో ఉపన్యసిస్తుంటే శ్రోతలు ముగ్ధులై పోయారు. ఉపన్యాసాలన్నీ పూర్తికాగానే సభకి వచ్చిన విద్యార్థులూ, విద్యార్థినులూ ఈశ్వర్రావునీ, లీలనీ చుట్టేశారు. వాళ్ళతో కులాసాగా కబుర్లు చెబుతూ, నవ్వుతూ వాళ్ళ పుస్తకాలలో ఆటోగ్రాఫ్‌లు రాస్తున్నారు రావూ,లీలా.

ఆ దృశ్యం కేసి చూస్తుంటే భద్రమ్మ తుకతుక ఉడికిపోయింది. ఏమిటా నవ్వులూ? ఆ కేరింతలూ? ఎందుకు ఆ చకచకలూ, పకపకలూ? అదంతా తనకి అర్థంకాని లోకం లాగా వుంది. ఆ లోకంలోకి తను అడుగు పెట్ట లేదు. ఆ ఆనందలోకంలో ఇంకోళ్ళు నవ్వుతూ తిరుగుతుంటే చూసి ఊరుకోనూ లేదు.

అక్కణ్నుంచి లేచి భర్తకి చెప్పకండా బసలోకి వెళ్ళకుండా సరాసరి స్టేషనుకి వెళ్ళి పోయింది భద్రమ్మ.

భార్యకోసం వెతికి వేసారిపోయాడు ఈశ్వర్రావు. ప్రాణం విసిగిపోయి స్టేషనుకి వచ్చి చూసేసరికి అక్కడ సిమెంటు బల్లమీద గొంతుకూర్చుని, చలికి గజగజ వణుకుతూ కనిపించింది భద్రమ్మ.

"అమ్మయ్యా" అనిపించింది. కాని మరుక్షణంలోనే ఈశ్వర్రావు గుండెల్ని తొలుచుకుంటూ ఆపుకోలేని ఆక్రోశం వచ్చింది. అంతా గొంతుకలోనే దిగమింగుకుని ఇంటికి తిరుగుబండీ ఎక్కాడు. నీడలాగే అడుగులో అడుగు వేసుకుంటూ వచ్చి పక్కనే చతికిల బడింది భద్రమ్మ.

౪

ఒక ఇంట్లోనే వున్నా ఈశ్వర్రావుది ఒక ప్రపంచం. భద్రకాళిది ఇంకో ప్రపంచం. ఈ రెంటిమధ్య దాటరాని అఖాతం.

"ఏమిటీ ఒకటే రాత, బ్రహ్మరాత? దానికి అంతూపొంతూ లేదా? ఎందుకొచ్చిందీ కాగితాల ఖరాబు? కూటికా, గడ్డకా?" అంటూ లైటు ఆర్పేసింది భద్రమ్మ.

నవల మంచి పట్టులోవుంది. ఒళ్ళు మరిచి పోయి గబగబా రాసుకుంటున్న ఈశ్వర్రావు త్రుళ్ళిపడ్డాడు అమాంతంగా భార్య కంఠం నులిమేసే టంత కోపం వచ్చింది.

"నాకు నిద్ర రావటంలేదు. కాస్సేపురాసుకున్నాక లైటు ఆర్పేసి పడుకుంటాను." అంటూ లైటు వెలిగించటానికి లేచాడు.

"నిద్రా భద్రా అక్కర్లేదా? దీపం వుంటే నాకు నిద్రపట్టదు. కరెంటుఖర్చు ఎంతవుతోందా తెలుసా? ఎక్కణ్నుంచి వస్తుంది డబ్బు? చిల్లిగవ్వ సంపాదన లేదు. మానాన్న ధర్మమా అనిఏదోకాస్తఇచ్చి వెళ్ళాడు. లేకపోతే మీతో కాపరం కొరివితోతలగోక్కున్నట్లుగా బాగానే వుండేది! కూచుని తింటుంటే కొండలంతవి హరించుకు పోతయ్. ఏమైనా సరే మీరివాళ లైటు వెలిగిస్తే నన్ను చంపుకున్నట్లే" అని అఘాయిత్యంగా అరిచింది భద్రమ్మ. తన పుట్టింటివారిచ్చిన ఆస్తి మీదే భర్త బతుకుతున్నాడు. తన మూలంగానే భర్త కానీ సంపాయించలేక పోయినా కాలం హాయిగా వెళ్ళిపోతోంది ఈ విషయాన్ని భద్రమ్మనిమిషంకూడా మరవలేదు.

కాగితాలు అక్కడే వొదిలేసి ఈశ్వర్రావు డాబామీదికి వెళ్ళి ఆరుబైట నక్షత్రాల కేసి చూస్తూ నేలమీద వాలాడు.

దూరంనించి ఎవరో ఏడుస్తున్నట్లు వినిపించింది. కంఠాన్నిబట్టి ఎవరో చిన్నకుర్రాడి ఏడుపులాగుంది. పిట్టగోడదగ్గరకి వెళ్ళిచూశాడు ఈశ్వర్రావు. అర్ధరాత్రి చీకట్లో గడప గడప దగ్గిరా ఆగి "అమ్మా" అని కడుపు ఉబ్బేట్లు ఏడుస్తున్నాడు కుర్రాడు. గబగబా కిందికు పరుగెత్తాడు ఈశ్వర్రావు. 'ఎవరబ్బాయివి?'అని అడిగితే తల్లీతండ్రీ ఎవరో చెప్పలేక కుర్రాడు వెక్కివెక్కి ఏడుస్తున్నాడు తెల్లారినాక ఎవరి కుర్రాడో కనుక్కుని అప్పగిద్దామని ఈశ్వర్రావు కుర్రాణ్ని ఎత్తుకుని ఇంట్లోకి తీసికెళ్ళాడు దీపం వెలుగులో ఉంగరాల జుట్టూ, బుట్టబుగ్గలూ, బెదిరే చూపులూ చూడగానే ఈశ్వర్రావు లోపల్నుంచి ప్రేమ కెరటంలాగా, ఉబికింది.ముద్దు పెట్టుకుని సముదాయించి

కుర్రాణ్ని భుజంమీద వేసుకుని నిద్రపోగొట్టాడు. తెల్లవారినాక ఆ కుర్రాడికోసం వెతుక్కుంటూ ఎవరూ రాలేదు ఆ కుర్రాడి తల్లిదండ్రులు వచ్చి అడిగితే ఇవ్వాలనుకున్నాడు ఈశ్వర్రావు. ఎరిగున్న వాళ్ళందరికీ చెప్పాడు. పోలీసుస్టేషన్లో కూడా చెప్పివచ్చాడు. ఎవరైనా వచ్చి అడిగేదాకా కుర్రాణ్ని తన దగ్గిరే అట్టేపెట్టుకోవాలనుకున్నాడు.

ఇంత ముద్దులు మూటకట్టే కుర్రాడు ఎవరికి బరువైపోయాడో? ఈ తప్పిపోయిన కుర్రాడికోసం వెతుక్కోకుండా తల్లిదండ్రులు ఎల్లా వూరుకోగలుగుతున్నారో? వాళ్ళవి ఎంత రాతిగుండెలో? చీకట్లో తనకోసమే వెతుక్కుంటున్నట్లుగా వచ్చి ఈ పసివాడు నిమిషంలో తన మనస్సును దొంగిలించేశాడు. ఇన్నాళ్ళూ పిల్లలు లేనికొరత ఈశ్వర్రావుని ఎన్నడూ బాధించలేదు. కాని ఈ కుర్రాణ్ని చూసిన క్షణమే అతనిలో నిద్రపోయే వాత్సల్యం ఒక్కసారి వెల్లువలై పారింది.

తన లోకమంతా ఆ కుర్రాడే! వాణ్ని క్షణం కూడా విడిచిపుండలేడు ఈశ్వర్రావు. తన ఆకులోనే అన్నం, తనపక్కలోనే నిద్ర. ఎప్పటికైనా ఆకుర్రాడి తల్లిదండ్రులు వచ్చి తీసుకుపోతారేమో! అయినా ఆ కుర్రాడిమీద ఎందుకో తిప్పుకోలేనంత మమకారం అతనికి.

ఆ కుర్రాణ్ని అస్తమానం చీదరించుకోటం, విసుక్కోటం, అడిగినవి ఇవ్వకుండా కసరికొట్టి ఏడిపించటం భద్రమ్మ పనిగా పెట్టుకుంది.

"ముక్కూ మొహం ఎరగని వెధవని, కులం గోత్రం తెలియని అంట్ల వెధవని నెత్తినెక్కించుకుంటూరా?" అని మాటిమాటికీ ఈసడిస్తూ వుంటుంది.

ఇదంతా చూస్తుంటే ఈశ్వర్రావు మనస్సు చివుక్కుమంటుంది. ఆ పసివాణ్ని తీసుకుని ఎక్కడికైనా పారిపోదామా అనిపిస్తుంది. భద్రకాళి కళ్ళలో చెరిగే నిప్పులకి ఆ పసివాడు కాలి మసి అయిపోతాడేమో? వాణ్ని రక్షించటానికైనా తను ఇన్నేళ్ళ ఓర్పుకీ స్వస్తి చెప్పి సాహసించి ఏదైనా చెయ్యాలి అనిపిస్తుంది.

ఈ కుర్రాడు వచ్చి భర్త మనస్సుని ఆక్రమించుకున్నందుకు భద్రమ్మకి కడుపుమంటగా వుంది. మును పున్న మాత్రం అనురాగమైనా తనమీద భర్తకి లేకుండా పోతోంది. తనని పలకరించటం కూడా మానేశాడు. ఎప్పుడూ ఆ కుర్రాడితో ఆటలూ, పాటలూ, కథలూ, కబుర్లూ. ఇదంతా చూస్తుంటే భద్రమ్మ భగ్గున మండిపోతోంది.

"ఇంకెప్పుడూ తియ్యనమ్మా కొత్తకమ్మా. కొత్తకమ్మా" అని ఆవురుమని ఏడుస్తున్నాడు రాము. పూనకం పూనిన గణాచారిలాగా భద్రకాళి కుర్రాడి వీపుమీదా, చెంపలమీదా వాతలు తేలేట్లు కొట్టేస్తోంది.

ఏడుపు విని గబగబా పరిగెత్తుకొచ్చి ఈశ్వర్రావు ఒక్క గుంజుతో రాముని ఇవతలకి లాగి ఎత్తుకుని "నీకేం మతిపోయిందా?" అని అరిచాడు. ముఖం కందిపోయింది. పెదిమలు వణికినయ్. రామూ ముఖం బుసకలాగా పొంగిపోయింది దెబ్బలకి. ఈశ్వర్రావు కళ్ళలో నీళ్లు గిర్రున తిరిగినయ్. అతని భుజంమీద కళ్ళు మూసుకుని వెక్కి వెక్కి ఏడుస్తున్నాడు రామూ.

"మతి ఎవరికి పోయిందో తెలుస్తూనేవుంది. దిక్కూ మొక్కూ లేని వెధవ వున్నచోట వుండక ఏంపని చేశాడో చూశారా? దేవుడి మందిరం అంతా మైలపడేశాడు. మా నాన్న కాశీచెంబు ముట్టుకున్నాడు. సాలగ్రామాలు తీసి ఎత్తుకుపోతున్నాడు. దిక్కుమాలిన వెధవ! తొక్కి నారతీస్తాను. కులం గోత్రం లేని అంట్ల వెధవ అన్నీ మైలపడేసి తగలెట్టాడు. అంటూ" నెత్తి బాదుకుంటూ అరిచింది భద్రకాళి. "గోలీలు ఆలుకోటానికి తీసుకున్నా అక్కడే పలేచా" అంటూ వెక్కుతూ అన్నాడు రామూ.

"గోలీలు కాదు. గోళ్ళగడ్డలు. అంతా మైలపడేసి తగలెట్టావు. అయ్యో! ఎంతమడిగా అట్టేపెట్టుకుని పూజ చేసుకుంటున్నానో ఇన్నాళ్ళనుంచీ! ఇంతకీ వాణ్ని అనాల్సిన పనేముంది? సామెత చెప్పినట్లు తను దూరటానికి కంత లేదుగాని మెడకొక డోలు కట్టుకున్నాడుట ఎవరో మీలాంటి ప్రబుద్ధుడే. వొదలండి వాణ్ని నెత్తురు కళ్ళచూస్తాను. ఇవాళ" అని ఉగ్రంగా ముందుకి వచ్చింది భద్రమ్మ.

భుజంమీద రామూ భయంతో ముద్దకట్టుకుపోతూ కెవ్వుమన్నాడు.

"కావలసినంత మడిగా అటేపెట్టుకో

సీయిల్లు. ఇద్దరం వెళ్తున్నాంలే" అని బాణంలాగా బైటికి దూసుకుపోయాడు ఈశ్వర్రావు. వెనక్కి తిరిగి చూడలేదు. పెళ్ళాం కేకలూ ఏడుపులూ చెవిలో దూరలేదు. ఆపసివాణ్ణి ఈ రాక్షసినించి కాపాడి ఎక్కడికో దూరంగా తీసుకుపోవాలని ఆరాటం అతన్ని పరిగెత్తించింది. ఇన్నేళ్ళనించీ సహించిన భార్య అఘాయిత్యం దుర్భర వేదనతో అతని మనస్సుని ఇవాళ దహించివేస్తోంది తన కాళ్ళమీద తను నిలబడలేడా? తనదారి తను చూసుకోలేడా? ఇదివరకు తనకి చేతకాకపోయినా ఇప్పుడైనా ఈ దిక్కులేని పసికుంకకోసమైనా ఏదో దారి తొక్కాలి. ఏదో ఆవేశం అతనికాళ్ళని ముందుకి లాక్కుపోతోంది.

ఎదురుగా బండీ వస్తున్న సంగతి ఆతొందర్లో గమనించలేదు. "ఏమయ్యా కళ్ళు కనపడటంలా?" అంటూ కళ్ళెంలాగిపట్టి బండివాడు గర్జించాడు. బండిలోపల్నుంచి, "ఎవరదీ? ఈశ్వర్రావుగారా?" అని ఆశ్చర్యంతో వొణికే కంఠం వినబడింది.

"నమస్కారం. అప్పుడే మరచిపోయారా? ఎక్కడికీ ఏదో తొందరగా వెళ్తున్నట్లున్నారు. ఎవరీ కుర్రాడు?" అని బండిదిగివచ్చి ప్రశ్నల పరంపర కురిపించింది లీల.

ఇందాకటినించీ బుజంమీద తలవాల్చి కళ్ళు గట్టిగా మూసుకున్న రామూ ముఖంపైకెత్తి చూశాడు.

"రామూ! నాతండ్రీ! ఇక్కడి కెలావచ్చావురా నాయనా!" అంటూ బండిలోంచి ఒక స్త్రీ కిందికి దూకింది.

"వీడేనా?" అంటూ ఆశ్చర్యపోయింది లీల.

"అమ్మా!" అంటూ తల్లిమీదికి వాలిపోయాడు రామూ.

"ఎన్నాళ్ళయిందిరా తండ్రీ!" అంటూ కన్నీళ్ళతో తల్లి కొడుకుని గట్టిగా గుండెల కదుముకొని ముద్దులతో ఉక్కిరిబిక్కిరి చేస్తోంది.

విగ్రహంలాగా చూస్తూ నిలబడి పోయాడు ఈశ్వర్రావు.

'పాపం! ఆతల్లిప్రాణం లేచివచ్చింది. కొడుకు సంతలో దారితప్పి పోయాడుట. అంతటా గాలించి ఆశలు వదిలేసింది. ఆత్మహత్య చేసుకోవాలని అర్ధరాత్రి నూతిలో పడబోతుంటే ఊరూరా వెతుకుతూ తిరుగుతున్నాం." అంది లీల.

"నీ మేలు జన్మజన్మలకీ మరచిపోను లీలమ్మ తల్లీ!" అంటూ ఆ తల్లి చేతులు జోడించింది.

"అయితే నన్ను ఒక్కడ్నే వొదిలేసి వెళ్ళిపోతావురా రామూ?" అని ఈశ్వర్రావు వొణికే కన్నీళ్ళతో అడిగాడు

తల్లి చంకనెక్కి కూమన్న రామూ "అమ్మతో ఎల్లిపోతా" అని ధీమాగా బదులు చెప్పాడు.

ఒక్కసారిగా ఈశ్వర్రావు కళ్ళముందు చీకట్లు కమ్ముకుపోయినయ్. రామూ చుట్టూ అల్లుకున్న కల్పనా లోకమంతా కుప్పున నేల కూలి పోయింది. "మరి శలవా?" అంది లీల.

"మంచిది" అన్నాడు ఈశ్వర్రావు. కళ్ళు గిర్రున తిరిగినయ్. బండీ కదిలింది. కాళ్ళు వణికినయ్. లోకమంతా శూన్యమైపోయి చాపలాగా చుట్టుకుపోతోంది. మెరుపులాగా వచ్చి తళుక్కున మాయమై పోయాడు రామూ. వాడికోసమేగా తను ఇంటినించి పారిపోయి వచ్చింది? వాడు లేకపోయాక ఇక తను ఎక్కడికి పోవాలి? ఏం చెయ్యాలి?

జేబులో చిల్లికానీ కూడా లేదు. అంతా అయోమయంగా వుంది. ఏమైనా సరే ఇంటికి తిరిగి వెళ్ళకూడదని పట్టుదల మనస్సుకి పురిఎక్కిస్తోంది. స్టేషను దగ్గిర చెట్టుకింద సిమెంటు దిమ్మమీద చతికిల పడ్డాడు. అక్కడే నడుం వాల్చికళ్ళుమూశాడు. వేపగుబుర్ల చల్లటినీడ తల్లిలా అతని హృదయాన్ని ఆలింగనం చేసుకుంది.

త్రుళ్ళిపడి కళ్ళు తెరిచాడు. అతని కాళ్ళు ఎవరి ఒడిలోనో వున్నయ్. ఎవరో మెత్తగా అతని పాదాలని ఒత్తుతున్నారు. మత్తుతెరలు తొలగించుకుని కళ్ళు పెద్దవి చేసి తేరిపారచూసి విస్తు పోయాడు. నోటమాట పెగల్లేదు.

"కుర్రాడేడీ?" అని ఆత్రంగా అడిగింది భద్రమ్మ. "ఎల్లావచ్చాడో అల్లాగే వెళ్ళిపోయాడు" అన్నాడు విరక్తిగా. "పదండి ఇంటికి" అని పాదాలు పుచ్చుకుంది భద్రమ్మ. "నన్ను వెళ్ళిపోనీ" అంటూ లేచాడు ఈశ్వర్రావు. "ఎక్కడికి? అయితే నేనూవస్తా. మీ రెక్కడవుంటే నేనూ అక్కడే" అంది భద్రమ్మ తడిసిన కళ్ళతో.

ఆ క్షణంలో భార్య అర్థంకాని అయోమయ

భారతీయ నృత్యం

శ్రీ పి. వి. రాజమన్నారు

[ఇటీవల ఢిల్లీలో జరిగిన అఖిలభారత నృత్యోత్సవాలకు అధ్యక్షత వహిస్తూ, అఖిలభారత సంగీత నాటక అకాడమీ అధ్యక్షులు గౌరవ్య, శ్రీ పి. వి. రాజమన్నారు నృత్య కళావేత్తల కిచ్చిన సందేశం ఇది. భారతీయ నృత్యంలోని వివిధరీతుల మధ్య పరస్పర సహిష్ణుతనూ, గౌరవాన్నీ, ఆయా రీతుల సలక్షణమైన స్వాంతంత్రాభివృద్ధినీ శ్రీ రాజమన్నారు లక్షిస్తున్నారు.

— సంపాదకులు.]

భారతదేశం సర్వ స్వతంత్ర ప్రజాస్వామికమైన వెంటనే, సంగీత నాటక అకాడమీ, సాహిత్య అకాడమీ, లలితకళా అకాడమీ, అను మూడు జాతీయ పరిషత్తులను నెలకొల్పటమనేది మన ప్రభుత్వం చేసిన ఒక మహాత్కార్యంగా నేను భావిస్తాను. జాతీయ జీవితంలో సారస్వతాది కళలకు ఉండవలసిన మహోన్నత స్థానాన్ని గుర్తించటమే అది. సంగీతనాటక అకాడమీ - దాని నిర్మాణ సూత్రాల పీఠికలో చెప్పబడినట్లు - భారతీయ నృత్య, నాటక, సంగీత, చలన చిత్రాలను ప్రోదిచేసి పెంపొందించటానికీ, తద్వారా దేశంలో సాంస్కృతికమైన ఏకీభావాన్ని పెంపొందించటానికీ, ఏర్పాటు చేయబడింది. భారతీయ నృత్య నాటక సంగీతరంగాలలో పరిశోధనను ప్రోత్సహించటమూ, వివిధ ప్రాంతాలవారు పరస్పరం అర్థంచేసికొని, శిల్పరీతులను సుసంపన్నములు చేసికొనటమూ, జానపద నృత్య సంగీతాలను పునరుద్ధరించి నిలబెట్టుకొనటమూ- ఇవన్నీ సంగీత నాటక అకాడమీ లక్ష్యాలే.

దీన్నిబట్టి, దేశంయొక్క వైశాల్యం దృష్ట్యాను, మనకు సంక్రమించిన అద్భుతమైన సంస్కృతీ సంపద దృష్ట్యాను, సంగీత నాటక అకాడమీ నిర్వహించవలసిన కార్యభారం ఎంత మహోత్తమమైనదో మీ రూహించుకో గలరు.

అకస్మాత్తుగా చెప్పరానంత సంపద,— భూములు, ఇళ్ళు, బంగారం, నగలు, రత్నాలు మొదలైనవి - రకరకాలుగా వారసత్వంగా వచ్చిన ఒక యువకునితో ఈ అకాడమీని పోల్చడం అసమంజసంకాదు. ఆ రకరకాల క్రింద లెక్క తేల్చుకోటానికీ, విడమర్చి దేనికి దాన్ని వేలుచెయ్యటానికీ కూడా కొంత వ్యవధి, ఓర్పు, శ్రమ, తెలిసినవారి సలహా మార్గదర్శకత్వం కావలసి వుంటాయి. ఇంక ఆ సంక్రమించిన సంపదను పెంపొందించటం ఇంకా కష్టతరమైన పని. అలాగే సంగీతనాటక అకాడమీసంగతి కూడా.

మొట్టమొదటిసారిగా ఒక కేంద్ర సంస్థ భారతదేశంలోని వివిధప్రాంతాల్లో విస్తృత ప్రచారంలో వున్న వివిధ కళారూపాలను మొదట నిర్ధారణచేసికొని, ఆయా కళారూపాల చిత్రణను గూర్చిన సమాచారం సేకరించి, వాటిని పరస్పరం సమన్వయ పఱచి, బాహ్య దృష్టికి కన్పించే అనంత వైవిధ్యంలో వున్న సారభూతమైన సాంస్కృతిక ఏకత్వాన్ని సాధించవలసివుంది

అకాడమీకి గల - ముఖ్యంగా ఆర్థిక - సౌకర్యాలను దృష్టిలో పెట్టుకొంటే, సాధ్యమైనంతవరకు ఒకరు చేసిన పనినే మరొకరు చేసే పద్ధతిని మానటం చాలా అవసరం. ప్రాంతీయ అకాడమీలు మరింత సమర్థతతోనూ నూటిగాను నిర్వహించటానికి వీలైన అంశాలను వారికే వదలివేయాలి కనుక, తన కార్యక్రమాలను వివిధముఖాల విస్తరింపజేసి, అఖిలభారత దృష్టితో అనేక సమస్యలను ఎదుర్కొనవలసి వుంది. అందువల్లనే సంగీత నాటక అకాడమీ అఖిల భారతస్థాయిలో కళోత్సవాలను నిర్వహిస్తున్నది. ఈ సువిశాల దేశంలో వివిధప్రాంతాల విభిన్నరీతులను, సంప్రదాయాలను ఒకేస్థలంలో ఒకేసమయంలో ప్రదర్శించటానికే ఈ ఉత్సవాలు ఏర్పడినవి.

భారత చలనచిత్ర చరిత్రలో ప్రప్రథమంగా, 1955 లో చలనచిత్ర సదస్సు ఏర్పరచబడింది. 1956 లో నాటక సదస్సు జరిగింది.

1957 లో సంగీత సదస్సు జరిగింది. ఈ సంవత్సరం ఇప్పుడు నృత్య సదస్సు జరుగుతున్నది.

ఈ సదస్సు కార్యక్రమాన్ని ఒక్కమారు పరికిస్తే, ప్రాయోగిక తాత్విక చారిత్రక దృక్పథాలలో నృత్యాన్ని అధ్యయనం చేయటానికీ, అందులో పరిశోధనలు చేయటానికీ తమ జీవితాలను అంకితంచేసిన మహాపండితులు ఇప్పుడు చర్చింపనున్న అంశాల వైవిధ్యపు స్వభావం మీకు తెలుస్తుంది. దీనితోపాటు, శాస్త్రీయ, జానపద నృత్యప్రదర్శనలు కూడా ఏర్పాటు చేయబడ్డాయి. నృత్యశాఖకు చెందిన భాగవత మేళ, యక్షగానము, వీధినాటకము మున్నగునవీ, కేవలం భారతదేశానికి చెందినవే కాక, భారతదేశంలో పుట్టిన లేక భారతీయ నృత్యంతో సాన్నిహిత్యంగల ఆగ్నేయఆసియాయందలి, కెనడాయందలి నృత్యములకు సైతం ఇక్కడ స్థానం కల్పింపబడింది. ఈ సదస్సును మొదటినుండి తుదివరకు చూచిన వారికి భారతదేశంలోని వివిధరీతుల శాస్త్రీయ, జానపద నృత్యాలను గూర్చిన విశిష్టజ్ఞానం కలుగుతుందనటంలో అతిశయోక్తిలేదు. ఆయా అంశాలపై ఉపన్యాసాలతో పాటు, ప్రదర్శనలకు కూడా అవకాశం కల్పించబడటంవల్ల ఈ సదస్సు యొక్క ప్రయోజనం అధికతరమవుతుంది. సిద్ధాంత ప్రయోగములు, లక్షణలక్ష్యములు, పరస్పరాశ్రయములు కావలెనన్న సత్యాన్ని నేను నొక్కి చెప్పనక్కరలేదు.

ఈ సదస్సుకు అనుబంధంగా, వివిధ నృత్యములయందు ప్రవీణులైన వారిచే ప్రదర్శనలు ప్రతిసాయంత్రం ఏర్పాటు చేయబడ్డాయి. చక్కని మనోవికాసాన్నీ, రసానందాన్నీ కల్గించడమే కాక, ఈ సదస్సు ఆలోచనలను రేకెత్తించి, బహుముఖములైన మన నృత్య సంప్రదాయాలను పెంపొందించడానికి తగిన మార్గాలను, అవకాశాలను సూచించగలదనటంలో నాకు సందేహంలేదు.

ఈసందర్భంలో, ఇలాంటి పండిత పరిషత్తులో నేను ఏ ప్రత్యేకాంశంపైన గానీ తాత్వికచర్చ చేయదల్చలేదు. కాని నా మనస్సులో ప్రధానంగా కన్పిస్తున్న కొన్ని విషయాలను మాత్రమే చెప్పదలచాను.

ఒకరీతి నృత్యాన్ని ఆరాధిస్తున్నవారు తక్కిన వారిపట్ల అసహన భావం చూపటాన్ని నేను గమనిస్తున్నాను. ఇది విచారకరం. ఈ అసహనంతోపాటే పరస్పర ద్వేషం, తృణీకార భావం కన్పిస్తున్నాయి. తాము నేర్చిన రీతి నృత్యమే సరియైనదనీ తగినదనీ, తక్కిన రీతులన్నీ విపరీతములన్న అపోహయే ఈ అసహిష్ణుతకు కారణ మనుకొంటాను. ఉత్తరభారతంలో హిందూస్థానీ సంగీతంలోని వివిధరీతుల మధ్యవున్న విభేదాలు - వైరుధ్యాలనే అనవచ్చు - మీలో కొందరికి బాగా తెలుసు. భారత సంస్కృతిని నిజంగా ప్రేమించే వారందరూ వ్యక్తితోగానీ, భాషతోగానీ, ప్రాంతంతోగానీ నిమిత్తం లేకుండా, సలక్షణములైన అన్ని సంప్రదాయాలయందు గౌరవభావం పెంపొందించుకోవాలని నా హృదయపూర్వకమైన విజ్ఞప్తి. మతం విషయంలో సహనానికి భారతదేశం పేరుపొందింది. ఏ మతస్థుడుగానీ, నిజమైన భారతీయు డెవడూ ఇతర మతాలను ద్వేషించడు, తృణీకరించడు. అలాంటి భావం సంగీత నృత్యకళా రంగాలలో సుప్రతిష్ఠితం కావలె నని మాత్రమే నా ప్రార్థన.

ఈ సదస్సులో కొన్ని అపోహలు తొలగింపబడగలవని నేను ఆశిస్తున్నాను. ఉదాహరణకు- దక్షిణ భారతంలో తంజాపుర ప్రభువుల కాలంలో, వారి ఆదరణక్రింద సర్వసమగ్రంగా పెంపొందింపబడి, పరంపరగా మనకు ప్రాప్తించిన ఒకానొక నృత్యరీతి -ఇటీవల 'భరతనాట్య' మనేపేరిట ప్రసిద్ధిలోనికి వచ్చింది. దానికాపేరు రూఢి అయింది. కాబట్టి దానిని మార్చవలెనని ఎవ్వరూ ప్రయత్నించ నక్కరలేదు. కాని ఇక్కడ కొన్ని విషయాలను తేల్చి చెప్పడం మంచిది. భరతముని ప్రణీతంగా చెప్పబడే నాట్యశాస్త్రంలో నాట్యశబ్దం నాటకపరమైందే కాని నృత్యపరమైంది కాదు, ఈనాడు 'భరతనాట్య' మనబడే నృత్యపరమైంది కూడా కాదు. నాట్యశాస్త్ర ప్రథమాధ్యాయంలో విశదీకరింపబడిన నాట్యోత్పత్తి, అందు పేర్కొనబడిన ప్రధాన నాట్య లక్షణాలూ పరికిస్తే నాట్యమనే పదం నాటకపరమైన దనడంలో సందేహానికి తావులేదు.

నానాభావోపసంపన్నం
నానావస్థాంత రాత్మకం
లోకవృత్తాను కరణం
నాట్యమ్......

నాట్యమునకు మరొక వివరణ "నాట్యం వృత్తాంత దర్శకం" అని.

భరతుఁడు నృత్త నృత్యములను ప్రత్యేకంగా పేర్కొన్నాడు. నాట్యశాస్త్రమునందే కాక, అభినయ దర్పణ సంగీత రత్నాకరాది అనంతర లక్షణ గ్రంధాలలో కూడా నాట్యమునకు నృత్తనృత్యములకూ మధ్య భేదం స్పష్టంగా చూపబడింది. 'వాక్యార్థాభి నయాత్మక' మని నాట్యము చెప్పబడగా, 'పదార్థాభి నయాత్మక' మని నృత్యము పేర్కొనబడినది. నాట్యము రసాశ్రయము, నృత్యము భావాశ్రయము, నృత్తము తాళలయాశ్రయము.

నాట్యశాస్త్రంలో భరతుడు నృత్య సంగీతముల గురించి చర్చించనేలేదు. నాట్యశాస్త్రం ప్రధానంగా నాటక పరమైనది. నాట్యశాస్త్రమందలి **8, 9, 10, 11, 12** అధ్యాయములు ఆంగికాభినయం గురించి చెప్పబడ్డాయి. భారతీయ నృత్యానికి ప్రత్యేక లక్షణమైన ఈ ఆంగికం జావా, బలి, ఇండో చైనా మున్నగు దూరదేశాలకు వ్యాపించి, ఈ నాటికీ సజీవంగా వుంది. కాని హస్తములు, కరణములు, చారులు మాత్రము నాటక దృష్టితో చెప్పబడినవే. పూర్వకాలంలో నాటక నిర్మాణంలో ప్రధానమైన ప్రకృతి వాస్తవికమైన దనటంకంటె సాంప్రదాయకమైనదనటంలో సందేహంలేదు. అభినయంలో ఆయాముద్రల తాలూకు సాంకేతిక పరిభాష ఎక్కువగా ఉపయోగింపబడేది. దానికి ఇదే నిదర్శనం. అభిజ్ఞాన శాకుంతల వ్యాఖ్యానాల్లో ఒకదానిలో, నటీనటులు ఆయా చేష్టాప్రదర్శనానికి చూపవలసిన వివిధ ముద్రల తాలూకు వివరణ వున్నది. ఇవి నాట్యశాస్త్రంలోనూ, తరువాతి లక్షణ గ్రంధాలలోను కానవచ్చే ముద్రలే. ఉదాహరణకు తుమ్మెదచేత ఎదుర్కొనబడిన శకుంతల భంగిమల వివరణ ఇది: వినుత శీర్షము, కంపితాధరము, ఆస్య ముఖావాన అధోగత త్రిపతక ముద్ర. పుష్పాపచయమునకు-ఉత్తానారాళమైన వామహస్తము, పార్శ్వ ముఖమైన హంసాస్య సవ్యహస్తము. సమగ్రంగా సిద్ధాంతీకరించబడిన వివిధాంగికాభినయంతో పాటు భావ ముద్రలను నటీనటులు తప్పక అనుసరించాలా లేదా అనే విషయం చెప్పటం కష్టం. కాని తుచ తప్పకుండా శాస్త్రాన్ని అనుసరించాలనే ఛాందసులు ఆనాడు వుండకపోరు.

ఇవీ ఇంకా ఇతర అంశాలూ పరిశీలిస్తే 'భరతనాట్య' మనేది నృత్యానికి తెచ్చిపెట్టిన పేరని ముఖ్యంగా రెండు కారణాలవల్ల నేను నమ్మవలసివచ్చింది. అందుకే ఇదంతా చెప్పినాను. ఆకారణాలు ఇవి;

1. నాట్యమనేది ఈనాడు భరతనాట్యమనే పేరిట వ్యవహరింపబడే నృత్యానికిసైతం వాడదగిన పేరే అనుకొన్నప్పటికీ, భరతముని చెప్పినప్రకారం, నృత్యరీతి ఇది ఒక్కటి మాత్రమే అని ఎవ్వరూ చెప్పలేరు.

2. నాట్య శాస్త్రమున పేర్కొనబడిన భావముద్రలు, హస్తములు మున్నగునవి భరతనాట్యమనబడే నృత్యంలో ప్రయోగింపబడతాయి కనక నృత్యానికి భరతనాట్యమనే పేరు ఉచితమైనదే అంటే నేను ఇక్కడ రెండు అంశాలను గుర్తు చేయవలసివుంది.

1. ఈభావముద్రల పరిభాష మార్పులేనిదిగా లేదు. అది నానాటికీ పెంపొందింది. అది భరతుడు ఆదేశించిన భావార్థ నియమ నిబంధనలనుండి ముందుకు సాగలేదని చెప్పలేము.

2. భరతనాట్యంలో వలెనే తక్కిన నాట్యరీతులలో సైతము ఈ హస్తములు మొదలైనవి విరివిగా వినియోగింప బడుతున్నాయి. ఈ సందర్భంలో కధాకళి, కూచిపూడి నృత్యములను పేర్కొనవచ్చు.

భరతుని నాట్యశాస్త్రము తరువాత వచ్చిన హస్తలక్షణదీపిక అభినయ దర్పణము ఆగ్నేకారిక గ్రంథములు. ఇవి భరత సంప్రదాయమునకు చెందినవే యైనప్పటికి కొన్ని విభేదాలను ప్రకటిస్తున్నాయి. ఇదేకాక, నాట్యమునకు సంబంధించిన గ్రంథ సంపుటులు తంజాపుర సరస్వతీ మహాలు గ్రంధాలయంలో

ఎన్నో వున్నాయి. వానిలో 'నాట్య శాస్త్ర సంగ్రహ' మొకటి. సంగీత నాటక అకాడమీ వారి ధనసహాయంతో ఇటీవల ప్రకటింపబడిన 'భరతార్ణవ' మింకొకటి. ఇది నందికేశ్వర ప్రోక్తమని ప్రతీతి. భరతనాట్య శాస్త్రంలో లేక, ఈనాటి భరత నాట్యానికి పుట్టినిల్లయిన తంజావూరులోను తత్ప్రాంతాలలోను బహుళ ప్రచారంలోవున్న అంశాలు ఈ గ్రంథాల్లో వున్నాయి.

నాకొక గాఢమైన కోరికవుంది. నాట్య శాస్త్రమందలి అభిరుచి పెంపొంది నందువల్ల భరతముని చూపిన మార్గంలో మనం నాటకాలను ప్రయోగించవచ్చు. శ్రీమతి రుక్మిణీదేవి ప్రదర్శించిన 'కుత్రాల కురవంజి,' 'కుమార సంభవము' మున్నగు ప్రయోగాలు, ఈరీతిలో చేయబడినవి, ప్రశంసా యోగ్యాలుగా వున్నాయి.

పురాతన సంప్రదాయాలను కాపాడటం అటుంచి, క్రొత్తరీతులను సృష్టించటానికి అవకాశంలేదా? అంటే - వాస్తవమైన ఆవేశం వుండి, ఆ నూతన సృష్టి, నేటి చలన చిత్రాలలోని బృంద నృత్యాలలాగా అనుకరణమాత్రం కాక, సలక్షణమూ స్వతస్సిద్ధమూ అయినప్పుడు అలాంటి సృష్టికి అవకాశం వున్న దంటాను. మనకు అనంతరీతుల జానపదనృత్యాలున్నాయి. ప్రతిభావంతు డైన కళాకారుడు వానినుండి ఉత్తేజితుడై నూతన నృత్యరీతులనుసృజించవచ్చు.

నిత్యనూతన కల్పనే కళ

★

చిన్ననాటి నుంచీ మూర్తి చిత్రాలు వ్రాయటంలో ఎక్కువ ఆసక్తి చూపేవాడు పికాసో. స్వతంత్రించి ఒక రూపకల్పన చేయడమంటే అతనికి ఇష్టం వుండేది కాదు.

కొత్తగావచ్చిన ఆర్టుమాస్టరు విద్యార్థులకోసం ఒక చిత్రప్రదర్శనం ఏర్పాటుచేసాడు. ఆయనకు పికాసో అంటే అభిమానం ఎక్కువ. ఏమైనా ఆ ప్రదర్శనంలో పికాసోకు బహుమానం రాలేదు.

బహుమతి పొందిన చిత్రాన్ని తర్కించి తర్కించి చూసాడు పికాసో. మరునాడు బడికి పోవటానికి అతని మొగం చెల్లిందికాదు.

మూడవనాడు ఆర్టుమాస్టరుగారే పికాసో ఇంటికి వచ్చారు. ఆయనగారిని చూడగానే పికాసో దుఃఖం పొంగుకొచ్చింది. మాస్టరుగారు అతణ్ని దగ్గరకు తీసుకొని ఓదారుస్తూ - "ప్రపంచం పురోగమన శీల మైనది, నాయనా! దానితోపాటు పురోగమించ జాలని ప్రతి వస్తువూ ప్రాతబడి పోతుంది. నీవు ఎల్లప్పుడూ ఒకే విషయాన్నీ, ఒకే విధానాన్నీ పట్టుకొని కూర్చోక ప్రపంచంతోపాటు పురోగమించాలి. లేకపోతే నీ రచనావస్తువు పురాతనమై తేజోహీనమై పోతుంది" అన్నారు.

నూతన కల్పనలకు పికాసోను ప్రోత్సహించిన అద్భుత సందేశం అదే!

—శ్రీ అ. పైడిరాజు

మన సామ్యవాద భావన

పండిత, శ్రీ జవహర్లాల్ నెహ్రూ

సామ్యవాదమును గూర్చిన ప్రశంస అధికంగా వినవస్తున్నది. కనుక దానిని గురించి రెండు మాటలు చెప్పదలచాను. కాంగ్రెసు కార్య ప్రణాళికలో ఈ సామ్యవాదం హఠాత్తుగా తెచ్చిపెట్టబడిందని కొందరంటున్నారు. అది సరికాదు. నిజానికి అది పూర్తిగా తప్పు. 1920 నుంచీ, కాంగ్రెస్ సోషలిస్టుల చేతనేగాక, కాంగ్రెసులో ఇతరులచేత సైతం సామ్యవాదం ప్రస్తావించబడుతూనే వుంది. అయితే - సామ్యవాదం అంటే ఏమిటో స్పష్టంగా నిర్వచించలేదన్నమాట నిజమే. కాని సాధారణ కాంగ్రెస్ సభ్యుని దృష్టి మొదటినుంచీ సామ్యవాదపరమైనదే. మన రాష్ట్ర కాంగ్రెసు సంఘాలు కొన్ని ఇప్పటికి 27 సంవత్సరాల క్రితమే, స్పష్టమైన సామ్యవాద పరిభాషలో తీర్మానాలు చేసి వున్నవి.

తప్పుడు పునాది

ఆ తర్వాత కాంగ్రెస్ సోషలిస్టుపార్టీ అవతరించింది. అది కేవలం తప్పుడు పునాదిమీద ఆరంభింపబడింది. కాంగ్రెస్‌లోనే వున్నట్లయితే వారు సామ్యవాదాభ్యుదయానికి ఎంతో సేవ చేయగలిగి వుండేవారు. కాని వారు చేసిన పని మాత్రం విపరీతమైంది. కాంగ్రెస్‌లోనున్న వృద్ధఛాందసులను బయటికి నెట్టివేసి, కాంగ్రెస్‌ను తమ అధీనం చేసికొని, దానిని సామ్యవాద సంస్థగా రూపొందించవలెనని వారనుకొన్నారు. కాని ఆ వృద్ధ ఛాందసులు అసమర్థులు కారు. కోట్లకొలది ప్రజలలో వారికి అపారమైన పలుకుబడివుంది అట్టివారిలో గాంధీజీ ఒకరు. దాని ఫలితంగా, కాంగ్రెసునుంచి అధికారం చేజిక్కించుకుందామన్న పేరాస చేత, కాంగ్రెస్ సోషలిస్టుపార్టీ మనదేశంలో సామ్యవాద ఉద్యమాన్నే దెబ్బకొట్టింది.

మెట్టుపై మెట్టు

కాంగ్రెస్ అంటే ఒకే దృక్పథం గల కొద్దిమంది ముఠా కాదు. భారత ప్రజలతోపాటు కలసి మెలసి పయనించటమే కాంగ్రెస్ ఆశయము. మనము ప్రజలతోపాటు మెట్టుపై మెట్టుగా ఎక్కుతూ పురోగమించవలసియున్నది. అందువల్లనే మన గమ్యం సామ్యవాదమని పదేపదే ప్రకటించి యున్నాము. కమ్యూనిస్టులు, సోషలిస్టులు ముఠాతత్వపరులైనారు. వాళ్లకు పెద్ద సిద్ధాంతం, పెద్ద పెద్ద వివరణలు, ఎన్నెన్నో వివాదాలు వున్నాయి. సామ్యవాదాన్ని గురించి అతిప్రసంగం చేసి లాభం లేదు. సామ్యవాదం ఇంకా పరిణామదశలోనే వుంది. దాన్ని గురించి ఇంకా ఎంతో గాఢంగా ఆలోచించవలసివుంది. శాంతియుత ప్రజాస్వామిక పద్ధతులకు కాంగ్రెస్ కట్టుబడివుంది. న్యాయ్యములైన ఈ మంచి పద్ధతులే మన ఉత్తమ సంప్రదాయాలు.

మార్క్సు జోస్యం తప్పు

మార్క్సు పేరుపొందినవాడు. అతని సూత్రాలను సమన్వయించటంతో ఎన్నో ఘనకార్యాలు జరిగాయి. కాని ఆయన పేర్కొన్న పరిస్థితులనేకం ఇప్పుడు లేనేలేవు. అందువల్ల ఆయన జోస్యాలు చాలా తప్పిపోయాయి. అమెరికా అత్యంత సంపన్నం కాగలదని మార్క్సు ఊహించలేదు. పరిస్థితులకు అనుగుణంగా మారటంలో పెట్టుబడిదారీ తత్వం అద్భుతమైన శక్తిని ప్రదర్శించింది. ఉన్నత జీవనస్థాయితో గూడిన స్కాండినేవియా సగం సామ్యవాదం, ప్రధానంగా పెట్టుబడిదారీ తత్వం గల రాజ్యం.

పాశ్చాత్య దేశాల్లోకూడా సామ్యవాద దృష్టిలో మార్పు వస్తున్నది. కనుక భారతీయులము మరింత జాగరూకులమై వుండాలి. పరిస్థితులన్నీ మన ప్రజల స్థాయిమీద, వారి మానసిక స్థాయిమీద ఆధారపడి వుంటాయి. మనది చాలా నిగ్రహం గల జాతి. యోజనా సంఘం సామ్యవాదాన్ని గురించి చర్చించకపోయినా, సామ్యవాద లక్ష్యాన్ని తనముందు పెట్టుకొనే పని చేస్తున్నది. చివరకు సామ్యవాదం మన తీర్మానాలవల్ల కాక, పరి

శ్రమలలోను, కర్మాగారాలలోను, గ్రామీణ జీవితంలోను మన ప్రజలు పొందగల శిక్షణ పద్ధతివల్ల, పెంపొందుతుంది. ఈ యువకులు, గ్రామ సేవకులు, ఇంజనీర్లు, వీరే-నవభారతంలో సచేతనమైన ప్రాణపదమైన నిర్మాణాత్మకమైన శక్తిగా రూపొందుతారు.

సామ్యవాదమంటే ..

సామ్యవాదమంటే కొందరు - ఎక్కువ డబ్బున్నవాళ్ల జేబులు కత్తిరించటమనీ, అన్నిటినీ జాతీయం చేయటమనీ - రెండువిధాల అనుకొంటూరు. ఈ రెండూ వాంఛనీయములే కాని, ఇందులో ఏ ఒకటీ సామ్యవాదం కాదు. ఉత్పత్తి శక్తులకు హానికరమైన విభజన ప్రయత్నం ఏదిగానీ పూర్తిగా తప్పే. అలా చేయుటమంటే మనల్ని మనం దుర్బల పరచుకోవటమే అవుతుంది. అధిక సంపదే సామ్యవాదానికి ప్రాతిపదిక. దారిద్ర్యపు సామ్యవాదం ఏదీ ఉండడానికి వీలే లేదు. కాబట్టి, సమీకరించే క్రమం అంచెలవారీగా వుండాలి.

ఇక రెండవది, జాతీయం చేసే సమస్య. ఏపరిశ్రమనుగానీ సక్రమంగా పని చేయించటానికి తయారు కాకుండానే ఊరకే దాన్ని జాతీయం చేయుటం ప్రమాదకరమనుకొంటాను. వేని వేనిని జాతీయం చేయాల్లో ముందుగా ఎన్నుకోవాలి. దేశంలో ప్రతివ్యక్తి అభివృద్ధికి సమానావకాశాలు ఉండటమే సామ్యవాద మని నా అభిప్రాయము. వ్యక్తి స్వాతంత్ర్యాన్ని గౌరవించే నేను, ప్రతి పరిశ్రమను ప్రభుత్వం స్వాధీనపరచుకోవడం అనేదాన్ని ఎంతమాత్రం కోరను. ప్రభుత్వం సర్వశక్తి వంతమై, అన్నిరంగాలనూ ప్రత్యక్షంగా తన అదుపులో పెట్టుకొనే రకం అతివాదపు సామ్యవాదం నా కక్కర లేదు. అసలు రాజకీయంగానే ప్రభుత్వం చాలా శక్తివంతమైనది. దాన్ని ఆర్థికంగా కూడా మరింత శక్తివంతం చేస్తే, అక్కడ కేవలం అధికారం గూడు కట్టుకొంటుంది.

వికేంద్రీకరణ

అందుకని, నేను ఆర్థిక శక్తుల వికేంద్రీకరణను కోరుతాను. ఇనుము, ఉక్కు, రైలు ఇంజన్లు మొదలైన భారీ పరిశ్రమలను మనం ఎలాగూ వికేంద్రీకరించలేము. కాని, మామూలుగా ప్రభుత్వ పర్యవేక్షణ క్రింద, లఘుపరిశ్రమలను, సాధ్యమైనంతవరకు, సహకార పద్ధతులమీద నిర్మించవచ్చు. ఇక్కడ నాకేమీ గుడ్డినమ్మకాలు లేవు. ఆచరణలో కలిగే అనుభవాన్ని బట్టి నేర్చుకుంటూ, మన మార్గంలో మనం పురోగమించవలసి వుంది.

—'ఎకనామిక్ రివ్యూ' నుంచి

జీవితార్థులు

తల్లిఁ దండ్రి నైనఁ దమ్ముల నన్నల
సఖుల నైన, బంధు జనుల నైన
రాజ్యకాంక్షఁ జేసి రాజులు చంపుదు
రవనిఁ దఱచు జీవితార్థు లగుచు

—సహజపాండిత్య, పోతనామాత్య

నవభారతి కి శుభాకాంక్షలు

'నవభారతి' కి నా ఆశీస్సులు.

—శ్రీ మాతృశ్రీ, శ్రీ అరవిందాశ్రమము

'నవభారతి' కై మీ చేయు ప్రయత్నమునకు నా అత్యంత శుభాకాంక్షలు.

—శ్రీ సి. రాజగోపాలాచారి

మరల మీరీ సాహిత్యదీక్ష పూనుటకు సంతుష్టుడను.

—శ్రీ వేలూరి శివరామశాస్త్రి

మీ నూతన పత్రికకు హృదయపూర్వకమైన శుభాకాంక్షలందజేయుచున్నాను

—గౌ. శ్రీ బూర్గుల రామకృష్ణరావు

నూతన పత్రిక 'నవభారతి'కి సర్వవిజయము కలుగవలెనని నా ఆకాంక్ష.

—గౌ. శ్రీ బెజవాడ గోపాలరెడ్డి

పత్రిక, పేరునకు తగినట్లు, ముద్దుగా, ముచ్చటగా వర్ధిల్లుగాక!

—శ్రీ పింగళి లక్ష్మీకాంతం

'నవభారతి' వెలువడగలదని తెలిసి సంతసించుచున్నాను. మీకు నా శుభాకాంక్షలు.

—శ్రీ ఎం. చలపతిరావు,
(నేషనల్ హెరాల్డ్)

'నవభారతి' మాసపత్రికను ప్రకటింపవలయునను సంకల్పము ప్రశంసనీయము. తమ ప్రయత్నము దైవము ఫలింపజేయుగాక!

—శ్రీ మాడపాటి హనుమంతరావు

భావస్ఫోరకమైన విజ్ఞానవ్యాప్తికి మీరు దీక్షవహింపగలరని నా ఆశయము. లక్ష్యశుద్ధిగల మీరు విజయము పొందగలరని నా విశ్వాసము.

—గౌ. శ్రీ నీలం సంజీవరెడ్డి

కొద్దికాలంలోనే మీ 'నవభారతి' దేశం నలుమూలలా నవ్యమై, సత్యమై ప్రతిదినాభివృద్ధికరమైన సందేశము నందజేయగలదని ఆశిస్తూ, చిరకాలము వర్ధిల్లవలెనని నా ఆశీర్వాదములు.

—శ్రీ తెన్నేటి విశ్వనాథం

తాము ప్రకటింప తలపెట్టిన 'నవభారతి'కి నా అనేక మంగళాశాసనములు. తమ యుద్దేశములు గొప్పవి, శ్లాఘ్యములును.

—శ్రీ రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ

ఆంధ్ర రాష్ట్రం వచ్చింది. విశాలాంధ్ర మీద ఏకచ్ఛత్రం విచ్చింది అంతా బాగుంది. మీరిప్పుడు 'నవభారతి'ని నడప బూనుకోవడం సమంజసంగానే ఉంది.

—శ్రీ రాయప్రోలు సుబ్బారావు

పత్రిక నిరంతరాయముగా జేగీయమానముగా నడచుచుగాక!

—శ్రీ శివశంకరస్వామి

ధనమునకో, కొలదిమంది పొగడ్తలకో లొంగక, ఉదారబుద్ధితో, ఉన్నత లక్ష్యముతో తాము తమ సహచరులతో 'నవభారతి'ని ఆదర్శవంతముగ నిర్వహింతురని విశ్వసించుచున్నాను.

—శ్రీ కల్లూరి చంద్రమౌళి

మీరు 'నవభారతి' ప్రచురింప నున్నారని తెలిసి సంతసించుచున్నాను. మీ ప్రయత్నములు, సఫలములు కావలెనని నా ఆశయము.

—గౌ. శ్రీ డి. సంజీవయ్య

మీరు నవభారతి మాసపత్రికను ప్రచురించటం సాహిత్యసేవ మాత్రమే గాక, ఆంధ్ర ప్రజానీకం గర్వించదగ్గ విషయం

—గౌ. శ్రీ అనగాని భగవంతరావు

మీరు 'నవభారతి' అను సాహిత్య సాంస్కృతిక మాసపత్రికను వెలువరించుచున్నారని వినుటకు సంతసించుచున్నాను. అట్టి పత్రికకు నిస్సంశయముగా నవసరము కలదు. మీ కృషి విజయవంతమగుగాక!

—శ్రీ కూర్మా వేణుగోపాలస్వామి

'నవభారతి' నవాంధ్రంలో నవోత్సాహం వెదజల్లుతుందని ఆశిస్తున్నాను.

—శ్రీ పురిపండా అప్పలస్వామి

మీరు పూనికతో చాలా పనిచేస్తారు. 'నవభారతి' నవభారతకావాలి సాహిత్య రంగంలో పేరుకున్న అవ్యవస్థ తొలగాలి.

—శ్రీ జమ్ములమడక మాధవరామశర్మ

మీరు 'నవభారతి' పత్రిక ప్రారంభించడం చాలా బాగుంది...మీ చేతిలో ఏ సాహిత్య కృషీ మిక్కిలి ఫలవంతం అవుతుంది.

—శ్రీ శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి

రిస్తాయి. అవే అరోరాలు. అరోరాలకు సౌరజ్వాలలకు గల సంబంధం కనిపెట్టడానికి ప్రత్యేక పరిశీలకులను ఏర్పాటు చేసేరు.

అతిశక్తిమంతములైన కాస్మిక్ కిరణాలు కూడా సౌరశక్తిలోనున్నాయి. సౌరజ్వాలనుండి వస్తున్న కాస్మిక్ కిరణాల విషయమై జ్ఞానం సంపాదించడానికి ప్రపంచమంతటా కేంద్రాలు నెలకొల్పారు. వాతావరణంలో జొరబడకుండా ప్రాథమిక కిరణాల రహస్యాలను రాకెట్లవల్ల, బెలూన్లవల్ల తెలిసికొంటారు. కృత్రిమ ఉపగ్రహాలైన బాలచంద్రులుకూడా ఈపరిశోధన కుపయోగిస్తాయి. ఇప్పటికి రెండు బాలచంద్రులను రష్యా, మూడింటిని అమెరికా భూ ప్రదక్షిణాలకు పంపించేయి. 'స్పుత్నిక్'లనిరష్యావారు 'ఎక్స్‌ప్లోరర్' అని అమెరికావారు వాటికి నామకరణాలు చేసేరు. రెండవ స్పుత్నిక్‌లో ఒక కుక్కను పంపారు.

జెట్ విమానాలు సంచరించే అంతరిక్షంలో విపరీత వాయుసంచనలమున్నట్లు ఈమధ్య కనిపెట్టేరు. విమాన వేగాన్ని మించిన వేగంతో వాయువులు వ్యతిరేక దిశలోగమిస్తూ విమానాలను వెనుకకు నెట్టుకొని పోతాయన్న సత్యాన్ని గ్రహించిన తరువాత ఆ వాయువుల గురించి, ఎక్కువ వివరాలు సేకరించడానికి ప్రయత్నిస్తున్నారు.

25-30 మైళ్ళ యెత్తున ఓజోన్ వాయువు గలదని, సూర్యరశ్మిలోని అతి నీలలోహిత కిరణాలను తక్కువ అలల పొడవుగల రేడియో తరంగాలను అదిహరిస్తోందని తెలిసింది. అయితే దాని స్థాన మెక్కడ, దాని ఎత్తు ఏ యే ప్రదేశాలలో యెంతెంత ఉన్నది, అదెట్లు మారుతుంది అను విషయాలను సమగ్రంగా పరిశీలించడానికి సన్నాహాలు చేసేరు.

కొన్నికొన్ని పరిశీలనలు ఏకముహూర్తమందు అనేక ప్రాంతాలలో కావింపవలసిన అవసరముంది. అవి విశ్వసనీయంగా నుండాలంటే ప్రమాణమైన ఉపకరణాలను వినియోగించాలి. సాధ్యమైనంతవరకు మానవప్రసక్తి లేకుండా యంత్రాలన్నీ స్వయంగా రికార్డు చేయకలిగినవైయుండాలి. వివిధ కేంద్రాలలో వినియోగింపబడు యంత్రాలు ఒకే విధమైనవై, ఒకే విధంగా రికార్డు చేయకలిగినవై యున్నప్పుడే వాటిని సరిపోల్చి చూచుకొనే అవకాశముంటుంది. అంటే ప్రమాణపాత్రములైన యంత్రాలను నిర్మించడం మొదటి ధర్మం. ఒకేవిధంగా వాటిని వినియోగించి సాంకేతిక జ్ఞానాన్ని సమకూర్చడం రెండవ ముఖ్యోద్దేశం ఈ విధంగా సమీకరణ కావలసినవి రేడియో కమ్యూనికేషన్, వాతావరణ స్థితిసేకరణ. బహు ప్రాంతాలలో, ముఖ్యంగా అగమ్యమైన కేంద్రాలలో, ప్రత్యేకంగా ఇట్టి సౌకర్యాలు కలిగించడానికై అంగీకరించేరు.

ఇవికాక సముద్రశాస్త్రంలో విశేష పరిశీలనల కేర్పాటుచేసేరు. అట్లే మంచుకొండల విషయంలోకూడ. ఏమంటే భూభాగంలో పదిశాతం వంతు మంచుకొండ లాక్రమించేయి. వాటి

పూర్తిగా పరిశీలించి, వాటివ్యాప్తిని తెలిసికొనడాని కొకశాఖ నేర్పరిచేరు.

ప్రపంచ వ్యాప్తంగా చేయదలచిన పరిశీలనలను సేకరించడానికి ప్రధానంగా ఆరు కేంద్రాలేర్పరిచేరు. అందు ముఖ్యమైనవి ధ్రువప్రాంతాలవద్ద నున్నవి. ముఖ్యంగా దక్షిణ ధ్రువప్రాంతంలో ఇంతవరకెట్టి సమాచారాన్ని సేకరించ లేదు. కొన్ని జట్లు ప్రత్యేకంగా ఆప్రాంతాలకు పోయి పరిశీలనలు చేస్తాయి. ఇవికాక, ఇంతవరకు మనుష్యసంచారంలేని ప్రదేశాలలో మరికొన్ని కేంద్రాల నేర్పాటుచేసేరు.

వాతావరణ విశేషాలను సేకరించడానికై పెద్ద సన్నాహాలు చేసేరు. ప్రపంచదినాలుగా (Regular world Days) కొన్నిటిని నిర్ణయించి ఆయా రోజులలో అదనంగా పరిశీలనలుచేస్తారు. అవి సగటున నెలకు మూడు రోజులుంటాయి. అందొకటి అమావాస్య. ఆనాడు సూర్యచంద్రులు భూమికి ఒకేవైపుననుండి సంయుక్తంగా ఆకర్షిస్తారు. ఆనాటి గురుత్వాకర్షణబలంగరిష్ఠము. గ్రహణదినాలు, ఉల్కాపాతం ఎక్కువగానున్న దినాలుకూడ ప్రపంచదినాలే. ప్రకృతిశక్తులు వాతావరణంలో ఎట్టి మార్పులు కలిగిస్తున్నాయో తెలిసికొనడానికి అవకాశం కలుగుతుంది.

ఈ అంతర్జాతీయ ప్రయత్నం యొక్క ముఖ్యోద్దేశమేమంటే విజ్ఞానాన్ని అన్ని దేశాలకు అందచేయడం. రకరకాల స్వయంగ్రాహక యంత్రాలు సేకరించిన జ్ఞానాన్ని యావత్తు కేంద్రీకరించి, క్రోడీకరించి, ఉత్సాహవంతులందరకు అందజేస్తారు. దానికి ముందుగా మూడు "ప్రపంచ కేంద్రాల'లో భోగట్టాలు సమకూరుస్తారు. కొన్ని శాస్త్రాల సందర్భంలో ఇట్టి కేంద్రాల సంఖ్య ఎక్కువకావచ్చు. అయనావరణ విషయంలో యూరప్, అమెరికా రష్యా, ఆస్ట్రేలియా, ఆగ్నేయాశియాలలో ప్రాంతీయ కేంద్రాలేర్పరచి, ఒక కేంద్రంలో లభించిన విశేషాలను మిగిలిన కేంద్రాలకు అందచేస్తారు.

వాతావరణపు పైపొరల గుణాలు తెలిసికొనడానికై రాకెట్లు, కృత్రిమ గ్రహాలు ఎక్కువగా ఉపయోగిస్తాయి. నక్షత్రాంతరాళంనుండి ఎక్కువగా వచ్చే కాస్మిక్ కిరణాలను, సూర్యునినుండి వచ్చే శక్తిమంతములైన కిరణాలను పైపొరలు హరిస్తున్నాయి, అవి ఉల్కలను భస్మంచేస్తున్నాయి. అందుచేత, పొరలపైకే యంత్రాలను పంపకలిగినట్లైతే ప్రసారం యొక్క తీక్ష్ణత పూర్తిగా తెలిసికోవచ్చు. కాబట్టి, వివిధ యంత్రాలను రాకెట్లలో అమర్చి సాధ్యమైనంత మీదికి పంపడానికి ప్రయత్నిస్తున్నారు. అమెరికా రెండు రకాల రాకెట్లను ప్రయోగిస్తుంది, సాధ్యమైనంత ఎత్తుకిబెలూనులో పంపి అక్కడనుండి ఎగరవేసే "రాకూన్'' ఒకటి, విమానంనుండి స్టీమరునుండి పైకిచిమ్మే "రాక్ఎయిర్'' రెండవది. వీటి మూలంగా సంపాదించగలిగిన జ్ఞానం భూమియొక్క అయస్కాంతత్వం గురించి. అయనావరణంలో కలుగు చలనాలవల్ల భూమికి అయస్కాంతత్వం ప్రాప్తిస్తున్నట్లుంది.

కృత్రిమ గ్రహాలవల్ల వెయ్యిమైళ్ళ వరకు ఎత్తుననున్న వాతావరణపు రహస్యాలు వెల్లడికాగలవు.

ఈవిధంగా అనేక శాస్త్రశాఖలలో అనేక ప్రదేశాలలో అనేక యంత్రాల సహాయంతో జ్ఞానాన్ని సమకూర్చడానికై అంతర్జాతీయ జియోఫిసికల్ సంవత్సరంలో విజ్ఞానులు సామూహికంగా సహకారభావంతో ప్రయత్నిస్తూ ప్రయోగాలుచేస్తూ శ్రమిస్తున్నారు. ఈకృషి ఫలవంతం కాకతప్పదు. ఈ కృషిద్వారా అంతర్జాతీయ స్నేహభావం పెంపొందకతప్పదు. నూతనమైన జ్ఞానసముపార్జనమేకాక మానవ కుటుంబ భావాన్ని కూడా ఈకృషి సాధిస్తుంది. రాజకీయ వైషమ్యాలను వెనుకకునెట్టి కేవల జ్ఞానార్జనకై సహకరిస్తున్న వివిధ దేశాలలో నూతన చైతన్యం కలిగి, సంకుచితత్వం నశించి, మానవాభ్యున్నతికి తోడ్పడగల శక్తి జనిస్తుందంటే ఆశ్చర్యం లేదు.

నవభారతి

ఆచార్య, విద్వాన్ శ్రీ గంటి జోగిసోమయాజి, ఎం. ఏ.

పలువిధమైన మార్గముల వర్ధిలు నాంధ్రము సంగ్రహించి యం
దలి నుడి కారమున్ నిలుపునట్లుగ, నెల్లెడ నొక్క తీరుగా
వెలసిన భాషలోన జరిపింపుము వ్రాతలు నవ్యభావ సం
వలిత పదార్థవృత్తి 'నవభారతి' శాశ్వత కీర్తిగాంచుమా!

నీరసవృత్తిమై నెఱయఁ బొంగెడు నేటి సాహిత్యమార్గమ్ము చక్కపఱచి
ఐక్యభావముఁ జంపి యాంతరంగిక భేద మలవరించెడు వృత్తి నడ్డపఱచి
అఖిలభారతమందు నాంధ్రభాషకుఁ గీర్తి వైశిష్ట్య వర్తన వరలునట్లు
ఉనికిలో మనసులో నున్నత వృత్తులే యొదవించు కల్పన యుల్లసిల్ల

దివ్యభాషాభిమానమ్ము దేశభక్తి, సకల సంపత్తి విద్యానుసరణవృత్తి
గలిగి సామాన్యజనముల కల్పవల్లి, వగుచు 'నవభారతీ', యలరారవమ్మ

శ్రీ భరతముని ప్రణీత

నాట్యశాస్త్రమ్

*

ఆంధ్రభారతి

డాక్టర్, పోతుకూచి సుబ్రహ్మణ్యశాస్త్రి,

ఎం. ఏ , ఎం. లిట్., పి. ఎచ్ డి.

ప్రథమోఽధ్యాయః - నాట్యోత్పత్తిః.

ప్రణమ్య శిరసా దేవౌ పితామహ మహేశ్వరౌ
నాట్యశాస్త్రం ప్రవక్ష్యామి బ్రహ్మణా యదుదాహృతమ్.

ఒకటవ అధ్యాయము - నాట్యోత్పత్తి

[జ్యోతిర్మయీం ప్రసూనాంగీ మానందలహరీంపరామ్
ఉపాస్మహే శివాం దేవీం లలితాభినయాత్మికామ్.
శృంగారాది రసేష్వేషు య దంత ర్భాతి నిత్యశః
త ద్వందే శాంత మద్వైతం యేన సర్వమిదం తతమ్.
సుబ్రహ్మణ్యోహి హారిత స్తత్త్వాన్వేషణ కాంక్షయా
ఆంధ్రవాణీమలంకర్తుం నాట్యవేదం సమర్పతి.]

జగత్తునకు తాతవంటివాడగు బ్రహ్మకు, మహేశ్వరునకు శిరఃపూర్వకముగా ప్రణామము చేసి, బ్రహ్మ ఉపదేశించిన నాట్యశాస్త్రమును భరతుడు చెప్పబోవుచున్నాడు.

సమాప్తజప్యం వ్రతినం స్వసుతైః పరివారితమ్
అనధ్యాయే కదాచిత్తు భరతం నాట్యకోవిదమ్ ౨
మునయః పర్యుపాస్యైన మాత్రేయ ప్రముఖాః పురా
పప్రచ్ఛుస్తే మహాత్మానో నియతేంద్రియ బుద్ధయః. 3

వ్రతానుష్ఠానములను చేసినవాడు, జపమును పూర్తి గావించినవాడు, తన పుత్రులచే పరివేష్టింప బడినవాడు, నాట్యమును బాగుగా తెలిసికొనినవాడు నగు భరతుని వద్దకు ఇంద్రియ నిగ్రహము గల మహాత్ములగు ఆత్రేయాది మునులు ఒకానొక అనధ్యయన దినమున వచ్చి ఈ ప్రశ్నల నడిగిరి.

యోఽయం భగవతా సమ్యగ్గ్రథితో వేదసమ్మితః
నాట్యవేదః కథం బ్రహ్మన్నుత్పన్నః, కస్యవాకృతే, ౪
కత్యంగః, కింప్రమాణశ్చ, ప్రయోగ శ్చాస్య కీదృశః,
సర్వ మేత ద్యథాతత్త్వం భగవన్ వక్తుమర్హసి. ౫

పూజ్యులైన మీరు అతిసుందర విషయములను సేకరించి వేదతుల్యముగా నాట్యవేదమును కూర్చినారు. ఈ నాట్యవేద మెట్లు బయలుదేరినది? ఎవరికొరకు వచ్చినది? దీనిలో ఎన్ని అంగములున్నవి? వీనిని తెలిసికొనుటకు ప్రమాణము లేవి? ఈ నాట్య ప్రయోగ మేవిధముగా నుండును? ఈ విషయములను సమగ్రముగా మాకు తెలియజేయుటకు మీరే యోగ్యులు.

తేషాంతు వచనం శ్రుత్వా మునీనాం భరతో మునిః
ప్రత్యువాచ తతో వాక్యం నాట్యవేద కథాంప్రతి.

భవద్భిః శుచిభిర్భూత్వా తథాఽవహిత మానసైః
శ్రూయతాం నాట్యవేదస్య సంభవో బ్రహ్మనిర్మితః. ౭

ఆ మునుల వాక్యములను వినిన తర్వాత నాట్యవేద కథను గురించి భరతముని ఈ రీతిగా చెప్పసాగెను - మీరు శుచి, శ్రద్ధగల మనస్సులతో బ్రహ్మచే నిర్మింపబడిన నాట్యవేదము ఎట్లు ఉత్పన్నమైనది వినవలెను.

పూర్వం కృతయుగే విప్రావృత్తే స్వాయంభువేఽంతరే
త్రేతాయుగేఽథ సంప్రాప్తే మనోర్వైవస్వతస్య తు, ౮

గ్రామ్యధర్మ ప్రవృత్తేతు, కామ లోభ వశంగతే,
ఈర్ష్యాక్రోధాది సంమూఢే, లోకే సుఖిత దుఃఖితే, ౯

దేవ దానవ గంధర్వ యక్ష రక్షో మహోరగైః
జంబూద్వీపే సమాక్రాంతే లోకపాల ప్రతిష్ఠితే, ౧౦

మహేంద్ర ప్రముఖైర్దేవై రుక్తః కిల పితామహః
'క్రీడనీయక మిచ్ఛామో దృశ్యం శ్రవ్యంచ యద్భవేత్ ౧౧

నవేదవ్యవహారోఽయం సంశ్రావ్యః శూద్రజాతిషు
తస్మాత్ సృజాపరం వేదం పంచమం సార్వవర్ణికమ్.' ౧౨

కృతయుగము పోయి త్రేతాయుగము వచ్చినపుడు స్వాయంభువ మన్వంతరము గడచి ఏడవది అగు వైవస్వత మన్వంతరము సంప్రాప్తమైనది. ప్రజలు అప్పుడు కామమునకు, లోభమునకు వశులై పశుప్రాయులై గ్రామ్య ధర్మములో పడిరి. సుఖదుఃఖములతో నిండిన జగత్తు అసూయ, కోపము మొదలగు దుర్గుణములకు లోనైనది. లోకపాలకులచే కాపాడ బడుచున్న జంబూద్వీపము దేవ, దానవ, గంధర్వ, యక్ష, రాక్షస, నాగముల వశమైనది. అప్పుడు మహేంద్రుడు మొదలగు దేవతలు బ్రహ్మవద్దకు పోయి, "దృశ్యము, శ్రవ్యము నగు క్రీడనీయక మేదికలదో దానిని కోరుచున్నాము. వేదములను వినుటకు అన్ని వర్ణములకు అధికారము లేదనినారు. కావున సర్వవర్ణములకు పాఠ్యయోగ్యము, ప్రయోగ యోగ్యము నగు క్రొత్త ఐదవ వేదమును సృష్టింప వలసినది" అని ప్రార్థించినారు.

చిత్తమునకు విక్షేపము, వికాసము, ఉత్తేజము కలుగజేయునది క్రీడనీయకము. మనస్సులో దాగియున్న భయశోకాది భావములు నాట్యమును దర్శించుటవలన బహిర్గతములు కాగలవు. దీనిని చిత్తద్రుతి అందురు. ద్రుతచిత్తమున రజస్తమోగుణములు సత్త్వగుణములోనికి పరిణమించగా చిత్తవిస్తృతి, చిత్తవికాసము కలుగ గలవు. ఈ పరిణామమును తెచ్చునది క్రీడనీయకి మనబడును. సుఖదుఃఖములు రెండును ఉన్నపుడే క్రీడనీయకము అవసరమగును. కేవలము సుఖమే గల కృతయుగమున క్రీడనీయకి యనవసరము. కేవలము దుఃఖమే ఉన్నకాలమున నాట్యము మాయగా భాసించ గలదు. సుఖదుఃఖములతో నున్న లోకమునకు నాట్యము మార్గదర్శకము కాగలదు. ఈ నాట్యమున కన్ను, చెవి అను రెండు ఇంద్రియములును కలసి ప్రవృత్తి పరము లగుచున్నవి. వీటిని కావ్యేంద్రియము లందురు. దృశ్యము, శ్రవ్యమునైన నాట్యము ప్రీతిని, వ్యుత్పత్తిని ఇచ్చునదని భావము.

ఏవమస్త్వితి తా నుక్త్వా దేవరాజం విసృజ్యచ
సస్మార చతురో వేదాన్ యోగమాస్థాయ తత్త్వవిత్. ౧౩

దేవతల ప్రార్థనను విని, "అట్లే అగుగాక" అని పలికి మహేంద్రాదులను పంపివేసి, సమస్తలోక వేదజ్ఞుడగు బ్రహ్మ, యోగసమాధిలో మగ్నుడై, తన బుద్ధికుశలతతో నాలుగు వేదములను స్మరించెను.

ధర్మ్య, మర్థ్యం, యశస్యంచ, సోపదేశం, ససంగ్రహమ్,
భవిష్యతశ్చ లోకస్య సర్వకర్మానుదర్శకమ్, ౧౪
సర్వశాస్త్రార్థ సంపన్నం సర్వశిల్ప ప్రవర్తకమ్,
నాట్యాఖ్యం పంచమం వేదం సేతిహాసం కరోమ్యహమ్. ౧౫
ఏవం సంకల్ప్య భగవాన్ సర్వవేదానుస్మరన్
నాట్య వేదం తతశ్చక్రే చతుర్వేదాంగ సంభవమ్. ౧౬

చక్కని ఉపదేశముతో కూడినది, ధర్మార్థములతో నున్నది, కీర్తిప్రదము, సులభముగా తెలియబడునది, సర్వశాస్త్రములలోని అర్థములతో కూడినది, సర్వశిల్పములకు ప్రవృత్తిహేతువు నగు నాట్యవేదమును ఇతిహాస యుక్తముగా నిర్మింపవలెనని బ్రహ్మ సంకల్పించెను. ఈ విధముగా సంకల్పించి అన్ని వేదములను చక్కగా స్మరించి, వేదవేదాంగముల నుంచి ఉత్పన్నమైన నాట్యవేదమును సృష్టించెను.

జగ్రాహ పాఠ్యమృగ్వేదాత్, సామభ్యో గీత మేవచ,
యజుర్వేదాదభినయాన్, రసానాథర్వణాదపి. ౧౭
వేదోపవేదైః సంబద్ధో నాట్యవేదో మహాత్మనా
ఏవం భగవతా సృష్టో బ్రహ్మణా సర్వవేదినా. ౧౮

చెప్పదలచిన దానిని చక్కగా వ్యక్తముచేయు వాక్కును పాఠ్య మందురు. వాక్కుతో కూడిన అభినయము వాచికాభినయము. ఇది నాట్యమునకు శరీరము వంటిది. దీనిని ఋగ్వేదము నుంచి గ్రహించినాడు గనుక పాఠ్యము కాక్వాదిక మగు మూడు స్వరములతో నున్నది. గానమున కుపకరించు స్వరముగల సామవేదమునుండి గీతము గ్రహించబడినది. నాట్యమునకు ప్రాణము గీతము. యాగక్రియాప్రధానమగు యజుర్వేదమునుండి సుషిరాది ధ్వనులు గల ఆతోద్యము, అభినయము స్వీకరించబడినవి. విభావములు మొదలగువాటి ద్వారా వచ్చు రసములు అథర్వణ వేదములో గల శాంతిక మారణాది కర్మలనుండి తీసికొనబడినవి. వేదములతోను, వేదార్థమున కుపకరించు అర్థము కల ఉపవేదములతోను కలిసియున్న నాట్యవేదమును మహాత్ముడు, సర్వవేత్త అగు బ్రహ్మ సృష్టించెను.

ఉత్పాద్య నాట్యవేదంతు బ్రహ్మోవాచ సురేశ్వరమ్
"ఇతిహాసో మయాసృష్టః ససురేషు నియుజ్యతామ్. ౧౯

కుశలా, యేవిదగ్ధాశ్చ, ప్రగల్భాశ్చ, జితశ్రమాః,
తేష్వయం నాట్య సంజ్ఞోహి వేదః సంక్రామ్యతాం త్వయా" ౨౦

నాట్యవేదమును సృష్టించిన తర్వాత "దశరూపకమగు ఇతిహాసమును సృష్టించితిని. దేవతలచే దానిని ప్రయోగింపజేయుము. గ్రహణధారణ యోగ్యులు, ఊహాపోహ సమర్థులు, సభలో పిరికితనము లేనివారు, అలసట ఎరుగనివారు నగు నటులకు నాట్యమును సంక్రమింపజేయుము" అని సురేశ్వరుని బ్రహ్మ ఆదేశించెను.

తచ్ఛ్రుత్వా భగవాన్ శక్రో బ్రహ్మణా య దుదాహృతమ్
ప్రాంజలిః ప్రణతోభూత్వా ప్రత్యువాచ పితామహమ్. ౨౧
'గ్రహణే, ధారణే, జ్ఞానే, ప్రయోగే చాస్య సత్తమ
అశక్తా భగవన్ దేవా అయోగ్యా నాట్యకర్మణి ౨౨
య ఇమే వేదగుహ్యజ్ఞా ఋషయః సంశిత వ్రతాః
ఏతేఽస్య గ్రహణే శక్తాః ప్రయోగే ధారణే తథా' ౨౩

బ్రహ్మ మాటలకు ఆలకించి, సాంజలిగా ఇంద్రుడు ప్రణమిల్లి "గురువుదగ్గర విషయములను చక్కగా తెలిసికొనుట, తెలిసికొనిన దానిని మరచిపోకుండుట, ఊహాపోహ విచారము కలిగి

యుండుట, సభలో నాట్యమును ప్రయోగించుట అను ఈ నాలుగు విషయములలోను దేవతలకు శక్తిలేదు. సహజముగా సుఖమును కోరు దేవతలు నాట్యకర్మకు యోగ్యులు కారు. అందుచేత వేదముల రహస్యములను తెలిసికొనిన వారు, అభ్యాసము చేయగలవారునగు ఋషులు నాట్యము యొక్క గ్రహణ, ధారణ, జ్ఞాన ప్రయోగములందు సమర్థులు" అని విన్నవించుకొనెను.

శ్రుత్వాతు శక్రవచనం మామాహాంబుజ సంభవః
'త్వం పుత్రశత సంయుక్తః ప్రయోక్తాస్యభవానఘ'. ౨౪
ఆజ్ఞాపితో విదిత్వాహం నాట్యవేదం పితామహాత్
పుత్రా నధ్యాపయామాస ప్రయోగం చాపితత్త్వతః. ౨౫

ఇంద్రునిపలుకులు విని 'పాపరహితుడవైన నీవు నీ నూర్గురు పుత్రులతోకలసి నాట్యమును ప్రయోగింపుము' అని భరతుని బ్రహ్మ ఆదేశించెను. ఇట్లు ఆజ్ఞాపింపబడి బ్రహ్మవద్దనే నాట్యవేదమును అభ్యసించి, నాట్యప్రయోగమును ఉన్నది ఉన్నట్లుగా భరతుడు తన పుత్రులకు నేర్పెను.

శాండిల్యం చైవ, వాత్స్యంచ, కోహలం, దత్తిలంతథా,
జటిలాంబష్టకౌ చైవ, తండు, మగ్నిశిఖం తథా, ౨౬
సైంధవం, సపులోమానం, శాడ్వలిం, విపులంతథా,
కపింజలిం, బాదిరంచ, యమ ధూమ్రాయణౌ తథా, ౨౭
జంబుధ్వజం, కాకజంఘం, స్వర్ణకం, తాపసం తథా,
కైదారిం, శాలికర్ణంచ, దీర్ఘగాత్రం చ శాలికమ్, ౨౮
కౌత్సం తాండాయనించైవ పింగలం, చిత్రకం తథా,
బందులం, భల్లకంచైవ, ముష్టికం సైంధవాయనమ్, ౨౯
తైతిలిం, భార్గవంచైవ, శుచిం, బహుల మేవచ,
అబుధం, బుధసేనంచ, పాండుకర్ణం, సుకేరలమ్, 30
ఋజుకం, మండకంచైవ, శంబరం, వంజులంతథా,
మాగధం, సరలంచైవ, కర్తారం, చోగ్రమేచవ, 3౧
తుషారం, పార్షదంచైవ, గౌతమం, బాదరాయణమ్,
విశాలం, శబలంచైవ, సునాభం, మేషమేవచ, 3౨
కాలియం, భ్రమరంచైవ, తథాపీఠముఖంమునిమ్,
నఖకుట్టాఽశ్మకుట్టౌచ, షట్పదం, సోత్తమంతథా, 33
పాదుకో పానహౌచైవ, శ్రుతించాషస్వరంతథా,
అగ్నికుండాఽజకుండౌచ, వితండ్యం, తాండ్యమేవచ, 3౪
కర్తరాక్షం, హిరణ్యాక్షం, కుశలం, దుఃసహంతథా,
లాజం, భయానకంచైవ, భీభత్సం, సవిచక్షణమ్, 3౫
పుండ్రాక్షం, పుండ్రనాసంచ, అసితం, సిత మేవచ,
విద్యుజ్జిహ్వం, మహాజిహ్వం, శాలంకాయన మేవచ, 3౬
శ్యామాయనం, మాఠరంచ, లోహితాంగం తథైవచ,
సంవర్తకం, పంచశిఖం, త్రిశిఖం, శిఖమేవచ, 3౭
శంఖవర్ణముఖం షండం, శంకు కర్ణమథాపిచ,
శక్రనేమిం,గభస్తించా, ప్యంశుమాలిం, శఠం తథా, 3౮
విద్యుతం, శాంతజంఘంచ, రౌద్రం, వీరమథాపిచ,
పితామహాజ్ఞయా స్మాభిర్లోకస్యచ గుణేప్సయా 3౯

ప్రయోజితంపుత్ర శతం యథాభూమివిభాగశః
యోయస్మిన్ కర్మణి యథా యోగ్యస్తస్మిన్ సయోజితః. ౪౦

శాండిల్యుడు మొదలుగాగల నూర్గురు నటులగుటచేత భారతపుత్రులని పిలువబడినారు. వీరిలో కన్పించు కోహల, దత్తిల, తండులు ప్రత్యేకముగా నాట్యశాస్త్రములను రచించిరి. బ్రహ్మ యొక్క ఆదేశమును అనుసరించి, లోకకళ్యాణమును కోరి, భూవిభాగమును గుర్తించి, వీరిచే భరతుడు నాట్యప్రయోగమును చేయించెను. ఏపని జేయుటకు ఎవడు శక్తి యోగ్యతలు కలిగి ఉబలాటపడెనో, వానిని ఆ పనిలో నియమించెను.

భారతీం, సాత్త్వతీం చైవ, వృత్తి మారభటీం తథా,
సమాశ్రితః ప్రయోగస్తు ప్రయుక్తో వై మయా ద్విజాః. ౪౧

భారతి, సాత్త్వతి, ఆరభటి అను మూడు వృత్తులతో కూడియున్న నాట్యమును భరతుడు ప్రయోగించెను.

వాక్కు, అవయవములు, మనస్సు, చేష్ట అనువాని సంయోగమున వచ్చు ఆకృతిని వృత్తి అందురు. ఉత్తమ స్వభావముకలవారు లలితముగను, ఇతరు లింకొక రీతిగను తమతమ పనులను నిర్వర్తించుకొనుటగలదు. ఈ భేదమువలన వృత్తులలో భేదములు వచ్చుచున్నవి. కేవలము వాగ్వృత్తియైనది భారతీవృత్తి. మనోవ్యాపారరూపమైనది సాత్వతి. శరీరమునకు చెందిన వృత్తి ఆరభటి.

పరిగృహ్య ప్రణమ్యాథ బ్రహ్మవిజ్ఞాపితో మయా
అథాహ మార సురగురుః 'కైశికీమపి యోజయ. ౪౨

యచ్చతస్యాః క్షమం ద్రవ్యం తద్బ్రూహి ద్విజసత్తమ'
ఏవం తేనాస్మ్యభిహితః ప్రత్యుక్తశ్చ మయాప్రభుః. ౪౩

'దీయతాం భగవన్ ద్రవ్యం కైశిక్యాః సంప్రయోజకమ్
నృత్తాంగహార సంపన్నా రసభావ క్రియాత్మికా, ౪౪

దృష్టామయా భగవతో నీలకంఠస్య నృత్యతః
కైశికీ శ్లక్ష్ణ నైపధ్యా శృంగార రససంభవా, ౪౫

అశక్యా పురుషైః సాతుప్రయోక్తుం స్త్రీ జనాదృతే'
తతోఽసృజన్మహా తేజా మనసాప్సరసో విభుః. ౪౬

నాట్యప్రయోగమైన తర్వాత ప్రణామ పూర్వకముగా బ్రహ్మకు తాను చేసినదంతయు భరతుడు విన్నవించుకొనెను. అప్పుడు భరతుని "కైశికీవృత్తిని కూడ ప్రయోగించుము. ఈ ప్రయోగమునకు కావలసిన సౌందర్య వస్తువులను తెలుపుము" అని దేవగురువు పలికెను. "నృత్తము, అంగహారములు కలది, రసభావక్రియలను ఆత్మగా గలది యగు కైశికీవృత్తి శృంగార రసమున బయలుదేరునది. ఉచితమైన వేషము దీనికి కావలెను. మహేశ్వరుడు నృత్యముచేయు నపుడు ఈ కైశికీవృత్తిని చూచితిని. స్త్రీలు లేకుండా, కేవలము పురుషులు దీనిని ప్రయోగింప జాలరు. కావున కైశికీ వృత్తిని చక్కగా ప్రయోగించుటకు కావలసిన ఉపకరణములనిమ్ము" అని భరతుడు సమాధానము నిచ్చెను. అప్పుడు మహాతేజస్సుగల అప్సరసలను పరమేష్ఠి సంకల్ప మాత్రమున సృష్టించెను. సుకుమారమైన ఆంగికాభినయమున కైశికీవృత్తి గలదని భావము.

నాట్యాలంకార చతురాః ప్రాదాన్మహ్యాం ప్రయోగతః
మంజుకేశీం, సుకేశీంచ, మిశ్రకేశీం, సులోచనామ్, ౪౭

సౌదామినీం, దేవదత్తాం, దేవసేనాం, మనోరమామ్,
సుదతీం, సుందరీంచైవ, విదగ్ధాం, విపులాం తథా ౪౮

సుమాలాం, సంతతించైవ, సునందాం, సుముఖీంతథా,
మాగధీ, మర్జునీంచైవ, సరలాం, కేరలాం, ధృతిమ్, ౪౯
నందాం, సపుష్కలాంచైవ, కలభాంచైవ మే దదౌ
స్వాతిర్భాండ నియుక్తస్తు సహశిష్యైః స్వయంభువా ౫౦
నారదాద్యాశ్చ గంధర్వా గానయోగే నియోజితాః.

కైశికీ వృత్తితో నాట్యమునకు వైచిత్ర్యమును, విశిష్టతను తెచ్చువారు, చతురులునగు మంజుకేశి మొదలుగాగల ఇరువది నలుగురు అప్సరసలను కైశికీ ప్రయోగముతో భరతునకు బ్రహ్మ అప్పగించెను. నాట్యమునకు గీతము, ఆతోద్యముకూడ అవసరమే. అందుచే పుష్కర వాద్యమును నిర్మించిన స్వాతిని, పణవ మృదంగాది వాద్యములలో ప్రసిద్ధులైన స్వాతియొక్క శిష్యులను, గానమునకై నారదుడు మొదలుగాగల గంధర్వులను భరతునకు అర్పించిరి.

ఏవంనాట్యమిదం సమ్యగ్బుద్ధ్వా సర్వైః సుతైః సహ ౫౧
స్వాతి నారద సంయుక్తో వేదవేదాంగ కారణమ్.
ఉపస్థితోఽహం లోకేశం ప్రయోగార్థం కృతాంజలిః ౫౨
'నాట్యస్య గ్రహణం ప్రాప్తం బ్రూహి కిం కరవాణ్యహమ్.'
ఏతత్తువచనం శ్రుత్వా ప్రత్యువాచ పితామహః ౫౩
'మహానయం ప్రయోగస్య సమయః సముపస్థితః.
అయం ధ్వజమహః శ్రీమాన్ మహేంద్రస్య ప్రవర్తతే. ౫౪
అత్రేదానీ మయంవేదో నాట్యసంజ్ఞః ప్రయుజ్యతామ్.'

వేదవేదాంగములనుండి ఉత్పన్నమైన నాట్యమును పుత్రులు, తాను చక్కగా తెలిసికొనిన తర్వాత నాట్యప్రయోగమును భరతుడు జరుపదలచెను. అందుకు స్వాతి, నారదులతోకలసి, చేతులు మోడ్చి, బ్రహ్మను సమీపించి, "నాట్యమును గ్రహించితిమి. శిక్షణలోనికి వచ్చినది. ఇకపైన ఏమిచేయవలెను" అని భరతుడు అడిగెను. దైవవశాత్తు త్వరలో మహత్తరమైన ఇంద్రధ్వజ మహోత్సవము రానున్నది. ఇది ఇంద్రుని ఉద్దేశించిన ఉత్సవము. నాట్యప్రయోగమునకు అనుకూలమైన దివ్యసమయ మిది. కావున ఈ ఉత్సవములో నాట్యవేదమును ప్రయోగింపుము" అని బ్రహ్మ ఆదేశించెను.

తతస్తస్మిన్ ధ్వజమహే నిహతాసుర దానవే ౫౫
ప్రహృష్టా మర సంకీర్ణే మహేంద్ర విజయోత్సవే
పూర్వం కృతా మయా నాందీ హ్యాశీర్వచన సంయుతా, ౫౬
అష్టాంగ పదసంయుక్తా, విచిత్రా వేద నిర్మితా,
తదంతేఽను కృతిర్బద్ధా యథా దైత్యాః సురైర్జితాః, ౫౭
సంఫేట విద్రవకృతా ఛేద్య భేద్యా హవాత్మికా.

రాక్షసులు నశించిన తర్వాత సంతుష్టులైన దేవతలు మహేంద్ర విజయోత్సవమున స్వేచ్ఛగా విహరించుచుండగా ఇంద్రధ్వజ మహోత్సవము వచ్చినది. అప్పుడు నాట్య ప్రయోగమునకు ముందుగా వేద నిర్మితము, అష్టాంగ పదములతో నున్నది, ఆశీర్వచనరూపము, విచిత్రము నగు నాంది ప్రయోగింపబడెను. నాందికాగానే రాక్షసులు ఓడిపోయిన విషయము నాట్యరూపమున చూపబడినది. ఈ నాట్యమున రోషము, శంక, భయములను తెలుపు వాక్యములు, శస్త్రయుద్ధము, మల్లయుద్ధము కలవు.

తతో బ్రహ్మాదయో దేవాః ప్రయోగపరితోషితాః ౫౮

ప్రదదుర్మత్సుతేభ్యస్తు సర్వోపకరణానివై.
ప్రీతస్తు ప్రథమం శక్రోదత్తవాన్ స్వంధ్వజం శుభమ్, ౫౯
బ్రహ్మా కుటిలకం చైవ; భృంగారం వరుణః శుభమ్,
సూర్యశ్ఛత్రం, శివస్సిద్ధిం, వాయుర్వ్యజనమేవచ. ౬౦
విష్ణుఃసింహాసనం చైవ, కుబేరోమకుటంతథా.
శేషా యే దేవ గంధర్వా యక్ష రాక్షస పన్నగాః ౬౧
తస్మిన్ సదస్యభిప్రేతా న్నానాజాతి గుణాశ్రయాన్
అంశాంశైర్భాషితాన్ భావాన్ రసాన్ రూపం క్రియాబలమ్, ౬౨
దత్తవంతః ప్రహృష్టాస్తే మత్సుతేభ్యో దివౌకసః.

బ్రహ్మ మొదలగు దేవతలు ఈ నాట్యప్రయోగమును చూచి సంతుష్టులై భరత పుత్రుల కనేక బహుమతుల నర్పించిరి. ప్రీతుడైన ఇంద్రుడు మొట్టమొదట శుభప్రదమైన ధ్వజము నిచ్చెను. విదూషకున కుపకరించు వంకర కర్రను బ్రహ్మ, పారిపార్శ్వకులకై భృంగారమును వరుణుడు, గొడుగును సూర్యుడు, శివుడు శైవి మానుషి అను సిద్ధులను, వాయువు వింజామరలను, రాజ భూమికకు సింహాసనమును విష్ణువు, మకుటమును కుబేరుడు ఇచ్చిరి. సభాసదులకు అభిరుచిని కల్గించునవి, నానాజాతి గుణాశ్రయములు నగు వాచికాభినయమును, విభావాది భావములను, శృంగారాది రసములను, ఆంగికాభినయమునకు కావలసిన రూపమును, చేష్టను, బలమును మిగిలిన దేవ, గంధర్వ, యక్ష, రాక్షస, పన్నగములు వారి వారి అంశలకు అనుగుణముగా ఇచ్చిరి.

ఏవం ప్రయోగే ప్రారబ్ధే దైత్యదానవ నాశనే ౬౩
అభవన్ క్షోభితాః సర్వే దైత్యాయే తత్రసంగతాః
విరూపాక్ష పురోగాంశ్చ విఘ్నానుత్పాదయంతి తే ౬౪
"నేత్థమిచ్ఛామహే నాట్యమే తదాగమ్యతా" మితి,
తతస్తై రసురైః సార్థం విఘ్నామాయాము పాశ్రితాః ౬౫
వాచశ్చేష్టాం స్మృతించైవ స్తంభయంతిస్మ నృత్యతామ్.

దైత్యదానవ నాశన మనబడు నాట్యప్రయోగము మొదలుకాగానే, విరూపాక్షుని నాయకత్వమున అచటకు వచ్చిన రాక్షసులు క్షోభిల్లినవారై, 'ఇట్టి నాట్యము మాకు అక్కరలేదు; రానీ, చూచెదముగాక !' అని తలచి, మాయారూపమున విఘ్నములు చేయసాగిరి. దానితో నృత్యము చేయువారి వాక్కు, ఆంగికాభినయము, స్మృతి స్తంభించి పోయినవి.

(స శే ష ము)

★

భిక్షునీ వృత్తి

శ్రీ 'భద్రశ్రీ'

నిఘంటుకారుల నిర్వచనం ఏమైనా, వృత్తి అంటే జనం తమ నిత్యజీవితాలను వెళ్లదీయటానికిగాను ధనార్జన నిమిత్తమై ఆశ్రయించిన కళ - అని అర్థం చేసుకోవచ్చు.

బౌద్ధయుగంలో ఈ క్రింది అష్టాదశ వృత్తుల వారు ఉన్నట్లు తెలుస్తున్నది: (1) దారుకర్మకారులు, (2) లోహకర్మకారులు, (3) శిలాకర్మకారులు, (4) తంతువాయువులు, (5) చర్మకారులు, (6) కుంభకారులు, (7) దంతపుపనివారు, (8) వస్త్రాలకు రంగువేయువారు, (9) స్వర్ణకారులు, (10) జాలరులు, (11) మాంసవిక్రేతలు, (12) మృగయులు, (13) పాపకర్మకారులు, (14) అంబష్ఠులు, (15) అంగమర్దకులు, (16) పుష్పమాలాకారులు, (17) నావికులు, (18) కటకారులు-చిత్రకారులు. వీరిలో ముఖ్య వృత్తుల వారికి తర తమ భేదాలతో ఆయా వృత్తి సభలుండేవి. ఏ విషయంలోనైనా వివాదం కలిగినప్పుడు, పై సభవారి తీర్పు క్రింది సభవారికి అనుష్ఠేయంగా వుండేది.

మరొక దృక్కోణం నుంచి చూస్తే వేరు తెగల వృత్తులు కూడా మనకు గోచరిస్తాయి. పాలకుని మొదలు సేవకుని వరకు గల రాచరికానికి సంబంధించిన ఆధికారిక వృత్తులు, మణివలయ న్యాయంగా-మణిచేత కంకణము, కంకణముచేత మణి ప్రకాశించినట్లు-ప్రకాశిస్తాయి. (1) వైద్యవృత్తి-మంత్రసాని వృత్తి, (2) పశుపోషణ వ్యవసాయము, (3) రక్షకభట వృత్తి-అపరాధ పరిశోధకవృత్తి- ఇవన్నీ ఈ కోవకు చెందినవే. బాగా విచారిస్తే, అరువదినాలుగు కళలూ అరువదినాలుగు వృత్తులే!

ఇవికాక, వేదకాలంలోనే ఉంఛశిలా వృత్తులున్నట్లు వింటున్నాము. పొలాల్లో పరిగ ఏరుకొని జీవించడం ఉంఛ వృత్తి, దంచిన రోళ్ళవద్ద చెదరిపోయిన గింజలను తెచ్చుకొని జీవించటం శిలావృత్తి. ఈ వృత్తులు సార్వజనీనాలు, సార్వకాలికాలు, ఆచరణ సాధ్యాలు కాకపోయినప్పటికీ, ఇవి స్వచ్ఛందాలు స్వచ్ఛతమాలు అనడానికి సందేహం లేదు.

ఇంక 'కరతల భిక్ష స్తరుతలవాస' మన్నట్లుగా ఏ గడప కడ దొరకిన భిక్షాన్న మక్కడనే అంగిట వేసికొని జీవించే వారున్నారు. వారినే హంసలని, పరమహంసలని అంటారు.

నిత్య స్వాధ్యాయ తపో నిరతులు తమ జీవనోపాధికై శాలీన, వార్తా, యాయవర, ఘోర సన్యాసవృత్తుల నాశ్రయించినట్లు తెలియవస్తున్నది. ఈనాటికీ మనకీ వృత్తులు ఏదో ఒక రూపంలో కనిపిస్తూనే వున్నాయి.

బౌద్ధయుగంలో భిక్షునీవృత్తి ఒకటి మాననీయమైంది. అందాకా పురుషులకే పరిమితమై యుండిన భిక్షువృత్తి అటుతర్వాత స్త్రీలకు సైతం పరిపాటి అయింది.

స్త్రీ సహజములైన కాయిక మానసిక దౌర్బల్యాలు కారణంగా, బుద్ధుడు వారి నుపాసికల గావించుట కంగీకరింపలేదు. కాని, మహాప్రజాపతి గౌతమీదేవి బుద్ధోపాసిక కావటానికి, ఆనందుని అభ్యర్థనపై, బుద్ధుడు సమ్మతించటమే మొదలు! నిర్వాణ సుఖానుభూతికి స్త్రీపురుషు లిరువురూ అధికారులే అన్న నిగూఢ సత్యం నిరూఢమైంది.

ప్రశాంత జీవనం స్వచ్ఛతమ చరిత్ర, పరబాధాఽసహిష్ణుత, పరోపకార ప్రవణత - ఇవి భిక్షునుల లక్షణాలు ఇవి కలిగి యుండుటే కాక, పాపమూలములగు నీ క్రింది పది యపరాధములకు భిక్షునులు పాల్పడరాదు. (1) ప్రాణాతిపాదము, (2) అదత్తాదానము, (3) కామమిథ్యా చర్య, (4) మృషావాదము, (5) పైశున్యము, (6) పారుష్యము, (7) సంభిన్న ప్రలాపము, (8) పరద్రవ్యాపేక్ష, (9) ద్రోహబుద్ధి, (10) మిథ్యాభాషణము - అనేవి ఈ అపరాధాలు.

ఎనిమిది వరతులకు లోబడి, స్త్రీలు భిక్షునులు కావటాన్ని బుద్ధు డంగీకరించాడు. ఆ

వరతులు: (1) వృద్ధభిక్కుని కూడా యువ భిక్కునకు నమస్కరింపవలె, (2) భిక్కులు లేనిచోట వర్షావాసము చేయరాదు, (3) భిక్కు సంఘం ముందు తన తప్పులుంటే ఒప్పుకోవాలి, (4) పాక్షిక సమావేశాలను భిక్కులే జరపాలి, (5) ఉపాసిక లున్నత తరగతులలో చేరవలెనంటే భిక్కు భిక్కునుల సంఘమంతటి ఒప్పుదల కావాలి, (6) పురుషులను భిక్కునులు చీవాట్లు పెట్టరాదు, (7) ఆక్షేపించరాదు, (8) రోగియైన భిక్కునిని భిక్కువు సమీపింపవచ్చును.

శ్రుతాపన్న, ఉపాసిక, అర్హత అని భిక్కునులు మూడు తరగతులు.

ఐదువందలమందితో వైశాలీనగరంలో మహా ప్రజాపతి గౌతమీదేవి ముండితయై పసుపు పచ్చని బట్టలు కట్టుకొని, త్రిశరణాలను ఉచ్చరించింది. నూటయిరువది వత్సరాల పూర్ణాయుర్దాయం పొందింది. ఈమెయే అర్హత్స్థానాన్ని అందుకొన్న మొట్టమొదటి భిక్కుని!

పాళీ భాషలోనున్న 'తేరిగాధ' అనే గ్రంథంలో పెక్కు భిక్కునులు వ్రాసిన పద్యాలు ఐదువందలున్నాయి. 'అంగుత్తర నికాయం' లో పెక్కు భిక్కునులు పేర్కొనబడినారు.

వీరిలో సాగలరాజ పుత్రి క్షేమ, కుబేర కుమారి పటాచార, అతిలోక సుందరి అంబాపాలి, కౌశాంబీ రాజపత్ని శ్యామావతి, బ్రాహ్మణ గృహిణి విశాఖ చెప్పుకోదగినవారు.

అశోకుడు బర్మా, తాయిలాండ్, చైనా, జపాను, సిరియా, ఈజిప్టు ఉత్తర గ్రీసు, నేపాలు, టిబెట్టు, సిలోను మున్నగు దేశాలకు బౌద్ధమత ప్రచారం కోసం భిక్కునులను పంపినాడు. సుమనుడనే బౌద్ధ భిక్కువు విదిశాగిరిలోనున్న తన తల్లిని, 40 వేలమంది స్త్రీలను దీక్షితల గావించినాడు. అక్కడి రాకుమారి అచల పంచశత పరిజనంతో చితియగిరి వద్ద దీక్ష తీసుకోదలచింది. కాని స్త్రీలకు స్త్రీలే ఉపదేశించవలెనని ఆమె అభిమతం. అశోకుడు మహేంద్రుని, సంఘమిత్రను (ఈమెయే అశోకుని కుమార్తె యగు చారుమతి) సింహళానికి పయనం కట్టించాడు. తాను కూడా శ్రావస్తీ నగరం వెళ్ళి, అక్కడినుండి వార్ధక్య, రాజకీయములు కారణములుగా వెను దిరిగినాడు. సంఘమిత్ర బోధిశాఖతో సింహళం ప్రవేశించి రాకుమారికి ఉపాసికా దీక్ష ఇప్పించింది. తన 59 వ సంవత్సరం వరకు అచ్చటనే ఆమె ధర్మప్రబోధం చేస్తూ గడిపింది. సింహళంలో ఆమె పేరిట ఒక గొప్ప ఆరామం కూడా ఏర్పాటు చేయబడింది. ఆ రోజుల్లో రాజాధిరాజులు, మహారాణులు, కోటీశ్వరులు భిక్కునుల పోషణకై సమర్పించిన ధనంతో సంఘారామాలు నడుపబడేవి.

భిక్కునులు ముఖ్యంగా విద్యా, లలితకళలు నేర్వవలసి వున్నది. రోగులకు పరిచర్య చేయటం కూడా భిక్కునులు నేర్వవలసిన ఒక వృత్తి.

పవిత్ర వ్రతదీక్షితలై యావజ్జీవం ఆత్మోన్నతికి ప్రయత్నించటంతో బాటు, దీనానాథ మానవసేవకై తమ జీవిత సర్వస్వాన్ని అర్పించినవారు భిక్కునులు.

ప్రాగ్దేశాలలో పరివ్యాప్తమైన భిక్కునుల సంఘం క్రమక్రమంగా కోటిసంఖ్యాకమైంది. వృత్తితో లలితకళలు, లలితకళలతో వృత్తి పెనవైచుకొన్న నాటి విద్యావిధానం ప్రజాదరణ పొందటానికి అనాటి భిక్కునుల నిర్మల ప్రవృత్తియే ప్రబలకారణమన్న మాట మరువరానిది.

ఉదాహరణకు - సుప్రియ అనే భిక్కుని బాల్యంనుండి పూర్వజ్ఞానం కలిగిన వ్యక్తి. ఆనాడు దేశంలో కరువుకాటకాలు చెలరేగి జనం నానా కష్టాల పాలైనారు. ఆ ప్రజాకోటికి సేవచేయడం ఎలాగో తెలియక, భిక్కువు లెవ్వరూ ముందుకు రాలేకపోయారు. అప్పుడు సుప్రియ ముందుకువచ్చి క్షామ నివారణకు ఏకైక సాధనంగా తన భిక్షాపాత్రని చూపింది; అహర్నిశలు తిరిగి ప్రజాసేవ గావించింది.

మన కావ్యాలలో గూడా భిక్కునులు స్వస్వరూప స్వభావాలతో మూర్తివహించారు.

మాలతీ మాధవంతో 'కామందకి' ఇట్టిది. వీరు రాజాంతఃపురాలలో ఆదరణపొంది ఉండటం, నాయికా నాయకుల సంధానానికి తాపత్రయపడటం కానవస్తుంది. కాని భిక్కునులు అందరకూ సమాదరణీయలే అన్న విషయం

ఇక్కడ గమనించాలి. విశాఖదత్తుని ముద్రారాక్షసంలో క్షపణకుడు జీవసిద్ధి మొదలైన బౌద్ధభిక్షులు రాజకార్య నిర్వహణంలో పాల్గొన్నట్లు తెలుస్తుంది. శూద్రకుని మృచ్ఛకటికలో సంవాహక పాత్ర సృజింపబడింది. ఆ పాత్ర లేకపోతే, ఆ నాటకమే లేదనవచ్చు. కథాకీలక స్థానంలో నున్న సంవాహకుడు ప్రారబ్ధవశంచేత ద్యూత వ్యసనంలో తగులుకొన్నాడు. తుదకు బౌద్ధ భిక్షువైనాడు. త్రిశరణాలను ఆశ్రయించినాడు. ఇట్టి నికృష్ట వ్యసనాసక్తుని వృత్తినిసైతం వజ్రకాంతులతో ధగద్ధగాయమానంగా వెలుగొందునట్లు చిత్రించాడు, ప్రతిభాన్వితుడైన మహాకవి శూద్రకుడు.

ఏవం విధ గుణ గణ సంశోభితులై మానవ సేవకై తమ జీవితాల నర్పించిన భిక్షువుల యొక్కయు, వారికి తమ సర్వస్వం సమర్పించిన త్యాగమూర్తుల యొక్కయు పవిత్రగాధలు భారతైతిహ్యంలో సువర్ణాక్షరాలతో లిఖింపదగియున్నవి.

★

ఊర్మిళ

శ్రీ సి. నారాయణరెడ్డి, ఎం. ఏ.

కడసందెవెన్క చంద్రుడు వచ్చుదన్క బే
ల్వడినిల్చు ఇరులతీవను స్మరింపఁగఁ జేతు
వో మనస్సన్యాసినీ ఊర్మిళా!
ఓ ఆత్మ సంభాషిణీ నిర్మలా!

మునుముందు కదలిపోయెను దాశరథి అచ్చ
మౌ కర్మయోగి దివసాంత సూర్యునివోలె.

అతని వెన్నంటి సీతమ్మ ఆతని బహిః
ప్రాణమ్ము; ఛాయావిధాన నడయాడినది

అనుసరించెను సంధ్యయై లక్ష్మణుండపుడు
తనయాత్మ నన్నపావముల క్రిందుగ పరచి.

నీ వొకత్తైవె నిల్చినావేల వెర్రి త
ల్లీ! పంకమందు తేలిన పద్మమును బోలె.

తొలి జవ్వనపు మిసిమి పులకలారని దాన;
వెపుడు నేర్చితివమ్మ! యింత వైరాగ్యమ్ము.

నినగాక మొన్న ఒల్లెను గట్టుకొనుదాన;
వెటుల తాల్చితివి తల్లీ! యింత నిగ్రహము.

కట్యనుభవముల నాగటిచాళ్లు పడకముం
దే యింత శమము నీవెటుల పండించితివి?

ఒక చిన్న గాలిదెబ్బకు జలాజల కురియు
శ్రావణాంభోద సదృశమ్ము నీ హృదయమ్ము;
గండశిలగా మార్చగల్గినావా యేమి?
కానిచో ఈ నిర్వికారమెట్టుల కల్గు.

సీతమ్మకేమి మంచి యదృష్టవతి; ఆమె
కడవులైనను నందనారామములె కదా.

సౌమిత్రికా రఘుస్వామి సర్వ; మ్మతని
కే జన్మకైన బసవెత్తుకొనుటే ఫలము.

లోకకల్యాణమునకై కాలకూటమ్ము
నీవు మ్రింగితివి కానీ చూపవద్దాని,

చిగురాకుబాకు తాల్చిన జోదునకుగూడ
నిను తేరిచూచు గుండెలు లేకపోయినవి.

నినుగూర్చి వ్రాయు లేఖిని మషీరసములో
కాదు, కన్నీట మున్కలు వేయవలెనమ్మ.

సంస్కృతుల ఉపరి ప్రశంస లెందుకు నీకు?
ప్రాకృతుల కొక దేవతాకృతిగ వెలసినా;
వో మనస్సన్యాసినీ ఊర్మిళా!
ఓ ఆత్మసంభాషిణీ నిర్మలా!

ఆ నిమిషం

శ్రీ ఆచంట జానకిరామ్

ఎంత విలువైనది ఆ నిమిషం! ఎంతకోరుకున్నా మళ్ళా వస్తుందా ? మిగిలిన నా ఆయుఃపరిమాణ మంతా యిచ్చివేస్తాను – ఆ నిమిషాన్ని మళ్ళా, ఒక్క పర్యాయం నేను అనుభవించగలిగితే.

"ఇంకా ఎన్నో, ఎన్నో అనుభవాలు వస్తాయి నీ జీవితంలోకి. నీవు కలలోనైనా ఊహింపని సౌందర్యం, ప్రేమ, గౌరవం నీ నిత్యజీవితాన్ని నింపివేస్తాయి. కాల స్రవంతిలో పడిపోయిన ఆ నిమిషమే ఎందుకు నీకు?" అంటుంది సూర్యాస్తమయ సమయంలో కాఱు మేఘపుటంచును వెండి బంగారాలతో అలంకరిస్తూ, విధి.

ఆ అందం, కన్నులు మిరుమిట్లుగొల్పే ఆ రేఖలు ఎంతోసేపు ఉండవు. మళ్ళా క్రొత్త అందం వస్తుంది. క్రొత్త రేఖలు వస్తాయి. నాకు మాత్రం అప్పుడు చూచిన ఆ వెండిబంగారపుఅంచే, ఆవంపే కావాలి. మళ్ళా ఎలా వస్తుంది.

నిశీధి!

ఆమె నన్ను విడిచి వెళ్ళిపోతూంటే, ఎడబాటు భరింపలేక, ఆమెను సాగనంపడానికి నూరుమైళ్ళు ఆమెతో కలసి వెళ్ళాను. రైలులో అందరూ హాయిగా నిద్రపోతున్నారు, దీపాలు ఆర్పివేసి. మేమిద్దరము ఉన్నచోట మాత్రం, నక్షత్రాల వెలుగు, ఆమెకళ్ళు ధగధగ.

ఆమెకెందుకులేదో, విడిచి వెళ్ళిపోతున్నామనే బాధ! ఎంతో ఉత్సాహముతో మెరిసిపోతున్నాయి ఆమె కళ్ళు:

'ఎక్కడుంటే ఏమి సుకుమార్! మనకు ఎడబాటు అంటూఉందా ? నీవు నాలోనే ఉంటావు ఎల్లప్పుడూ.'

–ఎలా వస్తుందో ఆడవాళ్ళకు అంత ధైర్యము! స్టేషను. నేను దిగిపోవాలి.

తలుపుతీసి, ఆమె నన్ను క్రిందికి దింపింది. గులకరాళ్ళ నేలపై నా పాదాలు ఆనిన తర్వాతనే ఆమె తన వ్రేళ్ళు తీసుకుంది నా గుప్పిటిలోంచి. ఎంత గట్టిగా పట్టుకున్నాను! పాపము – కందిన తన వ్రేళ్ళను ఆమె తన పెదవుకు తాకిస్తుండగానే రైలు కదలి సాగిపోయింది.

ఎంతో దూరాన, మరో ప్రపంచంలోంచి, రైలుకేక వినబడింది. అంతే. మర్నాడు ఆమెవద్దనుంచి ఉత్తరం వచ్చింది. ఒక్క పంక్తే !

'God ! give me back yesterday !"

నాకుమాత్రం, రోజంతా అక్కరలేదు. నా గుప్పిటిలో నలిగిపోయిన వ్రేళ్లను ఆమె తన పెదవులకు స్పృశిస్తూన్న ఆ నిమిషం ఇచ్చివేస్తేచాలు. ఆ ఒక్క నిమిషం!

మనుస్మృతిలోని సార్వజనిక దృష్టి

శ్రీ జటావల్లభుల పురుషోత్తము, ఎం. ఏ

ప్రాచీన ధర్మగ్రంథములలో మనుస్మృతికి గలస్థానము అద్వితీయము. ఈ యుత్తమగ్రంథములో మానవులకు ప్రసాదింపబడిన సుఖమార్గము బహుముఖము. ఆధ్యాత్మిక సాధనములు, పారలౌకికసుఖ ప్రాప్తిమార్గములు, వర్ణాశ్రమ ధర్మములు, సర్వజన సామాన్య ధర్మములు మున్నగునవి బహు విపులముగా నీ గ్రంథమున ప్రతిపాదింపబడినవి. ప్రజాస్వామ్యములో జీవించుచున్న మనకు మనువులోని సార్వజనిక దృష్టి యెట్లుండునో మచ్చుగానైనను తెలిసికొనవలయు నను కుతూహలముండుట సహజము. అది యీ వ్యాసమునకు ప్రసక్తి.

వ్యష్టి దృష్టికంటె సమష్టిదృష్టి ప్రశస్తమని మనువు చెప్పుచున్నాడు. కులక్షేమము కొరకు ఒక వ్యక్తిని విడువవచ్చుననియు, గ్రామక్షేమము కొరకు కులమును విడువవచ్చుననియు, దేశక్షేమము కొరకు గ్రామమును విడువవచ్చుననియు, పరమాత్మ కొఱకు ప్రపంచమునే విడువవచ్చుననియు మనువు నుడువుచున్నాడు.

త్యజేదేకం కులస్యార్థే
గ్రామస్యార్థేకులంత్యజేత్
గ్రామంజన పదస్యార్థే
ఆత్మార్థే పృధివీంత్యజేత్.

మానవుని దృష్టి యెంత విపులమైన ప్రజానీకముపై ప్రసరించిన నంత ప్రశస్తమనియు, పరమాత్మాన్వేషణమునకు ప్రపంచ దృష్టి యడ్డురాకూడదనియు దీని తాత్పర్యము. మాతాపితృ పోషణము, పాతివ్రత్యము మున్నగు కొన్ని నిర్దిష్ట ధర్మములకు ఈ సామాజిక దృష్టి భంజకము కాకూడదని మనువు స్థలాంతరమున స్పష్ట పరచి యున్నాడు.

ధనము సంపాదించుకొనజాలని స్థితిలో నున్నవారికిని, ధర్మకార్యములకు ధనము నపేక్షించువారికిని, బాధలో నున్నవారికిని ధనరూపమైన సహాయము చేయుట సమాజము ధర్మమని మనువు చెప్పుచున్నాడు

సాంతానికం యక్ష్యమాణ
మధ్వగం సర్వవేదసం
గుర్వర్థం పితృమాత్రర్థం
స్వాధ్యాయార్థ్యుప తాపినః
నవైతాన్ స్నాతకాన్ విద్యా
ద్బ్రాహ్మణాన్ ధర్మ భిక్షుకాన్
నిస్స్వేభ్యోదేయ మేతేభ్యో
దానం విద్యా విశేషతః.

వివాహమాడ గోరువాడు, యజ్ఞముచేయ గోరువాడు, మార్గస్థుడు, సర్వధనము దక్షిణగా యజ్ఞములో నిచ్చివేసినవాడు, గురువుగారికి దక్షిణ నొసగ గోరువాడు, తల్లిదండ్రులను పోషింపవలసినవాడు, బ్రహ్మచర్యాశ్రమము లోనుండి వస్త్రాద్యావశ్యక వస్తువులను కోరువాడు, రోగి - ధనహీనులైన యీ తొమ్మండుగురును దానము పొందుటకు ముఖ్యముగా అర్హులు. వీరిలోని విద్యావిశేషమును బట్టి దానాధిక్య ముండవగును. (ఇది బ్రాహ్మణ పరముగా చెప్పబడినను ఎల్లరకు వర్తించును)

ధర్మకార్యము పేరుచెప్పి ప్రజానీకమునుండి ధనము ప్రోగుచేసి యాధనమును స్వకార్యములకు వినియోగించుటను మనువు గర్హించినాడు.

యజ్ఞార్థమర్థంభిక్షిత్వా
యోనసర్వం ప్రయచ్ఛతి
సయాతిభాసతాం విప్రః
కాకతాం వాశతం సమాః.

ఎవడు యజ్ఞముకొఱకు ధనము యాచించి తెచ్చి యజ్ఞములో వ్యయపరుపడో వాడు శత వత్సరములు కాకిగానుండును.

మనువు దానముచేయుటను అనేకస్థలములలో ప్రశంసించి యున్నాడు. ఎట్టివారు దానము పొందుట కర్హులో కూడ చెప్పినాడు. దీనులపట్లను, అనాథులపట్లను పక్షపాతము ఎల్లయెడలను కనవట్టును.

గర్భిణీతు ద్వి మాసాది
స్తథా ప్రవ్రజితోమునిః
బ్రాహ్మణా లింగి నశ్చైవ
నదా హ్యాస్తారికం తరే.

నదుల రేవులను దాటునపుడు ఈయవలసిన డబ్బునకు తారిక యనిపేరు. ఈ తారికమును తీసికొనకుండగనే నావికుడు గర్భిణీస్త్రీని రేవు దాటించవలయును. రెండుమాసముల గర్భవతి యైన ఆమె తారికము నీయనక్కరలేదు. బ్రహ్మచారులు, వానప్రస్థులు, సన్యాసులు, బ్రాహ్మణులుకూడ తారికము నీయనక్కరలేదు. ఈపదములన్నియు, పేదలకు, ఆర్తులకు ఉపలక్షణములు.

ఇట్టి సందర్భము లన్నింటిలోను కనపట్టు భావములు రెండు (1) ధనార్జనమున కవకాశములేని వారిపట్ల ఉదారదృష్టిని వహింపవలయును (2) ఆర్తిలో నున్నవారికి సహాయము చేయుట పరమకర్తవ్యము.

ఆర్థికాది కారణముల చేత తమయింట వంటచేసికొనిభుజింపజాలని వారికెల్లరకు యథాశక్తిగా గృహస్థుడు అన్నము పెట్టవలయునని మనువు చెప్పుచున్నాడు.

శక్తితో పచమానే భ్యో
దాతవ్యం గృహమేధినా

కృతయుగములో తపస్సు, త్రేతాయుగములో జ్ఞానము, ద్వాపరములో యజ్ఞము ప్రధాన తరణ సాధనములని చెప్పిన మనువు కలియుగములో ప్రత్యక్ష సమాజోపకారకమైన దానము ప్రధాన తరణసాధనమని చెప్పిన సంగతి గుర్తింపదగినది.

తపః పరం కృతయుగే
త్రేతాయాం జ్ఞాన ముచ్యతే
ద్వాపరే యజ్ఞమే వాహు
ర్దానమేకం కలౌయుగే.

ధనసేకరణమునకు అందరికంటె ఎక్కువ అవకాశములు గల వైశ్యుని ధర్మమును నిర్దేశించుచు మను విట్లు చెప్పుచున్నాడు.

ధర్మేణచద్వివృద్ధా
వాతిష్ఠేద్యత్నముత్తమం
దద్యాచ్చసర్వ భూతానా
మన్నమేవ ప్రయత్నతః.

వైశ్యుడు ధర్మబద్ధమైన పద్ధతిలో ధనమును వృద్ధిచేసికొనుచుండ వలయును. ఎల్లరకును అన్నదానము చేయుటకు యత్నించుచుండవలయును. ధనము నిచ్చుటకంటె ఆహారము నిడుట మంచిదని యెరుంగవలయును.

ఆయా వర్ణములవారికి విధింపబడిన వృత్తులు సార్వజనికక్షేమకరము లనుట చాలదు. సద్యః కాలములో ప్రతి మానవుడును సార్వజనిక దృష్టితో వ్యవహరించుచుండవలయునని మనువు నాదేశము. వైశ్యునకు విశేషముగా విధించబడిన యీ యన్నదానము సర్వవర్ణగృహస్థులకుకూడ విధింపబడినది.

సమాజక్షేమమునకు వ్యతిరేకముగా దుష్టచర్యలు గావించు వారిని మనువు ఆతతాయి శబ్దముచే వ్యవహరించి అట్టి ఆతతాయి బ్రాహ్మణుడైనను, బాలుడైనను కూడ సంహరింపదగినవాడే యని చెప్పుచున్నాడు (8-350). రాజోద్యోగములో నుండి కార్యార్థులైన ప్రజల నుండి లంచములను తీసికొనువారిని సమాజద్రోహులనుగా మనువు గణించినాడు. మరియు ప్రజలను భయపెట్టి ధనము లాగు కొనువారు, జూదరులు, మోసగాండ్రు, ధనప్రాప్తి సంతాన ప్రాప్తి మున్నగు వానిని గురించి ప్రజలకు భవిష్యత్తును చెప్పువారు, పైకి కల్యాణ వేషములను వేసికొని పాపములను కప్పుకొనువారు, రేఖాసాముద్రికము చూచి చెప్పువారు, గజశిక్షలోను, వైద్యములోను జీవితము గడుపుచు ఆవిద్యలో ప్రావీణ్యము లేనివారు, ఆరితేరిన వేశ్యలు - వీరివలన ప్రజలు నష్టపోకుండునట్లు చూచుట రాజువిధి యని మనువు నుడువు చున్నాడు.

ఉత్కోచ కాశ్చోపధికా
వంచకాః కితవా స్తథా
మంగళా దేశవృత్తాశ్చ
భద్రా శ్చేక్షణికైస్సహ

చేతకాని వైద్యాది వృత్తులను చేయువారిని, జ్యోతిష సాముద్రికాదులను మోసముగా

ఉపయోగించువారిని రాజు శిక్షింపవలయునని చెప్పుచున్న మనుస్మృతిలో వ్యక్తి స్వాతంత్ర్యము సమాజక్షేమమునకెట్లు లోబడియుండవలయునో తెలియుచున్నది.

దేవతలకు తృప్తిని గల్గించు కర్మలకు ఇష్టములనియు, మానవ సమాజమునకు సుఖమును గల్గించు కార్యములకు పూర్తములనియు పేర్లు వేదములలోనే కన్పట్టుచున్నవి. ఈ పరిభాష మనువులోను కన్పట్టుచున్నది. ప్రజాసామాన్యముకొరకు తోటలను వేయించుట, వాపీ కూప తటాకాదులను త్రవ్వించుట మున్నగు పౌర్తికకర్మలను ఇష్టికములకు పిమ్మట పేర్కొనుటవలననే మనువు సమాజసేవ కెట్టి స్థానము నిచ్చినాడో తెలియగలదు.

దానధర్మం నిషేవేత నిత్యమైష్టిక పౌర్తికం
పరితుష్టేన భావేన పాత్ర మాసాద్యశక్తితః.

★

శ్రీ వేంకటేశ ప్రభూ!

భాషాప్రవీణ
శ్రీ కోమాండూరి రామానుజాచార్యులు

శ్రీమద్వేంకట శైలమందిర నమశ్శ్రీరస్తు తే సర్వదా
భూమీనాథ! సమేధతాం తవదయాస్ఫూర్తిర్మయి ప్రత్యహం
శ్యామాంభోద సమానగాత్ర సుషమా సౌభాగ్యమూర్తే జయ
స్తోమః స్యాత్ భవతే వినమ్ర జనబంధో – వేంకటేశ ప్రభో!

శ్రీదేవీ కుచ గంధసార కలిత శ్రీవక్ష! రక్షోహరా!
గోదేవీ ఖుర ధూళిధూసరిత సత్కోటీర! వేదాంత వి
ద్యాదిప్రోక్త మహోన్నతాత్మక, సపర్యా చర్యనైగొమ్ము నీ
వే, దిక్కై, నను బ్రోవు మెల్లపుడు తండ్రీ, వేంకటేశ ప్రభూ!

కింకుర్వాణ సురేంద్రమౌళి సుమనః కింజల్క పుంజ ప్రభా
పంకేజ భ్రమకృన్మనోజ్ఞ చరణాబ్జా! జ్ఞానహీనుండనై
కింకర్తవ్య విమూఢ మానసికభంగిం గ్రుంగియున్నాఁడ–నా
పంకమ్మింకఁగఁ జేయుమింక గతపంకా – వేంకటేశ ప్రభూ!

పూ ల బా స లు

శ్రీ జనమంచి రామకృష్ణ, ఎం. ఏ.

★

అంకితం

పూలంటే పలకరించే ఆత్మీయులు
శ్రీ ఆచంట జానకిరామ్ గారికి

ఈ ప్రపంచంలో రకరకాలైన పువ్వులున్నాయి. ఒక్కొక్క పువ్వుకి ఎన్నో రంగులుంటాయి. పువ్వుల పరిమళం ఎంత హాయి నిస్తుంది. కాని, అన్ని పువ్వులూ పరిమళించవు. పువ్వులని ప్రేమించలేని మానవుడు లేడుగా!

పువ్వులు పలకరిస్తాయి, నవ్వుతాయి, నవ్విస్తాయి, ఏడుస్తాయి, ఏడిపిస్తాయి, నిద్రపోతాయి, నిద్రనుండి కళ్ళు నులుముకుంటూ లేస్తాయి. పువ్వులు సంగీతం విని తన్మయత చెందుతాయి. ఐతే, ఈ పువ్వుల్లో కల్లా ఏ పువ్వు అందంగా ఉంటుందో, నన్నడగడ మెందుకు? తోటలోకి పోయి పువ్వులనే అడుగు! నాకంటే వాటికే బాగా తెలుసు.

బాబు నాన్ననడిగి సందేహం తీర్చుకుందా మనుకున్నాడు. కాని నాన్న సమాధానం చెప్పకుండా పువ్వుల్నే అడిగి తెలుసు కోమన్నాడు.

సరేనని బాబు వాళ్ళతోటలోకి పరుగెత్తి బంతిపువ్వు దగ్గిరకెళ్ళి నిలబడి...

'బంతిపువ్వా, నా కో సందేహం కల్గింది తీరుస్తావా?' అని అడిగాడు. ముత్తైదువ అందంతోటి బంతిపువ్వు బాబుని ఆశీర్వదించినట్లుగా పైకీ కిందకీ కదిలి...'ఏం బాబూ, ఇలావచ్చావు? నన్ను కోసి సంక్రాంతికి గుమ్మాలకి తోరణాలు కట్టేందుకు వచ్చావా?' అని అడిగింది.

'కాదు కాదు. పువ్వులన్నిటికీ రాణీ ఎవరో తెలుసుకుందామని వుంది.'

'ఈ గడ్డమీద పుట్టిపెరిగిన వారంటే ఎవరికైనా ఈ సడింపేగా! పాతరోత, కొత్తవింత అన్న సామెతగా మేము రాణులమెలా ఔతాము? బాబూ.'

బాబు కేమీ బోధపడలేదు. నీలి గోరింట నడిగాడు. నిత్యమల్లి, మల్లి, మాలతి, చామంతి, మందారం... ఒకటేమిటి, అక్కడున్న పువ్వులనన్నిటినీ అడిగాడు, ప్రతిపువ్వు సరియైన సమాధానమీయకుండా బాబుని పంపించేసింది. బూగన్ విల్లియా ఆవరణ చుట్టూతా విరియబూసింది. ఆఖరికి ఆకులుకూడా పూలకింద మారిపోయాయా అనిపించేటంతగా వెర్రిగా పూసింది. కన్ను చెదిరి పోతూంది. బాబు అక్కడికి వెళ్ళి—

'బూగన్‌విల్లియా'...అని చెయిచాపి పూలగుత్తిని ఆప్యాయంగా తాకబోయాడు. చెయ్యి పెట్టీ పెట్టడంతోనే

'అమ్మా' ...... అని బాధతో చేతిని వెనక్కి లాగి, 'ముళ్లుంటే దాచుకుంటావేం ? ఔనుకాని బూగన్ విల్లియా, పూలకిరాణెవరో చెప్పవూ?'

'పూలకి రాణెవరా ? ఏమి టా పెంకి ప్రశ్న ? ఎవరో తెలియడం లేదూ? నా అందం ముందర మరో పువ్వు విరుచుకు నిలబడగలదా? నన్ను చూచాకనే మీరంతా తతిమ్మా పుష్పాలని చూడాలి. తతిమ్మా పువ్వుల్లో అందాన్ని వెతుక్కు చూడాలి. నాకలువంటిది లేదు సుమా ! నా అందాన్ని నేను దాచను. నేనుకాక మఱెవరనుకున్నావు పూలకి రాణి?'

'కాని నువ్వు సున్నితంగా మృదువుగా వుండవు. కాగితం పూవులాగుంటావేఁ? నువ్వు సువాసనలీనవేఁ? పైగా నీ వైపు తేనెటీగలుకాని, సీతాకోక చిలకలుకాని ముఖమెత్తి చూడవు. నువ్వెలా గవుతావు పూలకిరాణివి?'... అంటూ బాబు తతిమ్మా పూలదగ్గరకి వెళ్ళాడు. దారిలో దానిమ్మ పూవు బాబుని పలకరించింది. సిందూరపు రంగులో మెరిసిపోతూంది. ఎంతనమ్రత, ఎంత సుకుమారం. కాని, మనిషిని చూస్తే బిక్కుబిక్కుమంటూ చూస్తుంది దానిమ్మ పూవు.

'ఎందుకలాభయపడతావు, దానిమ్మ పూవూ! నిన్ను నేను కోయడం లేదుగా. నాకో సందేహం వుంది. అడుగుతా సమాధానం చెబుతావా?'

'సందేహమా ? కొంపతీసి నన్ను [illegible]రించా ? నన్ను గురించిమాత్రం అడిగి నాచేత కన్నీరు కార్చనియ్యకు బాబూ !'

'అదేమిటి ? నిన్ను గురించికాదు నా సందేహం. ఔనుకాని, నీ గురించి కథవుందా? అదేదో చెప్పవూ...కథలంటే నాకెంతో ఇష్టం. రాజకుమారుడు, రాజకుమార్తె కథలు మా నాన్న ఎన్నో చెప్తారు నాకు .. చెప్పవూ...?'

'నువ్వింకా చిన్నవాడివి, బాబూ. నాకథ, నా హృదయవేదనా నీకెలా చెప్పేది ? ఆర్చగలవా, తీర్చగలవా ?'

'పోనీ వినడానికేఁ?'

'మీ దేశాన్ని మొగలాయి చక్రవర్తులు పరిపాలించారు తెలుసా? ఆ చక్రవర్తుల జీవితాలకీ, నా జీవితానికీ ప్రేమ సూత్రంతో బంధమేర్పడింది. జహంగీరు తెలుసా ?'

'ఆ మామిడిపండంటే నాకెంతో ఇష్టం.'

దానిమ్మ పువ్వు బాబు ముగ్ధత్వానికి చిరునవ్వు నవ్వి, 'ఔనులే, ఈనాడు ఒక రకం మామిడిపండుని మీరంతా జహంగీరు మామిడిపండంటారు. జహంగీరు ఈ దేశాన్ని పరిపాలించిన మొగల్ చక్రవర్తి. అతనేమో ఒక బానిసపిల్లని ప్రేమించాడు. ఊరికే ప్రేమించలేదు. ఆమెకోసం సర్వం త్యాగం చేయడానికి సిద్ధపడ్డాడు, కాని రాకుమారుడెక్కడ? బానిస పిల్ల ఎక్కడ? ప్రేమకి ఎక్కువ తక్కువ లుండవని తెలియని అక్బరు పాదుషా జహంగీరు బానిసపిల్ల మధ్య కత్తి ఝుళిపిస్తూ నిలబడ్డాడు.'

'అక్బరు చక్రవర్తి చాలా మంచి వాడంటారే?'

'స్వతహాగా మంచివాడే. కాని, వంశమర్యాదా, గౌరవం, చక్రవర్తిత్వం వీటికి అక్బరంతవాడు కూడా తలవంచ వలసిందేగా! అసలు సంగతి చెప్పడం మరచా. ఆ బానిస పిల్ల పేరు అనార్ కలీ. పారశీక భాషలో అనార్ అంటే నేనన్న మాట.'

'అంటే నీ పేరు దానిమ్మ పువ్వు కాదా?'

'నా పేరు దానిమ్మ పువ్వే. మరో భాషలో నన్ను అనార్ అని పిలుస్తా రంతే. జహాంగీరు రాకుమారునికి నేనంటే ఎంతో ఇష్టం. నన్నూ, బానిస పిల్లనీ సమానంగా ప్రేమించేవాడు. ఒక్కొక్కప్పుడు అతను అనార్ అని పిలిస్తే ఇద్దరం ఓయ్ అని పలికేవాళ్లం. ఇద్దరినీ దగ్గిరకి తీసుకు మా చుబు కాలని సున్నితంగా స్పృశించేవాడు. చక్రవర్తికి బానిసపిల్ల మీద కోపం వచ్చింది. బ్రతికి ఉండగానే ఆమెను గోరీలో పెట్టి మూయించాడు.'

'అబ్బ, ఎంత కఠిన హృదయుడు!'

'ఆ అనార్ ప్రాణం నాలో కల్సి పోయింది బాబూ.'

'ఈ నీ రేకులు ఆ బానిస పిల్ల పెదా లలా వున్నాయి. అరే ఎందుకలా దుఃఖిస్తావు. ఏడవకు అనార్.'

'ఏడవట్లేదు, నా రూపంలో నా ఆకారంలో దుఃఖం మూర్తీభవించింది. బాబూ..సరేగాని నీకేదో సందేహం వుందన్నావు?'

'మరేంలేదు. పూలకి రాణీ ఎవరు?'

'నేనుమాత్రం కాను. నేను బానిస పిల్లనేగా! నేను రాణి నెలా ఔతా? పైగా దూరపు కొండలు నునుపన్న సామెత విన్నావుగా!'

'ఆ విన్నా.'

'ఈ గడ్డమీద ఇన్ని రకాల పువ్వు లున్నా మీ వాళ్ళంతా రోజా అంటే ఎందుకో ఇదయిపోతారు. రోజాకున్న సువాసన, సుకుమారం, మరే పువ్వుకీ లేదట...బాబూ'

'ఏం అనార్?'

'రోజా మీదేశందికాదు తెలుసా?'

'కాకపోడమేమిటి? మా తోటలో అన్ని రకాల రోజాలుంటే!'

'ఈదేశం పువ్వు కాదయ్యా, పరా యివాడంటే మీ దేశస్థులకి అమితమైన భయం, గౌరవమూను. ఇది అనాది ప్రసిద్ధంతే. తన వాని మీద తనకి గౌరవం లేని దేశం మీది. అలాగే అటువంటి నైజంతోనే రోజానికూడా తలమీద కెక్కించుకున్నారు. ఆవిణ్నే పూలరాణి అన్నారు.'

'ఐతే ఈ దేశానికి రోజాను ఎవరు తెచ్చారు?'

'మొగలాయీలు మీ దేశాన్ని జయించినప్పుడు, వారితో ఈ రోజాను కూడా తెచ్చికొన్నారు. ఆవిడగారు పూలరాణై కూర్చుంది.'

'అనార్, సందేహం తీర్చినందుకు నీ కెంతేనా కృతజ్ఞుణ్ణి. మరి నేను వెడ తాను.'

'బాబూ, మాట.'

'ఎందుకు ?'

'రోజా గురించి తెలుసుకోవాలని లేదూ ?'

'ఏం, రోజాగురించి కూడా కథ వుందా ? అయ్యబాబోయి, పూల గురించి ఇన్ని కథలే.'

'జీవితానికీ పూలకీసంబంధంవున్నంత కాలం కథలకేంలోటు ... ఔనుకాని, రాత్రి పన్నెండు గంటలకి ఇక్కడికి రారాదూ?'

'ఎందుకు ?'

'ఇప్పుడు చెప్పను. వస్తావుకదా ?'

'వస్తాలే.'

'తప్పకుండా రావాలి సుమా !'

బాబు ఇంటికి వెళ్ళాడు, అనార్‌ని తల్చుకుంటూ. బువ్వతిని ఆవలింత లొచ్చినా పక్కలో దొర్లుతూ మెలకువగానే పడుకున్నాడు. గడియారం కేసి పెద్ద కళ్ళు చేసుకుని టైము ఘడీ ఘడీకి చూస్తున్నాడు. పదకొండున్నరైంది. నెమ్మదిగా చప్పుడు చేయకుండా లేచి, తలుపు తెరుచుకు తోటలోకి పరుగెత్తాడు. మొదట చీకటిగా ఉండడం చేత కొంచెం భయపడ్డాడు. కాని జరగబోయే వింత చూడాలనే ఆతురతతో చీకటీ, భయం మర్చిపోయి తోట మధ్య నిలబడి వుండగా దూరాన ఉన్న పైలుగంట పన్నెండు కొట్టింది. పన్నెండు ఐందో లేదో ఒక పెద్ద కాంతి ఆకాశంమీంచి కిందకు వచ్చి నట్లనిపించింది. బాబు ఒక్కసారి కళ్ళు మూసుకు తెరచి చూడ్డంతోనే నవ్వుతూ అందం చిందే స్త్రీ కనిపించింది.

'బాబూ, పారిపోతావేం?'

'నాకు భయమేస్తూంది.'

'నన్ను చూస్తేనే?'

'కాదు. అమ్మ నాకోసం నలుమూలలా వెతికి ఏడుస్తుంది.'

'అమ్మ లేవదులే !'

'నీకెలా తెలుసు ?'

'నాకు ఎలాగో తెలుసు. అమ్మ లేవదంతే!'

'నువ్వెవరవు ?'

'నేనా?' అని ఆ స్త్రీ నవ్వగానే తోటంతా వెన్నెలతో నిండిపోయింది.

'నువ్వెవరవు ?'

'నేనా? నేను వనదేవతను. నేనంటే భయం పోయిందా ?'

'ఎంత బావుందో ఈ తోట! నువ్వు రాకపూర్వం ఇలా లేదే?'

వనదేవత చిరునవ్వు నవ్వింది,

'బాబూ,నీకాడుకోవాలని వుందా?'

'నీ తోటా ?'

'కాదు, నీ అంత వయస్సు బాల

'ఇప్పుడుకాదు, రేపాడుకుంటా... నేను వెళ్ళిపోతాను దేవతా.'

'ఎందుకొచ్చావు మరి ?'

'అనార్ రమ్మంది వింతచూడడానికి.'

'ఐతే మరి చూసిపో !'

'ఏముందని చూడాలి ?'

అనగానే వనదేవత, చేతిలోని మంత్రదండం గిరగిరా తిప్పి బాబు కేసి చూసి...'బాబూ, ఈమాటు చూడు.

తోటతోటంతా ప్రాణులతో కలకలలాడింది. ప్రతిచెట్టూ వర్ణనాతీతమైన సుందరాకారంతో పరుగెడుతూ వచ్చిన దేవతకు వంగి జోహారు లర్పించుకుంది. ఎంత అందమైనవారు, ఎటువంటి రంగురంగుల దుస్తులు ధరించుకున్నారు వారు. పూలసౌకుమార్యం వదనాల్లో గోచరించింది. కొంతసేపటికి వనదేవత కాంతిలో లీనమై పిల్లతెమ్మెర ఆకృతితో బాబుకి కనిపించకండా అతని చుబుకాన్ని స్పృశించి మాయ మయింది.

వన దేవత మాయమైందో లేదో మానుషాకారం పొందిన పూలన్నీ బారులుతీర్చి, నిలబడి యీలపాటలు పాడాయి. తోటంతా సందడే. తోటంతా పుష్పాడి కాలాపే. ఎక్కడ చూచినా, తోరణాలు. ఒకచోట నృత్యం. ఒకచోట కిలకిల నవ్వులు. ఆ సందడి అలా సాగుతూన్న సమయంలో రోజా–పూలరాణి – ధగధగ మెరిసే కిరీటం పెట్టుకు, ముసిముసినవ్వులు నవ్వుతూ వచ్చి పూలసింహాసనంమీదకూర్చుంది. ప్రతి పువ్వు ఆమె సౌందర్యాన్ని పొగిడింది. తర్వాత రోజా రాణి నలుమూలలా చిరునవ్వుతో పరికించి చూచిఅంది.

'మాంత్రికుడు వసంతుడు తిరిగి మనహృదయాలకు కోర్కెలతో చక్కిలిగింతలు పెట్టాడు. ఆపుకోలేని ఆనందంతో, ఆవేశంతో, ఆర్ద్రతతో నేడిక్కడ కలుసుకున్నాము. ఒక సంవత్సరమైందనుకుంటాం, మన మీ విధంగా కలుసుకుని!

'చిత్రం' అన్నాయి పూల గొంతులు.

'ఈ సంవత్సరం లోపుగా చాలా విషయాలు జరిగాయి. చర్యలు తీసుకోకపోతే మనం బ్రతికే మార్గం కనిపించదు.'

'ఏమిటి మహారాణీ?' అని గోరింట పువ్వు అడిగింది.

'మరేం లేదు. తేనెటీగలు, కందిరీగలు, సీతాకోక చిలుకలు ఎడతెరిపి లేకుండా మనని పీల్చిపిప్పిచేసి పారేస్తున్నాయి. అందుకే మన బ్రతుకులు అంత త్వరగా మినుకుమినుకుమని కునికిపోతున్నాయి. మాంత్రికుడు వసంతునితో ఈ విషయం చెప్పి వాటిని యీ సభకు రప్పించేలా చేయమన్నాను. వాటితో మనం అమీ తుమీ తేల్చుకోవాలి.'

సీతాకోక చిలుక, కట్టుకున్న చీర సర్దుకుంటూ ముందుకువచ్చి నిలబడి రోజా రాణికి వంగి నమస్కరించింది. 'మహారాణీ, ఏమి ఆజ్ఞ?' అని అడిగింది.

'మరేం లేదు. ఎందుకు మా జీవామృతాన్ని పీల్చి మమ్మల్ని అతి శీఘ్రకాలంలో రాల్చి పారేస్తున్నావు?'

'మహారాణీ, నాకావలసినంత తేనెనే గ్రోలుతున్నాగాని, ఎక్కువేం తీసుకుపోవడం లేదని మనవి చేసుకొంటున్నా. అంతేకాదు. మీ ఉదారత్వానికి నేనెంతేనా కృతజ్ఞురాలిని.'

'మంచిది, మంచిది. నువ్వు చెప్పిన సంజాయిషీ సమంజసంగానే ఉంది. ఎవరక్కడ!

మందారం గున్న ఏనుగు పిల్లలా ఎర్రటి చీరకట్టుకు గునగున ముందుకు వచ్చి, 'ఏమి సెలవు' అని అడిగింది.

'కందిరీగను తీసుకొచ్చి ఎదుట నిలబెట్టు!'

ఎర్ర గన్నేరూ, పచ్చ గన్నేరూ కందిరీగను లాక్కొచ్చి రోజారాణి ఎదుట నిలబెట్టాయి. కందిరీగ ముఖం వాల్చుకొని చేతులుకట్టుకు నిలబడింది.

'ఏం కందిరీగా ?'

'ఏమి సెలవు మహారాణీ ?'

'ఈ పూలని బ్రతకనియ్యవా ?'

'నేనేం చేశాను మహారాణీ ?'

ఇంకా మొరాయిస్తూ ఎదురు ప్రశ్న వేస్తున్నావే? పూలకి జీవామృతమైన తేనెనంతా ఆబగా అలా తాగేస్తే పూల బ్రతుకేం కాను?'

'రాణీ, కోపం రాకపోతే నా మొరాలకించి నాకు న్యాయంచేయండి. తేనెటీగలా నేనూ పూతేనె సేకరిస్తున్నా. సరిగ్గా తేనె టీగ బ్రతుకే బ్రతుకుదామని నా ఆశ కాని నా దురదృష్టమో ఏమో, ఈ ప్రపంచము పుట్టినప్పటినుంచీ ప్రయత్నిస్తున్నా కాని తేనెటీగలా మాత్రం బ్రతక నేర్వలేక పోయా. ఐనా, ఎప్పటికైనా సాధించి తీరుతాననే ఆశమాత్రం వదలలేదు.

రోజారాణి పక్కున నవ్వింది. తోటంతా గుప్పున పన్నీరువాసనేసింది. బాబు ఆశ్చర్యపోయాడు.

'ఐతే కందిరీగా, తేనెటీగలా తేనె పట్టు అమర్చే ప్రయత్నం ఇలా జీవితాంతంసాగిస్తూనేవుంటావన్న మాట?'

'చిత్తం మహారాణీ'

'కాని నాకు తెలుస్తూన్న దేమంటే, నువ్వెత్త తాగుబోతువి. పూతేనె అలా తాగుతూనే వుంటావు. నువ్వీ జన్మలో తేనెటీగలా తేనెపట్టు అమర్చలేవు. పూల ప్రాణాల్ని మాత్రం హరిస్తున్నావు! ఎవరక్కడ ? కందిరీగని అవతలకి తీసుకుపోండి! తేనెటీగ నిలా తీసుకురండి!'

తేనెటీగ ముందుకు నడుస్తూంటే చుట్టూ వీచేగాలి పూల నెత్తావితో కైపెక్కినట్లు అటూ ఇటూ మత్తుగా వీచింది. తేనెటీగను చూచి పూలన్నీ ముగ్ధప్రణయ పులకరింతలతో అర్ధనిమీలిత నయనాలతో ఒక్కసారి సన్నగా తీయగా నిట్టూర్చాయి. రోజారాణి చెక్కిళ్ళు మరింత కందాయి.

'ఏం భ్రమరా ?'

'ఏమిటాజ్ఞ, మహారాణీ!'

'పువ్వుల్ని బ్రతకనియ్యవా ?

'నేనేం చేశాను మహారాణీ? నా పాట తీయని తేటలని పూలన్నీ చేతులు మొలిపించుకు నన్ను దగ్గిరకి చేరతీసికొంటాయి. ఒకరిదగ్గిరకెళ్ళి మరొకరి దగ్గిరకెళ్ళకపోతే ఎంతకోపం! అంతే కాదు. ఒక పూవునుండి మరొకపూవు దగ్గిరకి వెళ్ళడం కాస్త ఆలస్యమైతే చాలు. మొఖాలు వేళ్లాడేసుకుని ముడుచుకుని అలుక నభినయిస్తాయి.'

'ఏమర్రా పూలూ, ఆ భ్రమరాన్ని బ్రతకనివ్వరా ? - అని అడిగే బదులు నన్ను ప్రశ్నిస్తున్నారెందుకు, మహారాణీ ?'

'సరేలే. ఇదంతా పాతపాటేగాని, మా ప్రశ్నకు సమాధానం చెప్పు!'

'మహారాణీ, మేము పూదేనె సేకరించి పట్టుకుపోతామన్న మాట వాస్తవమే. కాని, మా కోసం కాదన్న సంగతి మరవవద్దని మనవి! మేము ఏది చేసినా మా యజమాని కోసమే!'

'ఎవరు మీ యజమాని?'

'ఎవరని అడుగుతున్నారా? ఇంకెవరు, సృష్టికి ప్రతిసృష్టి చేద్దామని ప్రయత్నిస్తూన్న మానవుడు!'

'మానవుడు?'

'ఔను, మహారాణీ! అతనికోసమే తేనెపట్టుల నమర్చి, వాటిని మకరందంతో నింపి అతనికి కానుకగా సమర్పించుకుంటున్నాము! మహారాణీ, మరొక మాట సెలవిస్తా. అటు మానవ సేవా, చేస్తున్నాము, ఇటు మీ సేవా చేస్తున్నాము. ఇందులో ఈ అల్ప ప్రాణుల కేటువంటి స్వార్థం లేదన్న సంగతి గ్రహించ ప్రార్థన.'

'మాకేం సేవ చేస్తున్నావూ? ప్రాణాలు తీస్తున్నావు!'

'మళ్ళీ ఆ మాట అనవద్దని నా ప్రార్థన. వేసవి ముందు ఉండకే పూలన్నీ మంగలంలో వేయించినట్టు వేగి నేల కూలుతాయి. కాని పూలజన్మ వాసనలను వర్తమానంలో మోసుకు తిరిగేది ఈ అల్ప కీటకమే. ఆ విధంగా పూలకి చావు లేదని మేమేగా ఋజువు చేస్తున్నది మహారాణీ! నేను చెప్పవలసింది విన్నవించుకున్నాను. తర్వాత మీ చిత్తం – శిక్షవిధించినా శిరచ్ఛేదం చేసినా. ఏదో ఒకటి త్వరగా కానియ్యండి. కాలయాపన చేయ లేదీప్రాణి. పనికీ ఈ ప్రాణానికీ లంకె. అందు చేత తీర్పు త్వరగా ఇప్పించండి.'

రోజారాణి, మల్లినీ, మాలతినీ, నిత్యమల్లినీ, నందివర్ధనాన్ని పక్కకి రమ్మని పిలవగానే, అవి వినయంగా వచ్చి నిలబడ్డాయి. రోజా రాణి వాటితో సంప్రతించి తీర్పు చెప్పింది.

'భ్రమరా, నీ సంజాయిషీ విన్న తర్వాత నీమీద మాకున్న కోపం పోయింది నువ్వు మాకు చాలా కావలసిన వాడివి. ఓ పువ్వుల్లారా, మీరెవ్వరూ, భ్రమరం వచ్చినప్పుడు రేకులు మూసుకు దాగుడు మూచీలాడి కాలయాపన చేయక ఎటకే భ్రమరాన్ని, కోరినంత మకరందాన్ని పీల్చుకోనివ్వండి. నీవు చేస్తూన్న స్నేహాభినందన చిహ్నంగా వచ్చి నన్నొకసారి ముద్దుపెట్టుకో నిస్తున్నా!'

తేనెటీగ ముద్దుపెట్టుకుందో లేదో మంత్రించి నట్టు తోటంతా యథాప్రకార ఆకారంలోకి మారిపోయింది. కీచురాయి శబ్దం, కప్పల బెకబెకలతో తోట భయకంపితమైంది. బాబు నలుమూలలా చూశాడు ఎవ్వరూ లేరు. చెట్లు మాత్రం చీకట్లో ప్రేలాడే నీడల్లా తోచాయి. వచ్చిన బాటనే తిరిగి బాబు ఇంటికి వెళ్ళి చప్పుడు చెయ్యకుండా నిద్రపోయాడు. తోటలో చూచిన రోజారాణీని తల్చుకుంటూ.

విద్య - ప్రజాస్వామ్యం

ఆచార్య, శ్రీ శ్రీమన్నారాయణ్

(అఖిలభారత కాంగ్రెసు కార్యదర్శి)

"ప్రజాస్వామ్యం సక్రమంగా పని చేయాలంటే నిర్బంధ ఉచిత విద్య అవశ్యం వాంఛనీయ"మని ఇటీవల కాంగ్రెసు పార్లమెంటరీ పార్టీ సమావేశంలో ప్రధాని శ్రీ నెహ్రూ చెప్పారు. ప్రపంచంలో చాలా దేశాలలో ఒకానొక కనిష్ఠ పరిమితి వరకూ ఉచిత విద్య అమలులో వుంది. 'పదునాలుగేళ్ల వయస్సు వచ్చేవరకూ పిల్లలందరికీ ఉచితంగా నిర్బంధంగా విద్య నేర్పే ఏర్పాట్లు చేయటానికి ప్రభుత్వం పది సంవత్సరాలలోగా అవకాశాలు కల్పించేందుకు కృషి చేయాల'ని భారత రాజ్యాంగంలో 48 వ సూత్రం చెబుతున్నది. ఇంకా ఈ లక్ష్యం సిద్ధించలేదంటే, అది బాధాకరమైన విషయం. పోనీ, లక్ష్యసాధనకు ఒక స్పష్టమైన ప్రణాళిక వున్నదా అంటే, అదీ లేదు. 'కనీసం 6 నుండి 11 సంవత్సరాలలోపు పిల్లలకు సార్వజనీనంగా ఉచిత నిర్బంధ విద్య నేర్పేందుకు, మూడవ పంచ వర్ష ప్రణాళిక అంతమయ్యే లోపుగానైనా, అవకాశం కల్పించటం అనేది ఆ ప్రణాళికలోని ప్రధానాంశంగా గమనించాలి' అని అఖిల భారత ప్రాథమిక విద్యాసంఘం సిఫారసు చేసింది. ప్రాథమిక విద్యా విషయంలో ఉన్న స్థితి గతులన్నీ ఈ మధ్యనే సమీక్షించిన యోజనా సంఘం (Planning Commission) కూడా రాజ్యాంగము 45 సూత్రంలో 6 నుండి 14 సంవత్సరాల వరకు ఉన్న వయః పరిమితిని 6 నుండి 11 కు తగ్గించాలని అప్పుడే సిఫార్సు చేసింది. ఈ తగ్గించిన పరిమితికైనా లక్ష్యం సిద్ధించాలంటే, రెండవ పంచ వర్ష ప్రణాళిక ఆఖరుకు కాగల వ్యయానికి అదనంగా మూడవ ప్రణాళికా కాలంలో రు. 320 కోట్లు కావాలని సూచింపబడింది.

అభివృద్ధి చెందిన తక్కిన దేశాలతో పోల్చినప్పుడు, సార్వజనీనమైన ఉచిత నిర్బంధ ప్రాథమిక విద్యను ప్రవేశపెట్టటానికి కావలసిన సదుపాయాలు సమకూర్చుకోనటంలో భారత దేశానికి కొంత చిక్కు ఉన్నమాట నిజమే. కాని, అంచనాల సంఘం తన నాల్గవ నివేదికలో చెప్పినట్లు, దేశమంతటా ఒక నియమిత కాలంలో అమలు జరపటానికి, సక్రమ కార్య విధానంతో కూడిన ఒక దార్శనిక ప్రణాళికను మన విద్యాశాఖ ఎందుకు రూపొందించ లేకుండా వుందో అర్థం చేసుకోటం కష్టం. మనకున్న ఆర్థిక సదుపాయాలనూ, వర్తమాన పరిస్థితులనూ గమనించి, ఆ సమస్యపై ఈవరకే ఆలోచించి వివిధ సంఘాలు చేసిన సిఫార్సులను దృష్టిలో పెట్టుకొని, అలాంటి ప్రణాళికను రూపొందించ వలసివుంది. 'ప్రాథమిక విద్య కోసం, విద్యపన్ను ప్రవేశపెట్టటమే కాక, ఇంకా ఎక్కువ ధనం సమకూర్చటానికి అవసరమైన అన్ని మార్గాలూ అన్వేషించాల'ని అంచనాల సంఘం సూచించింది కూడా.

మా దృష్టిలో, జాతీయ యోజనా పథకంలో మనం విద్యకు ఎంత ప్రాధాన్యం ఇచ్చామనేది ముఖ్యం. కాని దానికి ఎంత ధనం కావాలనేది కాదు. ఆయా అంశాలకు కేటాయించిన మొత్తాలను పోల్చిచూస్తే మొదటి పంచవర్ష ప్రణాళికలో కంటె రెండవ దానిలో విద్యకోసం కేటాయించ బడిన శాతం చాలా తక్కువ. మొదటి ప్రణాళికలో నూటికి 7 వంతులు విద్యకు ప్రత్యేకిస్తే, రెండవ ప్రణాళికలో నూటికి 4 వంతులపై కొంచెం కేటాయించారు. ఇది మాకు బాధకలిగించింది. అంతే కాదు, ఆ మొత్తంలోకూడా ప్రాథమిక విద్య మీద ఖర్చుపెట్టే మొత్తం, వృద్ధి కావటానికి బదులు, దిగజారిపోయింది తొలి ప్రణాళికలో ప్రాథమిక విద్యకు రు. 93 కోట్లు ప్రత్యేకింపబడ్డాయి. రెండవ ప్రణాళికలో ఈ మొత్తం రు. 89 కోట్లు మాత్రమే. తొలి ప్రణాళికలో ప్రత్యేకింపబడిన దానికంటే, ఉన్నత విద్య కోసం పెట్టే ఖర్చు రెట్టింపు చేయబడి, విశ్వ

విద్యాలయాల మీద పట్టి విద్య మీద పెట్టే ఖర్చు నాల్గురెట్లు చేయబడినప్పుడు, ఇది మరీ విపరీతంగా వుంటుంది. ప్రత్యేకంగా భారత దేశం వంటి అభివృద్ధి చెందని దేశాలలో, ఏ ప్రజాస్వామిక యోజనా పథకం క్రిందనైనా విద్య విషయంలో, అందులోనూ ప్రాథమిక విద్య విషయంలో, న్యాయంగా చూపవలసిన శ్రద్ధను మనం చూపలేదనటానికి ఇదే ప్రత్యక్ష నిదర్శనం. 7 నుండి 14 సంవత్సరముల లోపు దేశంలోని పిల్లలందరికీ ప్రాథమిక - లేదా- ప్రాతిపదిక విద్యను అందజేయాలని మనం నిజంగా అనుకొన్నట్లయితే, ఆ వయః పరిమితిని తగ్గించటానికి మనం అనుమతించ మనేది వాస్తవం. మన దేశంలో శక్తివంతమైన ప్రజాస్వామ్య నిర్వహణాన్ని విస్తృతం చేయటానికి ఈ ప్రణాళికలోనూ తరువాతి ప్రణాళికలోనూ ప్రాథమిక విద్యకు అత్యధిక ప్రాముఖ్యం ఇవ్వటం అవశ్య కర్తవ్యం. టోకియో పుర పాలక సంఘం రోడ్లమీద, వీధి దీపాలమీద, పరిపాలనా వ్యవహారాల మీద చాలా తక్కువ ఖర్చు పెడుతుందనీ, సాంఘిక సేవకూ, అందులోనూ ముఖ్యంగా, విద్యకూ ఆరోగ్యానికీ అత్యధిక ధనం వినియోగిస్తుందనీ ఈ మధ్య మన ప్రధాని చెప్పారు. నిజంగా ఉండవలసిన తీరే ఇది! అందువల్ల, విద్యకోసం-ప్రత్యేకించి ప్రాథమిక, లేదా, ప్రాతిపదిక విద్యకోసం - ఇంకా చాలా ఎక్కువ మొత్తం వినియోగించాలని మేము నొక్కి వక్కాణిస్తున్నాము. వివిధ రంగములుగా విభక్తములైయున్న అభివృద్ధి కార్యక్రమాల మధ్య అధికతర సమన్వయం సాధించటం ద్వారా ఇందుకు అవసరమైన ధనం సంపాదించటానికి అదనపు సదుపాయాలు కనిపెట్టవచ్చు. ఉదాహరణకు, ఇప్పుడు ఖాదీ, గ్రామ పరిశ్రమల క్రింద వ్యయపరిచే డబ్బులో చాలా భాగం ప్రాతిపదిక పాఠశాలలలో వస్తూత్పాదక వృత్తులకు ఏర్పరచటానికి వినియోగించ వచ్చు. ప్రాథమిక సాంఘిక విద్యా పథకానికీ, కమ్యూనిటీ ప్రాజెక్టులకూ జాతీయ విస్తరణ ప్రాంతాలకూ మధ్య ఇంకా ఎంతో సమన్వయం సాధించ వచ్చు. పాఠశాలా భవనాల క్రింద ఖర్చు బాగా తగ్గించాలనీ, ఎండాకాలం బదులు వానాకాలం సెలవులిచ్చి, మనం చెట్ల నీడల్లో బదులు పెట్టటానికి తయారు కావాలనీ మన ప్రధాని పదే పదే చెప్పి వున్నారు. ఒకవేళ భవనమే కట్టవలసి వస్తే, అది స్థానికంగా దొరికే వస్తువులతో అతి నిరాడంబరంగా చౌకగా నిర్మించుకో వచ్చు. పాఠశాలా భవనాలను గూర్చిన పి. డబ్ల్యు. డి. వారి అంచనాలు అతిగా వున్నాయి. వాటిని పూర్తిగా మార్చవలసి వుంది. పెద్ద పెద్ద మొత్తాలు భవనాల క్రింద ఖర్చుపెట్టే బదులు, వాటిని యోగ్యులైన ఉపాధ్యాయులకు శిక్షణ క్రిందా, వేతనాల క్రిందా ఖర్చు పెట్టాలి. పంటల సమయంలో ధాన్య రూపంలో ఉపాధ్యాయులకు కొంత ముట్టజెప్పేట్టుగా మనం పంచాయతీ బోర్డులకు నచ్చజెప్పవచ్చు. ఇది మన పురాతన సంప్రదాయాలకు అనుగుణంగా కూడా వుంటుంది.

మనం పాతగాడి నుంచి బయటపడి, సార్వజనీనమైన ఉచిత నిర్బంధ ప్రాథమిక విద్యా వ్యాప్తిని సాధించడానికి క్రొత్తదారులు తొక్కేందుకు పూనుకున్నట్లయితే, ఈ సమస్యను పరిష్కరించగలం. కాంగ్రెసు అధ్యక్షుడు శ్రీ ఢేబర్, తమ గౌహాతీ ఉపన్యాసంలో చెప్పినట్లుగా, 'మామూలు ధోరణి'లో ఈ సమస్య పరిష్కరించ బడదు. పట్టభద్రులైన వారు తమ పట్టములను స్వీకరించేందుకు ముందు పరతుగా కొంతకాలం ప్రాథమిక విద్యారంగంలో వారి సేవను వినియోగించుకోవచ్చునని ఆయన సూచించారు. ఈ సూచన, కొత్తదికాకపోయినా, కొత్తగా ఆలోచించవసిందే.

ఈ సమస్యను జాతీయంగా అత్యావసరమైన భావంతో పరిశీలించి నప్పుడు, ప్రాథమిక విద్యా వ్యాప్తిని ప్రజోద్యమంగా పెంపొందించి నప్పుడు, ఐచ్ఛికంగా ఉచితంగా పని చేసేవారు తగినంత మంది ఈ ఉద్యమాన్ని జయప్రదం చెయ్యటానికి ఇందులో ప్రవేశిస్తారనటంలో సందేహం లేదు. ప్రజోద్యమాలూ, విప్లవాలూ ధనంతో మాత్రమే నిర్వహింప బడేవి కావు. ప్రజా సహకారాన్ని సంపా

దించటానికీ విశాల ప్రాతిపదిక మీద తాను తోడ్పడటానికీ ప్రభుత్వం పూనుకోవాలి. కనుక మన దేశీయ బాలబాలికల విద్యా సమస్య, దేశవ్యాప్తమైన సరైన ఉద్యమ నిర్మాణం మీద ఆధారపడి వుంది, కాని కేవలం ధనంమీద కాదు

ప్రాథమిక విద్యలో పిల్లలకు నేర్పవలసిన విషయాల్ని జాగ్రత్తగా ఏర్పరచుకోవలసి వున్నదని ఇక్కడ మనం గుర్తు పెట్టుకోవాలి. ఒక జాతిని మహత్తరం చేయగల నైతిక శక్తులను కల్పించటం ద్వారా మన బాలికల ఉత్తమ శీలానికి ప్రాథమిక విద్య గట్టి పునాదులు వెయ్యాలి. పఠన లేఖన గణితాలతో పాటు, పిల్లలకు, సంఘంలో వారికి గల హక్కులూ, సంఘం పట్ల వారి విధి బాధ్యతలూ బోధించాలి. సామాజిక నీతిని గూర్చిన సాధారణ సూత్రాలూ, సంఘంలో నడుచుకోవలసిన తీరు, ఆరోగ్య నియమాలు పిల్లలకు అవగతం కావాలి. వారిలో ప్రాథమిక జాతీయతా విశ్వాసం వికసించేందుకు గాను, వారికి భారత సాంస్కృతిక సంప్రదాయ చరిత్ర సంగ్రహంగా బోధించాలి. ప్రాథమిక పాఠశాలల్లోని విద్యార్థులు తమ చేతులతో తాము చక్కని ఉపయోగపడే వస్తువుల్ని తయారు చెయ్యటం ద్వారా, శ్రమించటంలో వుండే గౌరవాన్ని అవగాహన చేసుకోవాలి. ధనహీనమై, ముఖ్యంగా వ్యావసాయికమైన భారత దేశం లాంటి దేశం, పట్టణాల కెగబ్రాకి పరుల కష్టం మీద జీవించటాన్ని ప్రోత్సహించే రకం విద్యను తన పిల్లలకు నేర్పజాలదు. ఈ దృష్ట్యా ప్రాతిపదిక విద్య నిస్సందేహంగా ఉత్తమోత్తమమైనది, యోగ్యతమమైనది ప్రాతిపదిక పాఠశాలల్లో వస్తూత్పత్తి విషయంలో పట్టుదల వహించి, సరిగా నిర్వహించినట్లయితే మనం ఖర్చు పెట్టవలసిన డబ్బుకూడా కొంత తగ్గుతుంది. విద్యాశాఖ తాలూకు పద్దులను గూర్చిన చర్చ సందర్భంలో, దేశీయాభ్యుదయ ప్రణాళికలలో విద్యకు ప్రధాన స్థానం ఇవ్వాలని లోక్ సభా సభ్యులు వక్కాణించటం ముదావహం. అఖిల భారత ప్రాథమిక విద్యా సంఘం మొదటి సమావేశానికి ఒక సందేశం ఇస్తూ మన ప్రధాని సూచించినట్లు, ప్రాథమిక విద్య పరివ్యాప్తం కానప్పుడు, మనం— పారిశ్రామిక, ఆర్థిక, సాంఘిక, సాంస్కృతిక కాని— ఏ రంగంలో గానీ పురోగమించలేము. కనుక, భారత దేశాన్ని నిజంగా విస్తృత ప్రాతిపదిక మీద అభ్యుదయ ప్రజాస్వామిక దేశంగా రూపొందించడం కోసం, మన విద్యాశాఖ, ప్రాతిపదిక-లేదా-ప్రాథమిక విద్యాబోధనకు ఒక ఖచితమైన కార్యక్రమాన్ని సిద్ధపరచటంలో ఇంక జాగు చెయ్యదని మేము హృదయపూర్వకంగా ఆశిస్తున్నాము.

['ఎకనామిక్ రివ్యూ'నుంచి]

★

సోషలిజం

"సోషలిజం అనేది కొత్తగా కనిపెట్టిందేమీ కాదు. భగవద్గీతలోనే వుంది. మనకు కేవలం కావలసిన దానికంటె అధికంగా సొంతం చేసుకోకపోవటమూ, జీవితావసరవస్తువులను భగవంతుని బిడ్డలమందరమూ సమంగా అనుభవించటమూ అని దీని అర్థం. ఆ ఆశయసాధనకు పెద్దపెద్ద సంఘాలతో పనిలేదు. ఏ వ్యక్తి అయినా సరే, తనంతట తానే మొదలు పెట్టి, సోషలిజాన్ని ఆచరించవచ్చు. తనకు అవశ్యం అవసరమైన దానికంటె ఏ మాత్రం ఎక్కువ దాచుకోకపోవటం ఇందులో మొట్టమొదటిది. వ్యక్తిగతంగా బ్యాంకులలో డబ్బుదాచుకోవటం అనేది ఈ ఆశయానికి విరుద్ధమైంది......వాస్తవదృష్టితో, తన సంపదకూ శక్తికీ తాను ధర్మకర్త కావటమే సోషలిజం. కాని ఈనాడు సోషలిజమంటే ఇతరుల ఆస్తులను బలాత్కారంగా ఆక్రమించటమనే అర్థం ఏర్పడింది. ఇది సోషలిజానికి వికృతమైన రూపం .....మన మధ్యా, మన చుట్టూ, ఆకలీ, నిరుద్యోగం, గొప్పా, కొద్దీ, అంతరం వున్నంతవరకూ మనకు సోషలిజాన్ని గూర్చి మాట్లాడే హక్కులేదు.

—మహాత్మ గాంధి



మా యా దే వి క ల

చిత్రశిల్పి : శ్రీ అ. పైడిరాజు

*

బుద్ధ జయంతికి కలకత్తా ఆర్ట్సు సొసైటీవారు ఏర్పాటు చేసిన కళా ప్రదర్శనంలో బహుమతి పొందిన చిత్రం.

ఆంధ్రప్రదేశ ప్రభుత్వ సాంకేతిక విద్యాశాఖ డిప్యూటీ డైరెక్టర్ శ్రీ టి. ఆర్. దాస్ సేకరించిన చిత్రసంపుటి లోనిది.

మాయమబ్బులు
(నాటిక)

★

శ్రీ రెంటాల గోపాలకృష్ణ

★

పాత్రలు :

డాక్టర్ రఘునాథ్	...	సుభద్ర (డాక్టరు భార్య)
రామన్న (నౌకరు)	...	రావ్ (ఒక రోగి)

కాలం వర్తమానం : ప్రదేశం : డాక్టరు బంగళా

[తెర తీసేసరికి డాక్టర్ రఘునాథ్ బంగళా కనుపిస్తుంది. బంగళాలో ముందు హాలు. హాలు విశాలంగా ఉంటుంది. విలువైన కుర్చీలు, సోఫాలు, ఒక అందమైన టేబిల్, టేబిలుమీద వివిధరకాల విచిత్రవస్తువులు – గోడకు గాంధీ, బుద్ధుడు, టాగోర్, అజంతా, ఎల్లోరా చిత్రాలు, విదేశనగర దృశ్యాలు కల మరికొన్ని తైల వర్ణ చిత్రాలు. హాలులో నుంచి లోనికివెళ్ళే ద్వారం ఎదురుగా ఒకగది. హాలులో ఒక మూల పుస్తకాల ర్యాక్, దానికి చేరువగా ఒక చిన్న టేబిల్, టేబిల్ లైట్, టెలిఫోన్ వుంటాయి. మరొకమూల పియానో, లేక మరేదైనా Musical instrument, ఒక కిటికీ – కిటికీలో నుంచి చూస్తే తోట కనుపిస్తుంది.

వేసవిలో ఒక ఆదివారం సాయంత్రం అది. డాక్టర్ అప్పుడే గదిలోనుంచి ఇవతలకవచ్చాడు. వయస్సు సుమారు 35 ఒడ్డూ పొడుగూ గల మనిషి హుషారుగా, హుందాగా ఉంటాడు. అప్పుడప్పుడు చమత్కారంగా మాట్లాడతాడు. పరాచకాలాడి నవ్వించగలడు. ఒక్కొక్కమాటు Funny గా కనుపిస్తాడు, కొన్ని వేళల్లో మెడికల్ సైన్సును గురించి, సైకాలజీని గురించి ఆవేదనగా ఆలోచిస్తూఉండిపోతాడు. సజ్జలో సైకాలజీ స్టడీలో Expert. మనిషి మధ్య మధ్య Emotions లోకి వెళ్ళిపోతుంటాడు కూడా

డాక్టరు గదిలో నుంచి వచ్చి కుర్చీలో కూచున్నాడు. పైప్ తీసి వెలిగించాడు. ఈవినింగ్ పేపర్ చదవటం మొదలు పెట్టాడు. ఒక్కక్షణం నిశ్శబ్దం]

డాక్టర్ : సుభద్రా, సుభద్రా!

సుభద్ర : (లోపల్నుంచి) ఆఁ వస్తున్నానండీ

డాక్టర్: ఎంతకూ తెమిలిరావేం ?

[డాక్టర్ భార్య సుభద్ర వస్తుంది. మనిషి అందగత్తె బాగా చదువు సంస్కారం కలది చాలా తెలివైనది. వయస్సు సుమారు 30.]

సుభద్ర : వచ్చానుకదండీ.

డాక్టరు : ఏదీ కాఫీ ?

సుభద్ర : ఇదిగో, కలుపుకొస్తున్నా.

డాక్టర్ : ఇంకా కలపడం దగ్గరే ఉందీ, ఆ వంటలక్క ఏం చేస్తున్నది సుభద్రా ?

సుభద్ర : కాఫీపని చేస్తున్నదండీ. ఇవాళ పాలు విరిగిపోయి మళ్ళీ పాలు తెప్పించేసరికి కాస్త ఆలస్యమయింది.

డాక్టర్ : ఇదిగో, సుభద్రా!

సుభద్ర: ఏమండీ?

డాక్టర్: ఆ వంటమనిషిని మార్చమని ఎన్నిమార్లు చెప్పాను. ఆమె చేయి తాకితే పాలే కాదు, నీళ్ళుకూడా విరుగుతాయి!

సుభద్ర: పోనిండి, దిక్కులేనిముండ.

డాక్టర్: దిక్కులేని వాళ్ళందరికీ మన బంగళా దిక్కన్నమాట.

సుభద్ర: కాఫీ తయారవుతోంది. ముందు పండ్లరసం పుచ్చుకోండి.

[నౌకరు రామన్న లోపల్నుంచి వస్తాడు.]

రామన్న: అమ్మగారూ! పండ్లరసం తీశాను.

సుభద్ర: వస్తున్నా రామన్నా (డాక్టర్‌తో) ఒక్కనిమిషం.

[సుభద్ర లోనికి వెడుతుంది. రామన్న బయటికి వెళతాడు. టెలిఫోన్ రింగ్ వస్తుంది. డాక్టర్ వెళ్ళి ఫోను ఎత్తుతాడు.]

డాక్టర్: (ఫోనులో) హలో, హాలో! yes, డాక్టర్ రఘునాధ్ స్పీకింగ్...ఎవరూ? యాక్టరా?... ఎవరయ్యా నీవు?... ఏ యాక్టరూ? నేను యాక్టర్‌ను కాదయ్యా డాక్టర్‌ను ...నాన్సెన్స్, ఇంకా 'సారీ' అంటావేమిటయ్యా, రాంగ్ నెంబర్ ఫోను చేసి? (విసురుగా ఫోన్ పెట్టేస్తాడు) డర్టీ, డర్టీ ఫెలోస్! (సుభద్ర పండ్లరసం తీసుకుని ప్రవేశిస్తుంది)

సుభద్ర: ఎవర్నండీ తిడుతున్నారు?

డాక్టర్: ఎవరో, సినిమా యాక్టర్ కావాలట! ఫోన్ చేశాడు.

సుభద్ర: (చిరునవ్వు నవ్వి) ఎవరండీ ఆ మహాశయుడు? డాక్టర్‌ను యాక్టర్ చేశాడే!

డాక్టర్: ఎవడో–రాంగ్ నెంబర్ ఫోన్ చేశాడు. పైగా 'సారీ' అంటాడు సెన్స్‌లెస్ ఫెలో!

సుభద్ర: –పండ్లరసం పుచ్చుకోండి.

రామన్న: (వస్తాడు) రామన్నా! అయ్యగారికి నీళ్ళుతోడు.

రామన్న: అలాగేనమ్మా! (లోనికి వెడతాడు.)

సుభద్ర: మీరు స్నానానికి లేవండి.

డాక్టర్: (పండ్లరసం త్రాగడం పూర్తిచేసి) ఈ పూట ఏమిటి మన ప్రోగ్రామ్?

సుభద్ర: ఏముందీ, ఎగ్జిబిషన్‌కు వెడదామనుకున్నాంగా.

డాక్టర్: నేనొకమాటు హాస్పిటల్‌కు వెళ్ళి రావద్దూ?

సుభద్ర: అబ్బబ్బ! మళ్ళీ వెడుతున్నారూ పేచీ! ఆదివారం సాయంత్రమైనా కాస్త హాస్పిటల్ కట్టేయకూడదటండీ?

డాక్టర్: హాస్పిటల్ కట్టేశాం సుభద్రా. కాని నర్సింగ్ హోమ్‌కు వెళ్ళిరావాలి. ఒక్కపూట డాక్టర్ కనుపించకపోతే పేషెంట్సుకు ప్రాణాలు పోతాయి!

సుభద్ర: (సోఫాలో కూచుని పండ్లరసం త్రాగడం పూర్తిచేస్తుంది.) ఏం పేషెంట్సో, మీకొకక్షణం రెస్ట్ ఉండదు.

డాక్టర్: డాక్టర్స్ ప్రొఫెషన్ అంతే సుభద్రా.

[రామన్న లోపల్నుంచి వస్తాడు]

రామన్న : అయ్యగారూ, నీళ్ళు తోడాను.

సుభద్ర : మీరు స్నానానికి లేవండి.

డాక్టర్ : (రామన్నతో) వస్తున్నా, రామన్నా.

[డాక్టర్ లేచి గదిలోనికి వెడతాడు. రామన్న లోనికి వెడతాడు. సుభద్ర కుడివైపుకు వెడుతుంది. రామన్న తిరిగి లోపల్నుంచి వస్తాడు. సుభద్ర కుడివైపునుంచి వస్తుంది.]

సుభద్ర : రామన్నా !

రామన్న : అమ్మా.

సుభద్ర : చెట్లకు నీళ్ళుపోశావా ?

రామన్న : పోశానమ్మా.

సుభద్ర : ఆ వట్టివేళ్ళ తడికెలకు మళ్ళీ నీళ్ళు చల్లు రామన్నా.

రామన్న . చల్లుతానమ్మా. ఈ ఎండదెబ్బకు ఎన్ని నీళ్ళూ ఆగడం లేదమ్మా.

సుభద్ర : రామన్నా !

రామన్న : అమ్మా.

సుభద్ర : మొన్న మనింటికి ఒక అమ్మాయి వచ్చింది, జ్ఞాపకం ఉందా, రామన్నా ?

రామన్న : ఆఁ, ఉంది అమ్మగారూ. అచ్చం ఆ సీతమ్మ తల్లిలా ఉంటుంది, దిగులుగా, దీనంగా.

సుభద్ర : (చిరునవ్వునవ్వి) నీకూ మీ అయ్యగారికీ లోకంలో మనుషులంతా దిగులుగా ఉన్నట్లు కనిపిస్తారేమిటోయ్ రామన్నా ?

రామన్న : దిగులుకాక ఏముంది అమ్మగారూ; కష్టాలకే కదమ్మా ఈ పాపిష్టి నరజన్మ !

సుభద్ర : సరేకానీ, ఇవాళ ఆ అమ్మాయివస్తే నేను లేకపోయినా ఇక్కడే ఉండమని చెప్పు.

రామన్న : చెప్పడమేమిటి, అమ్మగారూ, ఉండేటట్టు చేస్తాగా! (నాలు గడుగులు వేసి వెనక్కు తిరుగుతాడు) అమ్మగారూ! కాఫీలు తయారయినయ్.

సుభద్ర : ఇదిగో, వస్తున్నా రామన్నా. (సుభద్ర లోనికి వెడుతుంది. రామన్న వెలుపలికి వెడతాడు.)

[డాక్టర్ స్నానం ముగించి, ముస్తాబై, పైకట్టుకుంటూ గదిలోనుంచి వస్తాడు. ప్రక్కనకు మళ్ళి పరధ్యానంగా పైప్ ముట్టిస్తాడు. ఇంతలో రావ్ విసురుగా ప్రవేశిస్తాడు. రావ్ యువకుడు, సూటు వేసుకున్నాడు. గడ్డం మాసివుంది. ముఖంలో ఏదో అలుపు, ఆతురత, అవ్యక్తమైన బాధ, అగుపిస్తున్నాయి. **Mental**గా **upset** అయినట్లు కనుపిస్తున్నాడు. కుడిచెయ్యి కోటుజేబులో దాచుకున్నాడు. ఎడమచెయ్యి అస్తవ్యస్తంగా వేలాడుతోంది.]

రావ్ : డాక్టర్, డాక్టర్! కొత్తగా వచ్చిన డాక్టర్ ఇల్లు ఇదేనా ? ఆఁ. ఇంట్లో ఎవరూ లేరూ ? ఎవరూ పలకరేం? (కంఠస్థాయి హెచ్చిస్తాడు.) డాక్టర్, డాక్టర్ !

[డాక్టర్ అతనివంక తిరిగి చూచాడు. రావ్ డాక్టర్‌ను గమనించాడు]

రావ్ : గుడ్ ఈవినింగ్ డాక్టర్.

డాక్టర్ : ఎవరయ్యా నీవు, తుఫానులా వచ్చావూ ?

రావ్ : డాక్టర్ మీరేకదూ ?

డాక్టర్ : ఏమిటయ్యా పని ?

రావ్ : డాక్టర్లతో వేరే పనేముం

టుంది డాక్టర్! జబ్బు, జబ్బుగా ఉండి వచ్చాను.

డాక్టర్: ఏమిటయ్యా జబ్బు?

రావ్: ఏమిటో తెలిస్తే ఇక్కడి కెందుకొస్తాను డాక్టర్? అది తెలుసు కుందామనే మీ దగ్గిరి కొచ్చాను.

డాక్టర్: (అదోలా అతనివంక పరి శీలించిచూచి) ఇవాళ ఆదివారం, ఈపూట హాస్పిటల్ లేదు, రేపు ఉద యాన్నే హాస్పిటల్‌కు రావయ్యా, టెస్ట్ చేస్తాను.

రావ్: ఉదయం దాకా నా ఊపిరి ఉంటుందా డాక్టర్! డాక్టర్, నన్ను ఇప్పుడే ఎగ్జామిన్ చెయ్యండి.

డాక్టర్: ఇవాళ కంపౌండర్లు, నర్సులూ ఎవరూ లేరయ్యా. ఉద యాన్నే రా.

రావ్: మూలవిరాట్టు మీరున్నారు కదా డాక్టర్! నన్ను టెస్ట్‌చేసి ట్రీట్ మెంట్ ఇవ్వండి.

డాక్టర్: చెబుతుంటే మొండికేస్తా వేమయ్యా!

రావ్: నాది మొండికేసు డాక్టర్. కోప్పడకండి. చాలాదూరంనుంచి పని కట్టుక వచ్చాను. మీరు England Returned అని విని వచ్చాను డాక్టర్. వెంటనే నన్ను పరీక్ష చెయ్యండి; నా వ్యాధేమిటో చెప్పండి. ఆలస్యం చెయ్యకండి, డాక్టర్.

డాక్టర్: ఎందుకయ్యా అంత ఆదుర్దా? కూచోవయ్యా చూస్తాను.

రావ్: (సోఫాలో కూచుంటూ) థ్యాంక్యూ డాక్టర్, మీరు నా పాలిట దేవుడు.

డాక్టర్: (చేరువగావచ్చి) చెప్ప వయ్యా, ఏమిటి నీకు జబ్బు?

రావ్: ఏం చెప్పేది డాక్టర్, దారుణమైనబాధ... నన్ను తల్లక్రిందులు చేస్తోంది. ఇంతకంటె మరణబాధ నయం డాక్టర్! మనిషన్నవాడు దీన్ని తట్టు కోలేడు.

డాక్టర్: ఎక్కడయ్యా, ఎక్కడా బాధ?

[రావ్, కోటు జేబులో దాచుకున్న కుడి చెయ్యి భద్రంగా బయటికి తీస్తాడు. చేతికి చేరుమాలు చుట్టి ఉంటుంది.]

రావ్: చూడండి డాక్టర్, నా కుడిచెయ్యి చూడండి డాక్టర్!

డాక్టర్: ఏమైందయ్యా చేతికి?

రావ్: (విచిత్రమైన భంగిమలో అదేమాట తిరిగీ ఉచ్చరిస్తాడు.) ఏమైంది చేతికి? నా చేతికేమైంది?... చేతిలో ఏదో చెడ్డది డాక్టర్!

డాక్టర్: ఏదీ, చూడనివ్వు. (చెయ్యి పట్టుకోబోతాడు.)

రావ్: (భయచలితుడై) అమ్మో, ముట్టుకుంటే ప్రాణం పోతుంది. కట్టు విప్పకండి, కట్టు విప్పకండి డాక్టర్!

డాక్టర్: ఎందుకయ్యా అంత గాభరా? నీ ప్రాణాని కొచ్చిన భయ మేమీ లేదులే.

రావ్: చెయ్యి ముట్టుకుంటే చాలు జీవుడు కొట్టుకుంటాడు డాక్టర్! పై ప్రాణం పైననే పోతుంది!

డాక్టర్: ఇంత పెద్ద డాక్టర్ను ఇక్కడుండగా నాతో చెప్పకుండా పోతాయిటయ్యా నీ ప్రాణాలు? పోయినా పోనిస్తానటయ్యా! ఏదీ ఇలా

ఇవ్వు చెయ్యి. (చెయ్యి పట్టుకుంటాడు. రావ్ మూలుగుతుంటాడు. బాధ పడుతుంటాడు. డాక్టర్ అతని చెయ్యి కట్టు విప్పతీసి జాగ్రత్తగా పరిశీలిస్తాడు.) నిక్షేపంలా చెయ్యి వుంటే ఎందుకయ్యా ఎగిరెగిరి పడతావు? చేతికి కేమీ కాలేదు.

రావ్ : ఏమెందుకు కాలేదు డాక్టర్, చేస్తే కావలసినంత గ్రంథం నడిచింది! (అతని ప్రతిమాట, ప్రతి కదలిక వింటూ, పరిశీలిస్తుంటాడు డాక్టరు.) చూడండి డాక్టర్, జాగ్రత్తగా చూడండి. సూక్ష్మంగా చూడండి! (చెయ్యి తోటకూరకాడలా వ్రేలాడవేసి) చెయ్యి చచ్చుపడ్డది డాక్టర్! చెయ్యి ఎత్తలేను, చెయ్యి దించలేను. చేతిలో ఏదో చెడ్డది డాక్టర్! .... అమ్మో, మళ్ళీ గుడ్డ చుట్టండి డాక్టర్; చెయ్యి చింతనిప్పుల్లో పెట్టినట్టుంది!

డాక్టర్ : (చెయ్యి పరిశీలిస్తూనే) ఇష్ ..ఏమీ లేదని చెబుతుంటే ఎందుకయ్యా అంత బెదురు? .....లేదు. చెయ్యి ఎక్కడా చెడలేదు, It is alright. మరి నొప్పెక్కడయ్యా నీకు?

రావ్ : ఎక్కడని చెప్పేది డాక్టర్; నరాలు పగులగొట్టుక పోతున్నాయి. చెయ్యంతా ఒకటే Pain. ఈ Pain నా ప్రాణం తీస్తోంది డాక్టర్!

[డాక్టర్ అతని చేతిని పలు ప్రదేశాలలో ఒత్తిచూస్తాడు.]

డాక్టర్ : ఇప్పుడు చెప్పవయ్యా, నొప్పెక్కడో చెప్పు?

రావ్ : (బాధపడుతూ) అయ్యో, నొప్పి, ఒత్తకండి డాక్టర్, కత్తికోత పెట్టినట్టుంది.

డాక్టర్ : ఇష్, అరవకు. అడిగింది చెప్పు. ఇక్కడ నొప్పి ఉన్నదా?

రావ్ : ఉంది.

డాక్టర్ : ఇక్కడా?

రావ్ : ఆఁ, ఉంది.

డాక్టర్ : మరి ఇక్కడా?

రావ్ : అక్కడాఉంది డాక్టర్.

డాక్టర్ : అంతటాఉంటే మరి లేనిదెక్కడయ్యా?

రావ్ : లేనిచోటు లేదు డాక్టర్! అదికదూ నే మొత్తుకొనేది.

డాక్టర్ : భలేవాడివయ్యా, నీబాధ బహు చిత్రంగా ఉందే! చేతిమీద వుందూ బూచీ లేదు. ఎక్కడా వాటి పొలకు వేలేదు. చర్మం చెడ లేదు. ఎక్కడా దెబ్బ తగలలేదు. చేతిలో ఏదో చెడ్డదని నీవు ఊరికే ఊహించుకుంటున్నావు, అంతేనయ్యా!

రావ్: నిజం డాక్టర్, ఊహించుకోవడంకాదు. ఉన్నమాటచెబుతున్నాను: చేతిలో విషప్పురుగు చేరింది డాక్టర్!

డాక్టర్ : ఏదీ...(Pulse Examine చేస్తాడు. temperature చూస్తాడు. కళ్లు పరిశీలిస్తాడు. స్టెతస్కోప్‌తో Heart, Lungs, examine చేస్తాడు.) 'వెనక్కు మళ్లి, బాగా ఊపిరిపీల్చు'... ఊ...ఏదీ నాలిక? (ఒక్కక్షణం ఆలోచిస్తూ అటూ ఇటూ పచారుచేస్తాడు.) ఇలా ఉండి ఎంతకాలమయిందయ్యా?

రావ్ : కొద్ది రోజు లవుతుంది; కాని కొన్ని యుగాలయినట్లుందిడాక్టర్!

డాక్టర్ : అంతకుముందూ? అంటే ఈ బాధ రాకముందు ?

రావ్: మహారాజులా ఉండేవాణ్ణి.

డాక్టర్ : ఎప్పుడయినా మతి చలించడంగాని ?...

రావ్ : అబ్బే.

డాక్టర్ : ఫిట్సు రావటంకాని?...

రావ్ : లేదు డాక్టర్. దివ్యంగా ఉండేవాణ్ణి.

డాక్టర్ : నీకేమైనా దిగుళ్లున్నాయి టయ్యా ?

రావ్: దిగులంటే ఏమిటో ఏనాడూ ఎరగను డాక్టర్.

డాక్టర్ : ఒకమాటు ఇలా గదిలోకి రావయ్యా.

(డాక్టర్ గదిలోకి వెడతాడు. రావ్ అయన్ను అనుసరిస్తాడు. రామన్న ఒకమాటు బయటనుంచి లోనికి వెడతాడు. క్షణంలో డాక్టర్, రావ్ వెలుపలికి వస్తారు.)

డాక్టర్ : (వస్తూ) చిత్రంగా ఉన్నదయ్యా నీకేసు !

రావ్ : మీకూ అలాగే వున్నదా డాక్టర్?

డాక్టర్: అబ్బాయ్, నిన్ను ఛరోగా ఎగ్జామిన్ చేశాను. నీ దేహంలో డిసీజ్ లేదు. చేతిలో ఏదో Pain అంటున్నావు. చేతికేమీ కాలేదని చెప్పాను. నాచెయ్యి ఎలాఉందో నీచెయ్యి అలా ఉంది. ఇహ నీ రోగమేమిటో అంతు పట్టకుండా వుందయ్యా!

రావ్ : డాక్టర్! మీకూ అంతు పట్టలేదా, డాక్టర్?

డాక్టర్ : ఏం? నేనైతే దేవుణ్ణటయ్యా ! అబ్బాయ్! ఒక్కమాట చెబుతాను విను. వైద్యశాస్త్రం చెప్పినంతవరకూ నీ వంట్లో వ్యాధిలేదు. అవుతే మెంటల్ డిసీజ్ - మనోవ్యాధి కావచ్చు !

రావ్ : ఆమాట మీరూ అంటున్నారా డాక్టర్ ?

డాక్టర్ : ఏం, ఇంతకు ముందెవరైనా అన్నారా ?

రావ్ : చాలామంది అన్నారు డాక్టరు. కాని నేను చచ్చినా అంగీకరించలేదు. ఇప్పుడు మీరంటూవుంటే అనుమానంగాఉంది డాక్టర్. మనోవ్యాధికి మందులేదంటారే !

డాక్టర్: ముందుముందు మూర్ఛలు రావచ్చు.

రావ్ : మూర్ఛలా డాక్టర్ !

డాక్టర్ : కొంత కాలానికి మతి కూడా పోవచ్చు.

రావ్ : డాక్టర్, డాక్టర్! అలా అనకండి డాక్టర్ ! మీకు పుణ్యముంటుంది. నేను పిచ్చివాణ్ణికాదు. తబ్బిబ్బుమాట ఒక్కటైనా అన్నానా చెప్పండి? నాకు మతిచెడలేదు డాక్టర్, చెడ్డదల్లా చెయ్యే......డాక్టర్ ! మీ మేలు మరువను. చెయ్యి ఆపరేషన్ చెయ్యండి డాక్టర్. ఆపరేషన్లో మీకు మించిన చెయ్యి లేదట. అంతా చెప్పుకుంటున్నారు. చెయ్యిపోతే పోయింది; మైండ్ పోకుండా చూడండి డాక్టర్!

డాక్టర్ : అక్కడేమీ లేందే ఆపరేషన్ చెయ్యమంటావేమయ్యా; ఇదేం

కూర గాయనుకున్నావుటయ్యా? కోసెయ్యటానికి! ఆరోగ్యం చెడని ఒక మనిషి చెయ్యి-చెయ్యి పోయిన తరువాత ఇహ నీవు చేసేదేమిటయ్యా?

రావ్ : (జేబులో నుంచి డబ్బు తీస్తాడు) డాక్టర్ ! నన్ను కనికరించండి మీరు కోరిన ఫీజు యిచ్చుకుంటాను. చేతికి కోతపెట్టండి డాక్టర్.

డాక్టర్ : పిచ్చివాడా! నీవు డబ్బు ఇస్తే లేని జబ్బు వస్తుందటయ్యా. నీవు వేలు కుమ్మరించినా నా వల్లయ్యే పని కాదిది, ఇది వైద్య శాస్త్రానికే విరుద్ధమయ్యా! ఏ డాక్టరూ ఈ పని చేయడు

రావ్ : (దీనంగా) డాక్టర్! మిమ్మల్ను వేడుకుంటున్నాను డాక్టర్. ఈ బాధ తట్టుకోడం నా తరంకాదు. ఏదో ఎరుగని బాధ, లోలోపల వ్రణంలా సెలవేస్తోంది. ఎక్కడో గాయం తగిలింది డాక్టరు !?.. అదిగో, అదిగో! చూడండి డాక్టర్ ! చేతిలో విషపు నరు చేరింది. ఆ గణుపుదగ్గర చూడండి డాక్టర్, ఎలా ఎరుపెక్కిందో !... డాక్టర్ ! ఆ చెయ్యి అంతవరకు కోసెయ్యండి !

డాక్టర్ : అబ్బాయ్ ! నీకు ముందు ముందు మతిపోతుందన్నాను. కాదు, ఇప్పటికే పోయింది !

రావ్ : (గాభరాగా) డాక్టర్ !

డాక్టర్ : (సీరియస్‌గా) కాకపోతే ఏమిటయ్యా, నీ వాలకం నీవు? నిన్ను చూస్తుంటే ముందు నాకు మతి పోతున్నది. నీ వంట్లో వ్యాధీ లేదు, నేను నీకిచ్చేమందూ లేదు. (నింపాదిగా బుజంతడుతూ) వెళ్ళు, బాబూ, వెళ్ళు! వెళ్ళి విశ్రాంతి తీసుకో.. (నౌకరును పిలుస్తాడు) రామన్నా, రామన్నా !

రామన్న : (లోపల్నుంచి) వస్తున్నా బాబయ్యా. (ప్రవేశించి) ఏం బాబయ్యా ?

డాక్టర్ : డ్రైవర్‌ను కారు బయట పెట్టమను.

రామన్న : చిత్తం బాబయ్యా (నాలుగడుగులు వేసేసరికి తిరిగి డాక్టర్ పిలుస్తాడు.)

డాక్టర్ : ఇదిగో, రామన్నా

రామన్న : (వెనక్కు తిరిగి) ఏం బాబయ్యా ?

డాక్టర్ : ఈయన్ను మెల్లగా గేటు దాకా తీసుకెళ్ళి వదిలిపెట్టు.

రామన్న : (రావుతో) రాండి బాబూ.

రావ్ : (డాక్టర్‌తో దీనంగా) డాక్టర్ ! నన్ను పంపించేస్తారా డాక్టర్!

డాక్టర్ : అబ్బాయ్! ఊరికే ఉద్రేకపడకు. మనస్సుపాడుచేసుకోకు. ఇంటికి వెళ్ళివిశ్రాంతితీసుకో, నాయనా, వెళ్లు! (బుజం తడుతూ సాగనంపుతాడు.)

రామన్న : (రావుతో) రాండి బాబయ్యా, రాండి.

రావ్ : (వెళ్ళలేక వెడుతూ) డాక్టర్ ! నా చెయ్యి-నాచెయ్యి, ఆపరేషన్ చెయ్యరూ ?

[రావ్, రామన్న వెలుపలికి వెడతారు.]

డాక్టర్ : Poor soul !

సుభద్ర: (కాఫీలు, బిస్కట్లు ట్రేలో పెట్టుకుని ప్రవేశిస్తుంది.) ఎవరండీ ఆ **Poor Soul** ?

డాక్టర్: ఎవరోఅబ్బాయిసుభద్రా, ఆపరేషన్ చెయ్యమని వచ్చాడు.

సుభద్ర: అదిగో, నేననుకున్నంతా అయింది!

డాక్టర్: ఏమనుకున్నావు, ఏమైంది?

సుభద్ర: ఎవరో ఒకరు పీసంట్సు రానూవస్తారూ, మన ప్రోగ్రాం తల్లక్రిందులవుతుందీ, అని నేనప్పుడే అనుకున్నా! ఇంకేం? అంతపనీ అయింది.

డాక్టర్: ఏం కాలేదు సుభద్రా. మనం ఎగ్జిబిషన్‌కు వెడుతున్నాం. కారు బయట పెట్టమన్నాను.

సుభద్ర: ఈ మధ్యలో మళ్ళీ ఎవరూ రాకపోతే కదూ..ఇప్పుడా వచ్చిన అతన్ని ఏం చేశారండీ?

డాక్టర్: ఏమన్నా ఉంటేకదూ చెయ్యడానికి? ఆపరేషన్, ఆపరేషన్ అని గోలపెట్టాడు. వెళ్ళమన్నాను. చేస్తే అతనికి బాడీకి కాదు ఆపరేషన్_మైండ్‌కు చెయ్యాలి!

సుభద్ర: అదేమిటండీ?

డాక్టర్: అవును సుభద్రా, ఎక్కడో మెంటల్‌గా దెబ్బతిన్నాడు.

సుభద్ర: మైగాడ్! ఇతనికీ మెంటలో డిసీజే! ఏం రోగాలో, ఏం లోకమో, ఒక చెంపన మతులు పోతు న్నాయి. మొన్న ఆ అమ్మాయి ధోరణి _ అదేం ధోరణండి? నా మొగుడు, నా మొగుడు అని మొత్తు కుంటుం దేమిటి?

డాక్టర్: మొగుడు మోసంచేశాడు సుభద్రా! అందుకే ఆ పిల్లకు ఏ మగవాడు కనుపించినా మొగుడులా కనుపిస్తాడు! దాన్నే సైకలాజికల్ ఎఫెక్ట్స్ అంటారు.

సుభద్ర: అబ్బబ్బ, మీ సైకాలజీ స్టడీతో చస్తున్నామండీ. వేళాలేదు, పాళా లేదు. అపరాత్రిళ్ళువచ్చి అపాయంలో ఉన్నామంటూ తలుపులుతడుతుంటారు. ఆపరేషన్‌లు, మెంటల్ డిసీజ్‌లు_ ఒక్క క్షణం రెస్ట్ ఉండదు. ఉన్న హాస్పిటల్, నర్సింగ్ హోమ్ చాలక మరో మెంటల్ హాస్పిటల్ కట్టించా లంటున్నారు. అది కట్టించేసరికి మనకు పూర్తిగా మతులు పోతాయి!

డాక్టర్: సుభద్రా, సుభద్ర! ఎంత పిచ్చిపిల్లవు సుభద్రా! మనకు మతులు పోతాయా? డాక్టర్లకు మతులు పోతాయా?

సుభద్ర: పోక ఏమవుతాయండీ ఈ రోగులను చూస్తుంటే.

డాక్టర్: లేదు సుభద్రా, నీకు తెలీదు. రకరకాల రోగులను పరిశీలి స్తుంటే ఎంత ఉల్లాసంగా వుంటుందను కున్నావు! రోగులే డాక్టర్లకు ఆరో గ్యం, ఆనందం సుభద్రా!

సుభద్ర: అయినా రాను రాను మన బంగళా, ఆస్పత్రి అయిపోతోంది!

డాక్టర్: ఆమాటకొస్తే ప్రపంచమే ఒక ఆస్పత్రి సుభద్రా! నీవూ, నేనూ అందరం అందులో రోగులమే!

సుభద్ర: సరిసరి సైకాలజీ వదలి ఫిలాసఫీలో పడ్డారూ! (బిస్కట్లు తిన డం పూర్తి అవుతుంది.) ముందు కాఫీ తాగండి.

డాక్టర్: నీవు త్వరగా ముస్తాబు ముగించు సుభద్రా.

సుభద్ర : నా దంతిసెపు, అయిదు నిమిషాలలో తయారై వస్తాను. మీరు ఇతర Engagements పెట్టుకోకండి.

[కాఫీలు తాగడం పూర్తి అవుతుంది. కప్పులు ట్రే తీసుకొని సుభద్ర లోనికి వెడుతుంది. డాక్టర్ సైపు వెలిగించి ఫోన్ దగ్గరికి వెడుతాడు.]

డాక్టర్ : (ఫోన్‌లో) హలో !... ఆఁ .. డాక్టర్ రఘునాధ్...ఏవోయ్ మూర్తీ! Anything particular? బెడ్ నెంబర్ సెవెన్ ఎలా ఉన్నాడు? ఆఁ ... అతనే – కలవరిస్తున్నాడా! ఆఁ . మరేం భయం లేదని చెప్పు. Yes, Yes. కట్టు విప్పడం ఇప్పుడప్పుడే కాదయ్యా. ఆఁ ... పది నిమిషాల్లో బయలుదేరుతున్నా. ఆఁ ... ఎగ్జిబిషనుకు ... ... ఆఁ వెడుతూ వెడుతూ విజిట్ చేస్తాలే ...... O K. (ఫోను పెట్టేస్తాడు.)

[బయటనుంచి రామన్న ఆదుర్దాగా ప్రవేశిస్తాడు.]

రామన్న: బాబయ్యా, బాబయ్యా!

డాక్టర్ : ఏమిటోయ్ రామన్నా ?

రామన్న: ఇప్పుడొచ్చిన అబ్బాయి గారు వెడుతూ వెడుతూ గేటుముందు విరుచుక పడ్డాడు బాబయ్యా !

డాక్టర్ : What ?

రామన్న : అవును బాబయ్యా, ఏదో ధోరణిగా మాట్లాడుతున్నాడు.

డాక్టర్ : అతన్ని లోపలికి తీసుకురా, రామన్నా !

రామన్న : అట్లాగే బాబయ్యా. (వెడతాడు.)

డాక్టర్ : సుభద్రా; సుభద్రా ! (లోనికి వెడతాడు.)

[రామన్న రావును వెంట బెట్టుక వస్తాడు. డాక్టర్ లోపల్నుంచి ప్రవేశిస్తాడు. రావ్ ఒక విధమైన డెలీరియంలో ఉన్నాడు.]

రావ్ : డాక్టర్ ! రమ్మన్నారా డాక్టర్? రమ్మంటే వస్తాను, పొమ్మంటే పోతాను. నాదేముంది డాక్టర్ ? నేను డాక్టర్, మీరు పేషంటు– అహఁ. నేను పేషంటు, మీరు డాక్టరు, అంతేనా డాక్టర్ ? ఈ జీవితం అంతేనా డాక్టర్? దాని అంతు మనం చూస్తాం. కాని చివరకు అదే మన అంతు చూస్తుంది! (రామన్న వెలుపలికి వెడతాడు. డాక్టరు, రావును కూచోమని సైగ చేస్తాడు. అతని చర్యలు గమనిస్తుంటాడు.) కూచోమంటారా డాక్టర్? అసలు మనం కూచోక లేచిందెప్పుడు? లేవడం మన జన్మలో లేదు. డాక్టర్ ! నా చెయ్యి తీసేస్తారా ? తీసెయ్యండి డాక్టర్! మనకు ఉన్నదే ఒక్క చెయ్యి. ఉండి ఏం చేస్తుంది? తీసెయ్యండి డాక్టర్. శుభ్రంగా తీసెయ్యండి.

డాక్టర్ : సుభద్రా, సుభద్రా !

సుభద్ర : (వస్తూ) ఏమండి !

డాక్టర్ : మెడిసిన్ చెస్ట్.

[సుభద్ర గదిలోనికి వెళ్ళి మెడిసిన్ చెస్ట్ తెచ్చి టేబిల్ మీద పెడుతుంది.]

రావ్ : ఈ పేరు ఎక్కడో విన్నానే! ఎక్కడ? ఎక్కడ విన్నాను? అవును– అర్జునుడి చెల్లెలు సుభద్ర – వీరభద్రుణ్ణి వివాహమాడి వీరాంజనేయుణ్ణి కన్నది!

[డాక్టర్ మెడిసిన్ చెస్ట్‌లోనుంచి కొన్ని బిళ్లలు తీస్తాడు]

డాక్టర్ : సుభద్రా! ఒక గ్లాసు వేడినీళ్ళు.

సుభద్ర : తెస్తున్నానండీ! (లోనికి వెడుతుంది.)

రావ్ : వేడినీళ్ళెందుకు డాక్టర్ ? ఉన్న వేడితోనే వేగలేక చస్తున్నా ! (సుభద్ర గ్లాసుతో వేడినీళ్ళు తెస్తుంది. డాక్టరు అందుకుంటాడు.) .. డాక్టర్ ఆమెగారు మీా నర్సా? ...నరసమ్మా! నమస్కారమమ్మా. నాచెయ్యి తీసెయ్యమని డాక్టరుతో చెప్పవమ్మా. (సుభద్ర లోనికి వెడుతుంది. డాక్టరు రావుచేత బిళ్లలు మింగిస్తాడు.)

డాక్టర్ : అబ్బాయ్, ఈ మందు వేసుకో.

రావ్ : మనకు మందెందుకు డాక్టర్ ? మందులూ విందులూ మహారాజులకు !...... అది మత్తుమందా డాక్టర్? అవున్లెండి. ఆపరేషన్ చెయ్యడానికి మత్తు మందివ్వొద్దూ ! అవుతే ఇవ్వండి.

డాక్టర్ : ఇష్ ! మింగవయ్యా ... ఈ మంచినీళ్లు తాగు.

రావ్ : నీళ్ళకు మంచీ, చెడ్డా లేదు డాక్టర్! నీళ్ళన్నీ ఒకటే – ఏనీళ్ళయినా తాగుతాను, తాగుతాను డాక్టర్. ఈరోజులలో తాగడం వాగడం తప్పులేదు. దేవుడు తాగాట్ట! తాగి తూలాట్ట! అలా తాగి తూగుతుండగా అతని దేహంనుంచి పద్నాలుగు భువనాలు పుట్టాయిట! అందుకే మనుషులంతా తాగుబోతులు, వాగుబోతులు అయినారట! ఆల్‌రైట్! తాగుతాను నా **Pain** తగ్గుతుందా డాక్టర్ ?(Tablets వేసుకుని నీళ్ళు తాగుతాడు.) కొద్ది క్షణాల్లో మందు Reaction వస్తుంది.) .. డాక్టర్ ! కళ్ళు మసకలు కమ్ముతున్నాయి డాక్టర్ !... ఎందు కలా మబ్బు పట్టింది ? ఎవరా దోబూచులాడేది ? ఏమిటా నీడలు ఆడుతున్నాయి ? ఎందుకు నీడలో నిలుచున్నారు ? ఎండలోకి రండి, ఎండలోకి రండి !...ఎవరిదా ముఖం ? ఎందుకా మనుషులు వెనక్కు నడుస్తారు ?... మరలు చెడ్డాయి. కొత్త మరలు వెయ్యండి...బండి పడిపోయింది, బండి పడిపోయింది ! పట్టాలమీాది కెక్కించండి ... ఆఁ ... ఎవరెక్కిస్తారయ్యా; పడ్డవాణ్ణి ఎవరు లేవతీస్తారయ్యా? లేచినవాణ్ణి పడగొడతారుగాని ! .. ఆఁ, అన్నీ అనుమానాలే- అబ్బాయిమీాద అమ్మాయికి అనుమానం, అమ్మాయి మీాద అబ్బాయి కనుమానం; అనుమానం లేందెవరికీ లే! అనుమానాలు అవమానాలు మనుషులకు మామూలేలే... ఎందుకు ఏడుస్తారు ? ఎవరూ లేరు, ఎవరూ లేరు. గుడి పాడుపడింది, గుడి పాడింది !... అమ్మడూ ! ప్రొద్దుకూకింది, ఇంట్లో దీపం పెట్టమ్మా !...ఇష్ ! నిశ్శబ్దం! నిశ్శబ్దం- నిద్రపోతున్నారు... నీళ్ళలో నిప్పుపుట్టింది, నీళ్ళలో నిప్పుపుట్టింది!... అసలు నాకు తెలీక అడుగుతాను. మనిషి తప్పుచేస్తే దేవుడు శిక్షిస్తాడు. మరి దేవుడు తప్పుచేస్తే- ఎవడు శిక్షిస్తాడు ?... ఆఁ- ఎవడో-ఏట్లో రామరుద్రాయ !...డాక్టర్ ? నా మనసు మస కిచ్చింది. నన్ను మళ్ళీ మనిషిని

చెయ్యండి డాక్టర్! కొంపతీసి మీ మందులన్నీ నా మీద Experiment చేస్తున్నారా ఏమిటి?

[రామన్న ఒక కవరు పట్టుకొచ్చి ఎడంగా నిలుచుంటాడు]

డాక్టర్: ఏమిటి రామన్నా?

రామన్న: ఎవరో వచ్చి ఉత్తరం ఇచ్చి వెళ్ళారు బాబయ్యా, అర్జంటట.

[డాక్టర్ కవరు అందుకుని చింపి చదువుకుంటాడు.]

రావ్: లెటర్ వచ్చిందా డాక్టర్? నాకూ వచ్చాయి లెటర్సు. లెటర్సులో చాలా రకాలున్నాయి డాక్టర్, పర్సనల్ లెటరు, బిజినెస్ లెటరు, సీక్రెట్ లెటరు, లవు లెటరు! మీదే లెటరు డాక్టర్? లవులెటరైతే బెటర్...... డాక్టర్! లెటర్సులో రహస్యాలుంటాయి. రచ్చకెక్కించకండి.

[డాక్టర్ లెటర్ చదవడం పూర్తిచేసి ఫోన్ దగ్గరికి వెడతాడు. వెడుతూ]

డాక్టర్: రామన్నా.

రామన్న: ఏం బాబయ్యా?

డాక్టర్: అతన్ని మెల్లగా రూంలోకి తీసుకెళ్ళి పడుకోబెట్టు.

[రామన్న భయంభయంగా అతన్ని చెయ్యి పుచ్చుకుని గదిలోకి తీసుకెడుతుంటాడు]

రావ్: బూట్లకుకాదురా పాలిష్, బుర్రలకు చెయ్యరా!... మా ఊరి మంగయ్య మళ్ళీ మంత్రి అవుతాడయ్యా! ప్లీడరు సాంబయ్యకూ అతనికీ పేచీ వచ్చిందిగా! ఎదురు వాదనకు ఎవరూ లేక తనలో తనే వాదించుకుంటున్నాడు. (వెడుతూ వెడుతూ వెనక్కి తిరిగి) అది పిల్లకాదు పిడుగు! నేనయితే షూట్ చెయ్యనటండీ!... ఒక చిన్న పిస్టల్ ఇప్పించండీ, ఇహ చూపిస్తా నా తడాఖా!

[అతన్ని త్వరగా తీసుకెళ్ళమని డాక్టర్, రామన్నకు సైగచేస్తాడు. అతను గది వాకిట్లోకి వెళ్ళి ఆగుతాడు.)

డాక్టర్! నా బుర్రలో ఏదో గిర్రున తిరుగుతున్నది డాక్టర్!

'మొగలి పువ్వులాంటి అమ్మాయి
పాడుతున్నది పడుపువృత్తుల సన్నాయి'

[రాగంతీస్తూ గదిలోనికి వెడ్తాడు. రామన్న లోనికి వెళ్ళి తిరిగి వస్తాడు. డాక్టర్, ఫోన్ చెయ్యబోతుంటాడు.]

రామన్న: కారు రెడీ అయింది బాబయ్యా.

డాక్టర్: ఇప్పుడు కాదు రామన్నా కాసేపు ఆగమను.

రామన్న: అలాగే బాబయ్యా. (బయటికి వెడతాడు.)

డాక్టర్: (ఫోన్ లో) హలో, హలో! ఆఁ - డాక్టర్ రఘునాథ్ స్పీకింగ్... మెడికల్ కాలేజీయేనా? ఎవరూ మాట్లాడేది? ఓ! మీరా! ఆఁ, అందింది. I am sorry ఇవాళ మీటింగ్‌కు రాలేను. మరెవరినైనా మాట్లాడమనండి. ఆఁ, సీరియస్ కేస్ ఆఁ...ట్రీట్‌మెంట్ ఇస్తున్నా thank you (ఫోన్ పెట్టేస్తాడు. ఒకమాటు గదిలోకి వెళ్ళి వెంటనే తిరిగి వస్తాడు.) సుభద్రా, సుభద్రా!

సుభద్ర: (వస్తుంది) ఏమండీ?

డాక్టర్: మన ప్రోగ్రాం upset అయింది.

సుభద్ర : నే ముందే చెప్పానుగా ఏదో ముంచుకొస్తుందని... ఇప్పుడతనికి ఎలా ఉందండీ ?

డాక్టర్ : ఎలా ఏమిటి, మంపులో ఉన్నాడు.

సుభద్ర : ఇతనికీ పిచ్చేనంటారా ?

డాక్టర్ : పిచ్చి కాదు సుభద్రా. ఒక విధమైన delirium లో ఉన్నాడు.

సుభద్ర : మంపులో ఉన్నా కొన్ని మంచిమాటలే మాట్లాడుతున్నాడే!

డాక్టర్ : అవును సుభద్రా, అదొక ధోరణి. దాన్నే సైకలాజికల్ ..

సుభద్ర : సరిసరి–ఇహ వద్దు లెండి ఆ సైకాలజీ గొడవ.

డాక్టర్ : సుభద్రా.

సుభద్ర : ఏమండీ ?

డాక్టర్ : ఇవాళ నీవు నర్సుగా పని చెయ్యాలి.

సుభద్ర : ఇవాళేమిటి, ఎల్లకాలం మీకు నర్సునే.

డాక్టర్ : ఇది చాలా peculiar case సుభద్రా.

సుభద్ర : మీ దగ్గరికొచ్చేవన్నీ ఇలాంటివే.

డాక్టర్ : కుర్రాడు, మెంటల్‌గా దెబ్బతిన్నాడు.

సుభద్ర : తగ్గుతుందంటారా ?

డాక్టర్ : భయంలేదు – ప్రస్తుతానికి తగ్గుతుంది. కాని నీ help కావాలి సుభద్రా.

సుభద్ర : చెప్పండి, ఏంచెయ్యమంటారు ?

డాక్టర్ : అతనికి ట్రీట్‌మెంట్ ఇస్తాను. నీవు జాగ్రత్తగా అతన్ని కని పెట్టి ఉండాలి.

సుభద్ర : అలాగే.

డాక్టర్ : ఇంట్లో పాలున్నాయా సుభద్రా?

సుభద్ర : ఉండండి వంట మనిషి నడిగి చెబుతాను.

డాక్టర్ : లేకపోతే తెప్పించు సుభద్రా.

సుభద్ర : అలాగే.

[రామన్న వెలుపల్నుంచి వస్తాడు.]

డాక్టర్ : రామన్నా !

రామన్న : ఏం బాబయ్యా?

డాక్టర్ : ఆ మెడిసిన్‌చెస్టు గదిలోకి పట్రా.

[డాక్టర్ గదిలోనికి వెడతాడు. రామన్న మెడిసిన్‌చెస్టు తీసుకుని గదిలోపెట్టి తిరిగివస్తాడు. ఈలోపున సుభద్ర లోనికివెళ్ళి తిరిగి వస్తుంది.]

సుభద్ర : రామన్నా !

రామన్న : అమ్మా

సుభద్ర : ఇలారా రామన్నా.

[సుభద్ర, రామన్న లోనికి వెడతారు. లైట్లు ఆరిపోయి తిరిగి వెంటనే వెలుగుతాయి. భవనంలో దీపాలు కూడా వెలుగుతాయి. Shows time lapse రావ్ ఇప్పుడు కొంచెం fresh గా కనుపిస్తున్నాడు. ముఖంలోకి కాస్త తెలివి, తేజస్సూ వచ్చాయి. సోఫాలో కూచొనిఉన్నాడు. అతనికి ఎదంగా మరొక సోఫాలో సుభద్ర కూర్చున్నది. ఆలోచనా పూరితమై ఉన్నది ఆవిడ వదనం. డాక్టర్ నైట్ గౌను వేసుకున్నాడు. పైప్ కాలుస్తూ, టెలిఫోన్ టేబిల్ ప్రక్కనున్న కిటికీచెంత నుంచున్నాడు గాలిపీల్చుకుంటూ. మధ్య టేబిల్‌మీద మందుసీసా, ఔన్సులగ్లాసు పండ్లరసం పోసిఉంచిన గ్లాసూ–ఉన్నాయి.]

డాక్టర్: మిస్టర్ రావ్! ఇప్పుడెలా వున్నదయ్యా నీకు?

రావ్: కొంచెం బరువుదించినట్లుంది డాక్టర్.

డాక్టర్: మూడ్సు బాగున్నాయా?

రావ్: పరవాలేదు.

సుభద్ర: తరువాత చెప్పండి రావుగారూ.

డాక్టర్: మనస్సు వికలమై మళ్ళీ మంపు లొస్తాయేమో సుభద్రా. అతన్ని rest తీసుకోనీ.

సుభద్ర: చేసిన పాపాలు చెబితే పోతయ్యంటారు. చెప్పనివ్వండీ!

డాక్టర్: చెప్పవయ్యా రావ్.

సుభద్ర: ఉండండి, ఒక్కనిముషం. (లేచి టేబిల్ దగ్గరికి వస్తుంది. ఔన్సుల గ్లాసులో మందు పోసి తెచ్చి రావ్‌కు ఇస్తుంది.) మీరు మందు పుచ్చుకోండి రావుగారూ. (రావ్ మందు తాగుతాడు. సుభద్ర గ్లాసు తీసుకెళ్ళి తిరిగీ టేబిల్‌మీద పెట్టి వస్తుంది.)

డాక్టర్: చూశావా మిస్టర్ రావ్! సుభద్ర చేసిన సర్వీసే నీవింత త్వరగా కోలుకోడానికి కారణం.

రావ్: వారికి నా ధన్యవాదాలు డాక్టర్. వారే లేకపోతే నేను లేకుండా పోయేవాణ్ణి.

సుభద్ర: ఇహ చెప్పండి రావుగారూ.

రావ్: మాలతి నా కళ్ళకొక అప్సరసలా అగుపించేది. లోకంలో అందమంతా ఆవిడలో గూడు కట్టుకున్నదా అనిపించేది. ఆ అందంచూచి అసూయపడేవాణ్ణి, ఆవిడకు భర్తగా ఉండడానికి తగననుకునేవాణ్ని.

డాక్టర్: దాన్నే కాంప్లెక్స్ అంటారు.

రావ్: అదే నా అనుమానాలకు తోవతీసింది డాక్టర్. ఆవిడను ఎవరి వంకా కన్నెత్తి చూడనిచ్చేవాణ్ణికాదు. ఎవరితోనూ పెదవివిచ్చి మాట్లాడనిచ్చేవాణ్ని కాదు. ఆవిడ శీలాన్ని శంకిస్తూ వచ్చాను. ఏవేవో అనుమానాలు అహర్నిశలు నన్ను ముట్టుముట్టి వేధించసాగాయి. మాలతిదగ్గర ఒక చిన్న గంధప్పెట్టె ఉండేది. ఆ పెట్టెలో తన బొమ్మ సామాను పెట్టుకునేది. పెట్టెకు ఎప్పుడూ తాళాలువేసిఉంచేది. ఎవర్నీ తెరిచి చూడనిచ్చేదికాదు. నా అనుమానాలు మరింత తీవ్రరూపం తాల్చాయి డాక్టర్. ఆ పెట్టెలో ఆమె తన రహస్యాలన్నీ దాచిపెట్టుకున్నదనుకున్నాను .....ఒక రోజు - ఆ రోజు నా జీవిత వసంతంలో విషం కక్కిన రోజు డాక్టర్! మాలతి ఎక్కడికో వెళ్ళింది. మారు తాళాలతో ఆమె గంధప్పెట్టె తెరిచిచూచాను. నా కళ్లను నేనేనమ్మలేకపోయాను డాక్టర్! పెట్టెలో ఉత్తరాలు కనుపించాయి - ప్రేమలేఖలు! అప్పుడు నా మనస్సు ఎలా ఉందనుకున్నారు?

సుభద్ర: ఎలాఉంది రావుగారూ? ఎలా ఉంది?

రావ్: ఏదో మహాశక్తి మెలిపెట్టినట్లు నా మనస్సు మెలికలు తిరిగింది. భార్య పరాయి మగవాడితో

కలుకుతున్న దని తెలిస్తే ఏ మగవా డయినా ఊరుకుంటాడా డాక్టర్ ?

సుభద్ర: ఊరుకోక ఉరిపోసుకుంటాడా రావుగారూ! దాని దారిన దాన్ని పోనిచ్చి తనదారి తాను చూచుకుంటాడు.

డాక్టర్ : Absurd.

సుభద్ర: మీరయితే ఏంచేస్తారండీ ?

డాక్టర్ : నిలుచోబెట్టి కాలుస్తాను.

సుభద్ర : తొందరపడకండి. ఇప్పుడంత పనీ చేసేరు !

డాక్టర్: తర్వాతచెప్పవయ్యారావ్!

రావ్ : నాలో ఏదో ఉప్పెనలా–ఉద్వేగం పొంగింది డాక్టర్. ఆ పొంగులో కొట్టుకపోయాను. మాలతి వచ్చింది. మహా ప్రళయంలా వెళ్ళి ఎదురుగా నిలుచున్నాను. ఆ ప్రేమ లేఖలు ఎవరు రాశారని అడిగాను. ఆ రహస్య ప్రియుడు ఎవడో చెప్పమన్నాను. కాని మాలతి మాట్లాడలేదు. బెబ్బులిని చూచిన లేడిపిల్లలా బెదిరింది. సుడిగాలి తాకిన చిరులతలా కదిలింది. సన్నని గొంతు విప్పింది. ఏదో సంగీతంలా చెప్పింది. కాని డాక్టర్, అప్పుడు నాకేదో ముసించింది నాకేమీ వినిపించలేదు, ఏమీ కనుపించలేదు. మాలతినితిట్టాను, కొట్టాను, వెళ్ళగొట్టాను డాక్టర్ ! మాలతి వెళ్ళిపోయింది. నా వెన్నెల వెళ్ళిపోయింది. ఆవిడ వెచ్చని, పచ్చని కన్నీరు నా చేతిపైన ధారకట్టింది డాక్టర్ !

[ముఖాన్ని చేతులతో కప్పుకుంటాడు.]

సుభద్ర : తరువాత చెప్పండి రావుగారూ.

రావ్ : తరువాత నేను మూడు పగళ్ళు, మూడు రాత్రిళ్ళు అన్నం నీళ్ళు ముట్టలేదు. నాలుగోనాడు ఉదయం నాకో ఉత్తరం వచ్చింది. మాలతి స్నేహితురాలు రాసింది డాక్టర్. తన ప్రేమలేఖలు మాలతి దగ్గర దాచుకున్నాననీ, అవి తిరిగీ పంపించమనీ రాసింది డాక్టర్ !

డాక్టర్ : మైగాడ్, నీ కథ అడ్డం తిరిగిందే మిస్టర్ రావ్ ! ఆ ప్రేమ లేఖలు నీ భార్య స్నేహితురాలి వన్న మాట !

సుభద్ర : ఒక్క క్షణం ఉండండి. (రావ్‌తో) మీరు కొంచెం పండ్లరసం పుచ్చుకోండి రావ్‌గారూ.

[పండ్లరసం గ్లాసులో పోసి అందిస్తుంది. రావ్ పుచ్చుకుంటాడు.]

డాక్టర్ : నాకూ పట్రా సుభద్రా.

సుభద్ర : ఏమండీ కథవింటే మీ మనస్సూ కల్లోల మైందా ? (పండ్లరసం, డాక్టర్‌కు కూడా ఇస్తుంది)

డాక్టర్ : (పండ్లరసం పుచ్చుకుంటూ) Irony సుభద్రా). Irony of fate !

రావ్: ఆ ప్రేమలేఖలు నా భార్యవి కావని తెలుసుకున్నప్పుడు నేను ఎలా ఉన్నాననుకున్నారు, డాక్టర్, ఎలా ఉన్నాననుకున్నారు? అవని ఆకాశం ఒకటై నన్ను అధః పాతాళంలో పడవేశాయి, డాక్టర్. అప్పటినుంచీ నాలో ఏదోఎరుగనిబాధ మొదలయింది డాక్టర్. లోలోపల ఏదో వ్రణంలా

సెలవేయసాగింది. నా చేతి మీద రాలిన మాలతి కన్నీటిబొట్టు – కన్నీటి బొట్టుకాదు డాక్టర్! కాలనాగు కాటందినా భరించవచ్చుగాని ఆకన్నీటి చుక్క భరించలేం డాక్టర్! మాలతిని చేజేతులా పోగొట్టుకున్నాను. నాకు నేనే లేకుండా పోయాను. అప్పటినుంచి ఇలా అయ్యాను. ఎక్కడెక్కడ తిరిగానో ఏమేమి చేశానో ఎరుకలేదు డాక్టర్. మళ్ళీ మాలతి నాకు కనుపించలేదు. నా మనస్సు మరక ఇచ్చింది. నాకు శాంతి లేకుండా పోయింది. ఎందరికో చూపించాను. తుదకు మీవద్దకు వచ్చాను డాక్టర్, ఇదీ నాకథ!

డాక్టర్: విన్నావా సుభద్రా?

సుభద్ర: విన్నాను, ఇది రావుగారి కథ కాదు; లోకంలో చాలా మంది కథ!

డాక్టర్: నీకు విచారంగాలేదూ?

సుభద్ర: ఎందుకు విచారం?

డాక్టర్: అదేమిటి సుభద్రా?

సుభద్ర: (ఒక విధమైన విషపు నవ్వు నవ్వుతుంది.)

రావ్: నవ్వుతున్నారా? నాకథ చెప్పనిచ్చి నన్ను వెర్రివాడ్నిక్రింద జమకట్టి నవ్వుతున్నారా? నన్ను చూచి విధి నవ్వింది! మీరూ నవ్వండమ్మా, నవ్వండి!

సుభద్ర: నవ్వింది నేనుకాదు రావుగారూ, మీ అనుమానాలు, ఆవేశాలు మిమ్మల్నిచూచి నవ్వాయి. రావుగారూ! ఒక్కటే అడుగుతాను చెప్పండి? చేసుకున్న అర్థాంగిని నిష్కారణంగా ఎందుకు అనుమానించారు? సరే, అనుమానించారు. అనుమానం పుట్టగానే దాన్ని అటో ఇటో తేల్చుకోవాలి. ఎందుకు తేల్చుకోలేదు? పైగా ఆవిడ దాచుకున్న ఉత్తరాలు చూచారు. ఎందుకు చూచారు? సరే, చూచారు. చూచినవారు అవి ఎవరివి? ఎవరు ఎవరికి రాసి ఉంటారు? అని ఆలోచించాలి. ఆలోచించక ఏ పాపమూ ఎరుగని ఆ పిల్లకు నేరం అంటకట్టారు. పోనీ, అంటకట్టారు. అప్పుడైనా ఆ పిల్లను చెప్ప నిచ్చారా? చెప్పింది విన్నారా? ఇదంతా ఎవరి తప్పు? చెప్పండి రావుగారూ, మాట్లాడరేం? దీని కంతకూ కారణం మీ తొందరపాటు కాదూ? మీ అనుమానమూ ఆవేశమూ కాదూ?

రావ్: (సాలోచనగా) అవును, అవును. ఆ క్షణం అలాంటిది.

సుభద్ర: ఒక ఉత్తమ క్షణాన్ని చెడగొట్టుకుంటే జీవితమంతా చెడుతుంది రావుగారూ! ఇప్పుడు విచారించి ఏం లాభం? ఈ విచారణ ముందే ఉంటే ఇంతదూరం వచ్చేదికాదు. కొందరు భార్యలను నమ్మి చెడతారు, కొందరు నమ్మక చెడతారు. మీరు అలాగే చెడ్డారు రావుగారూ. ఒక్క తడవ చేసిన తప్పుకు జీవితమంతా శిక్ష అనుభవిస్తున్నారు.

డాక్టర్: తప్పొప్పులు తరువాత తేలుద్దాం. ఏమయ్యా రావ్! ముందు నాకోవిషయం చెప్పు – నీ భార్య దగ్గర ప్రేమ లేఖలు దాచుకున్న దన్నావే, ఎవరయ్యా ఆమె?

సుభద్ర: మీరు మరో కొత్త కథ మొదలెట్టారే, డాక్టర్!

డాక్టర్: (రావ్‌తో) చెప్పవయ్యా ఎవరామె?

రావ్: ఆమె...(జ్ఞాపకం చేసుకో డానికి యత్నిస్తాడు)

సుభద్ర: ఎవరో మహాపతివ్రత!

డాక్టర్: (Emotionsలో ఉన్నాడు. సీరియస్‌గా) పతివ్రతకాదు, పడుపు కత్తె!

సుభద్ర: ప్రేమలేఖలున్న ఆడ వాళ్ళు పతివ్రతలు కారా ఏం, డాక్టర్?

డాక్టర్: కారు.

సుభద్ర: ఖచ్చితంగా చెప్పారే!

[సుభద్ర డాక్టర్‌ను రెచ్చగొట్టి ఆడిస్తూ ఆనందిస్తున్నది.]

డాక్టర్: చెప్పవయ్యా రావ్, ఎవరా వంచకి?

రావ్: ఆమె...ఆమె...జ్ఞాపకం లేదు డాక్టర్.

సుభద్ర: ఆమె ఎవరో చెపితే ఏం చేస్తారండీ?

డాక్టర్: ఆమె అంతుచూస్తాను.

సుభద్ర: ఆమే మీ అంతుచూస్తే!

డాక్టర్: ఆమెను షూట్ చేస్తాను సుభద్రా.

రావ్: (మళ్ళీ ఒక విధమైన ఉద్వేగం వచ్చింది.) అవును డాక్టర్, ఆమెను షూట్ చెయ్యాల్సిందే. ఆమె తన ప్రేమను మాలతి దగ్గర దాచుకున్నది. దాని ఫలితంగా మాలతి తన ప్రేమను బలి చేసుకున్నది. మా జీవితంలో తుఫాను రేపింది ఆమే డాక్టర్, ఆమెను కాల్చాల్సిందే – కాని నేను కాలుస్తాను. ఆ ఛాన్సు నాకివ్వండి డాక్టర్.

సుభద్ర: ఎవరో ఆడకూతురు – మీ ఇద్దరూ కలిసి ఆమెను అంతపని చెయ్యకండి. తరువాత చిక్కులొస్తాయి.

డాక్టర్: (రావుతో) ఇంతకూ ఎవరివయ్యా ఆ ప్రేమలేఖలు?

రావ్: జ్ఞాపకం వచ్చింది డాక్టర్. ఆమె పేరు...ఆమె పేరు... సుభద్ర!

డాక్టర్: (సాలోచనగా) సుభద్ర!

సుభద్ర: ఉండండి డాక్టర్, కూల్ డ్రింక్ తెస్తాను.

[లోపలికి వెడుతుంది. డాక్టర్ ఆలోచనలో మునిగిపోతాడు.]

డాక్టర్: (అస్పష్టంగా) సుభద్ర, సుభద్ర!

రావ్: అవును డాక్టర్. ఆమె ప్రేమలేఖలు, ఆమె రాసిన ఉత్తరం నాదగ్గరే ఉన్నాయి డాక్టర్!

[కోటు జేబులోనుంచి ఒక ఉత్తరాల కట్ట, ఒక కవరు భద్రంగా బయటికి తీస్తాడు.]

డాక్టర్: ఏదీ, ఆమె రాసిన ఉత్తరం?

రావ్: ఆమె మీకు తెలుసునా డాక్టర్? (ఉత్తరం అందిస్తాడు.)

డాక్టర్: తెలీకపోతే తెలుసుకుంటా మయ్యా!

[ఉత్తరం అందుకుని చదువుకుంటాడు. సీరియస్ అయిపోతాడు. ముఖం జేవురించింది.]

సుభద్ర: (కూల్‌డ్రింక్ తెచ్చింది) ముందు డ్రింక్ తాగండి డాక్టర్.

డాక్టర్: (వెర్రి ఆవేశంతో) సుభద్రా!

సుభద్ర: ఏం డాక్టర్! ఉన్నట్టుండి సీరియస్ అయినారేం? డ్రింక్ తాగండీ. (గ్లాసు అందిస్తుంది. అతను విసిరి కొడతాడు.) డాక్టర్! రావుగారిలానే మీకూ ?......

డాక్టర్: ఏమిటి నాకూ?

సుభద్ర: మెంటల్‌గా అఫెక్ట్ అయిందేమోనని...

డాక్టర్: (కోపంతో) సుభద్రా!

సుభద్ర: (నెమ్మదిగా) అవును, సుభద్రనే!

డాక్టర్: ఈ ఉత్తరం ఎవరిది?

సుభద్ర: చూచినవారు మీరే చెప్పండి, డాక్టర్.

డాక్టర్: ఈ ఉత్తరం నీవురాసిందే.

సుభద్ర: (Careless గా) ఊఁ, రాస్తే...?

డాక్టర్: మాలతి నీ స్నేహితురాలు?

సుభద్ర: ఊఁ, అవుతే—?

• డాక్టర్: ఆ ప్రేమలేఖలు నీవి! వాటిని రహస్యంగా మాలతి దగ్గర దాచుకున్నావు, అవునా?

సుభద్ర: ఓ,అదా మీఅనుమానం! అవును. ఆ ప్రేమలేఖలు నావే. వాటిని మాలతి దగ్గరే దాచుకున్నాను.

డాక్టర్: (ఉండబట్టలేక ఉక్కిరిబిక్కిరి అవుతున్నాడు.) సుభద్రా!

సుభద్ర: అవును డాక్టర్, మీ సుభద్రనే!

రావ్: డాక్టర్, డాక్టర్! ఆమెను క్షమించకండి. మల్లెపందిరిలాంటి మా జీవితం నాశనం చేసింది డాక్టర్.

డాక్టర్: ఎంత సాహసం! ఎంత మోసం!

సుభద్ర: ఎవరి దండీ మోసం? ఏం? ఆడవాళ్ళకు ప్రేమలేఖలుండకూడదా? మీ మగవాళ్ళకు ఉండొచ్చునేం?

డాక్టర్: సుభద్రా! ఎవరితో మాట్లాడుతున్నావో తెలుసా?

సుభద్ర: తెలుసు డాక్టర్. ఒక భార్య, ఒక భర్తతో మాట్లాడుతున్నది.

డాక్టర్: భార్యట భార్య! భార్య కాదు, పడుపుకత్తె.

సుభద్ర: అంతపెద్దమాట అనకండి డాక్టర్. మీకే పరువుపోతుంది!

డాక్టర్: నా పరువు గంగలో కలిపావు గా!

సుభద్ర: మీ పరువు మీరే పాడు చేసుకుంటున్నారు.

డాక్టర్: సుభద్రా! ఇహనిన్ను tolerate చెయ్యను!

సుభద్ర: (నిర్లక్ష్యంగా) చెయ్యొద్దు.

డాక్టర్: నిన్ను నిలువునాకోస్తాను.

సుభద్ర: అదిమీరునిత్యంచేసేపనేగా!

డాక్టర్: సుభద్రా! ఎందుకు నన్నిలా మోసగించావు? కాలేజీ రోజుల నుంచీ నిన్ను ప్రేమిస్తూ వచ్చానే?

సుభద్ర: నేనూ మిమ్మల్ని ప్రేమిస్తూ వచ్చాను.

డాక్టర్ నీవే నా సర్వస్వం అనుకున్నానే?

సుభద్ర: నేనూ అలాగే అనుకున్నాను.

డాక్టర్: నీకోసం అయిన వాళ్ళను, ఆప్తబంధువులను వదులుకున్నానే?

సుభద్ర: నేనూ మీకోసం నా వాళ్ళందరికీ దూరమయ్యాను.

డాక్టర్: చదువులకు దూరదేశాలకు వెళ్ళి కూడా నిన్నే వివాహమాడాలని వేచిఉన్నానే?

సుభద్ర: నేనూ మీ రెప్పుడొస్తారా అని కళ్ళలో వత్తులు వేసుకుని కనిపెట్టుకున్నాను.

డాక్టర్: మన పెళ్ళికి ఎన్ని అడ్డంకులు వచ్చినా ధైర్యంగా ఎదుర్కొన్నానే?

సుభద్ర: నేనూ పరిస్థితులను లక్ష్యపెట్టక ఏటి కెదురీదాను.

డాక్టర్: ఎందుకీ నాటకం ఆడావు సుభద్రా?

సుభద్ర: మీరే ఆడేటట్టు చేశారు డాక్టర్!

డాక్టర్: ఇలా కాదు. (రావ్‌తో) మిస్టర్ రావ్! ఆ love letters ఇలా ఇవ్వు. వాడిఅంతూ, ఈమె అంతూ తేలుస్తాను.

రావ్: No. No నేనివ్వను. ఈ ప్రేమలేఖలే నా జీవితాన్ని అల్లకల్లోలం చేశాయి. వీటిని ప్రాణప్రదంగా కాపాడుకుంటున్నాను. ఇవే నాకు మిగిలింది. వీటిని ఎవరికీ ఇవ్వను డాక్టర్

సుభద్ర: రావుగారూ! ఆ ప్రేమలేఖలు నావి. అవి నా సొత్తు. మర్యాదగా నావి నాకివ్వండి.

రావ్: ఇవ్వను, సుభద్రాదేవిగారూ! నన్ను నాశనం చేసింది మీ ప్రేమలేఖలేగా! ఊరికే వదలి పెడతానా వీటిని? నా మాలతి మళ్ళీ నాకు కనిపించే వరకూ ఇవి ఎవరికీ యివ్వను. మీపై పగదీర్చుకుంటాను. మీరహస్యం రచ్చకెక్కిస్తాను.

సుభద్ర: మీరు పెద్దమనుషు లనుకున్నానే – ఇదేనా మీ పెద్దమనిషి తరహా? నా ప్రేమలేఖలు ముట్టుకోడానికి మీకేం హక్కుంది? అసలు వాటిని ఇంతకాలం ఎందుకు అట్టిపెట్టుకున్నారు? తీసుకున్నవారు తిరిగి ఇచ్చేయవద్దూ? రావుగారూ! ఇదివరకు ఉత్తరం రాశాను. ఇప్పుడు స్వయంగా అడుగుతున్నాను. నా లెటర్సు నాకిచ్చేయండి.

డాక్టర్: మిస్టర్ రావ్! సుభద్ర విషయం నాకు వదిలిపెట్టు. ఆమె విషయం నేను చూచుకుంటాను. ముందా లెటర్సు ఇలా ఇవ్వు. అవి రాసిన రోగ్ ఎవడో తేల్చుకోవాలి.

సుభద్ర: రావుగారూ! మీకు మీ భార్య కావాలా? లేక, నా ప్రేమలేఖలు కావాలా?

రావ్: నా భార్యే కావాలి.

సుభద్ర: అవుతే నా ప్రేమలేఖలు నాకిచ్చేయండి.

రావ్: ఇస్తే!

సుభద్ర: మీ భార్యను మీ కప్పగిస్తాను.

రావ్: (ఆతృతతో) ఏదీ నా మాలతి? ఎక్కడుంది?

సుభద్ర: ఎక్కడుంటే మీకెందుకండీ, అప్పగించేదాన్ని నేనున్నానుగా!

రావ్ : అహాం. ముందు నా మాల తిని నాకు చూపితే, తరువాత మీా లెటర్సు మీా కిస్తాను.

సుభద్ర : తరువాత ఇవ్వకపోతే— ఆc— మీా మాటలు నమ్మేదెవరండీ? అసలే మతిలేని మనుషులు......అలా కాదు. ముందా లెటర్సు ఇవ్వండి. మాలతిని క్షణంలో రప్పిస్తా.

[రావ్ లెటర్సు ఇవ్వబోతాడు.]

డాక్టర్ : మిస్టర్ రావ్! మోస పోతున్నావు. సుభద్ర సామాన్యురాలు కాదు. మళ్ళీ ఎత్తు వేస్తున్నది. లెటర్సు ఇవ్వకు. ఏ సుభద్ర నీ కష్టా లకు కారణమైందో, ఆసుభద్ర ఆయువు పట్టు నీ చేతుల్లో ఉంది. దాన్ని జార విడుచుకోకు రావ్. ఇదివరకు తెలీక దెబ్బతిన్నావు, ఇప్పుడు తెలిసితింటావు. ఉత్తరాలు ఇవ్వకు.

సుభద్ర : రావుగారూ! నామాట వినండి. డాక్టర్‌తో మీాకేం పని? మీాకు బాగుపడడం ఆయన కిష్టంలేదు. మీాకు కావలసింది మాలతి. మీా మాలతి మీాకు దక్కుతుంది. నాలేఖలు నాకివ్వండి రావుగారూ.

[రావ్ సుభద్రకు లెటర్సు ఇస్తాడు]

సుభద్ర : (లెటర్సు తీసుకుని) ఆహా! వీటిని మళ్ళీ ఎన్నాళ్ళకు చూచాను!

[డాక్టర్ గిద్రున వెనక్కు తిరిగి డ్రాయర్లో నుంచి పిస్టల్ తీస్తాడు. సుభద్రకు ఎదురుగా నిలుచుంటాడు.]

డాక్టర్ : సుభద్రా! ఆ ఉత్తరా లక్కడ పెట్టు, పెడతావా పెట్టవా?

సుభద్ర : పెట్టను.

డాక్టర్ : పోనీ, ఆ రహస్య ప్రియు డెవడో చెప్పు.

సుభద్ర : చెప్పను.

డాక్టర్ : సుభద్రా! అన్యాయంగా చనిపోతావు.

సుభద్ర : ఏం, కాలుస్తారా?

డాక్టర్ : కాల్చడం నాకు మంచి నీళ్ళ ప్రాయం.

సుభద్ర : అది తెలుస్తూనే ఉంది.

రావ్ : డాక్టర్, డాక్టర్! ఆమెను కాల్చకండి! ఆమెను కాలిస్తే నా మాల తిని ఎవరు అప్పగిస్తారు?. సుభద్రా దేవిగారూ! ఏదీ నా మాలతి?

సుభద్ర : ఉండండి రావుగారూ! ముందీ ప్రమాదంనుంచి బయట పడని వ్వండి...ఏమండీ డాక్టర్! ఒక ఆడ కూతురు తన పవిత్ర ప్రేమను పొదంగా దాచుకుంటే దాన్ని మీాకు బట్ట బయలు చేస్తారా? ఆవిడ మీాకు ఎంత భార్య అవుతేమాత్రం-ఆవిడా మీాతో పాటు సమానంగా చదువుకున్నది, ఆవిడకూ మీాతోపాటు అంతస్థుఉన్నది. ఆవిడ భద్రంగా దాచుకున్న ప్రేమ లేఖలు చూడాలంటారా? ఆవిడ ప్రియుడిపేరు చెప్పమంటారా? ఒకరి ఉత్తరాలు- అందులోనూ ప్రేమలేఖలు మరొకరు చూడడం manners ఉన్న వాళ్ళు చేసే పనేనా? విదేశాలకు వెళ్ళి వచ్చారే! పెద్ద చదువులు చదువు కున్నారే! ఇదేనా మీా కల్చర్? కాదంటే కాలుస్తారా? ఇదేనా మీా విజ్ఞానం? ఇదేనా మీా న్యాయం?

డాక్టర్ : సుభద్రా ! ఇప్పుడు న్యాయాలతోటీ కల్చర్లతోటీ పని లేదు. ముందా లెటర్సు అక్కడ పెట్టు.

రావ్ : సుభద్రాదేవిగారూ ! ఇహ లాభంలేదు. ఆఉత్తరాలక్కడ పెట్టండి. డాక్టర్ మంచివాడు కాదు. అన్నంత పనీ చేస్తాడు. ఆయనకు కోపం రానే రాదు, వస్తే పోనే పోదు !

సుభద్ర : మీరు ఆగండి రావుగారూ. మీరు ఆటలో out అయి పోయారు !

డాక్టర్ : సుభద్రా ! This is too much! ఇహనిన్ను tolerate చెయ్యను. ఇప్పుడైనా చెప్పు, ఎవడు నీ కా లవ్ లెటర్సు రాసింది? ఎవడా స్కౌండ్రల్?

రావ్ : చెప్పండి సుభద్రాదేవీ, ఎవడా ఫుండాకోర్ ?

డాక్టర్ : ఎవడా పాముతో చెలగాట లాడుతున్నది ?

రావ్ : ఎవడా లీడింగ్ డాక్టర్‌తో పోటీ పడుతున్నది ?

డాక్టర్ : చెప్పు సుభద్రా ?

రావ్ : చెప్పండి సుభద్రాదేవీ ?

డాక్టర్ : వాణ్ణీ, నిన్నూ నిలువునా కోస్తాను.

రావ్ : వాణ్ణీ, మిమ్మల్నీ రచ్చ కీడుస్తాం.

సుభద్ర : (రావ్‌తో) మీకు మళ్ళీ మతిపోయింది, రావుగారూ (డాక్టర్‌తో) మీరు నా ప్రియుణ్ణి నిందించకండి, డాక్టర్! అమంగళం శాంతించుగాక !

డాక్టర్ : చెప్పు సుభద్రా, వాడెవడో చెప్పు. లేదా పిస్టల్ పేలుతుంది!

సుభద్ర : ఏమని చెప్పేది డాక్టర్ ! ఆయన నా ప్రియమైన ప్రియుడు, నా పాలిట దేవుడు !

డాక్టర్ : సుభద్రా!

సుభద్ర : (ప్రేమలేఖలు హృదయానికి హత్తుకుని, కనులు మూసి ప్రేమ అభినయిస్తుంది) ఆగండీ డాక్టర్, ఒక్కక్షణం ఆగండి. ఈ పతితురాలిని కాల్చెద్దురుగాని, కాని కాల్చేముందు—నన్నొక్కక్షణం ఈ పవిత్ర ప్రేమలేఖలు పట్టుకుని నా ప్రియుణ్ణి మనసారా ధ్యానించ నివ్వండి, డాక్టర్ ! తరువాత మీ చేతుల్లో హాయిగా ప్రాణాలు విడుస్తాను.

డాక్టర్ : సుభద్రా ! ఏమిటిది ?

సుభద్ర : ఉండండి డాక్టర్, నా ప్రియుడి మోహనరూపం నా కనుల ముందు పొడగడుతున్నది !

డాక్టర్ : ఏడీ, ఎవడు వాడు ?

సుభద్ర : ఆయన మీకు కనుపించడు. నా కళ్ళకే కనుపిస్తాడు! ఆహా! ఎంత చక్కని ఉలెన్ సూటు వేసుకున్నారు ఆయన ! ఆ హాటు పెట్టుకోడంలో ఎంత సొంపు ఉంది ! ఆ ముఖారవిందంలో ఆనందం తొణికిసలాడుతున్నదే ! విరిసిన కలువల్లా ఆ విశాల నేత్రాలలో స్వర్గం కనుపిస్తున్నదే! ఆ పెదవులపై చిరునవ్వు చింది నాముఖాన పడుతున్నదే ! ఆహా ! ఏమి ఆయన నడకలో ఠీవి ! ఏమి ఆ పలుకులో గాంభీర్యం ! 'ప్రియా, ప్రియా!'... మళ్ళీ పిలవండీ ! అబ్బ ! మీ పిలుపులో ఎంత మాధుర్యం ఉన్నదండీ !

మీ చూపులో ఎంత హాయి ఉన్న దండీ! ప్రియా! జ్ఞాపకం ఉన్నదా? ఒకప్పుడు మనం హనీమూన్‌కు వెళ్లాం. గంగాతీరంలో గడిపాం. మడుగులు కట్టిన ఆ వెన్నెట్లో మనం ఇసుక తిన్నె లపై కూచుని, ఉత్తుంగతరంగాలతో ఊగుతున్న గంగాభవానిని చూస్తూ ఎన్నెన్ని కలలు కన్నాం! ఎన్నెన్ని కబుర్లాడుకున్నాం! జ్ఞాపకం లేదా ప్రియా?

రావ్ : (అయోమయంలో పడి పోయాడు. డాక్టర్‌కు అంతకన్నా ఊపిరాడడం లేదు.) డాక్టర్, డాక్టర్! నాకు మతి ఉన్నదంటారా, పోయిం దంటారా?

డాక్టర్ : ఉండవయ్యా నీవు, నాకు మతిపోయి నేనేడుస్తుంటేనూ!

రావ్ : డాక్టర్! సుభద్రాదేవికి మతిపోయింది. ముందామెకు ట్రీట్ మెంట్ ఇవ్వండి.

డాక్టర్ : సుభద్రా, సుభద్రా! (దగ్గరికివచ్చి తట్టి లేపుతాడు.)

సుభద్ర : ప్రభూ! ఈశ్వరా! జన్మ జన్మాలకూ ఈ నా ప్రియుణ్ణి భర్తగా పొందే వరం ప్రసాదించు. ఇదే నా తుది ప్రార్థన.

డాక్టర్ : సుభద్రా!

సుభద్ర : (కళ్ళు తెరుస్తుంది. ప్రేమలేఖలు డాక్టర్ చేతుల్లో పెడు తుంది.) తీసుకోండిడాక్టర్. నాప్రియుణ్ణి మీ చేతుల్లో పెట్టాను. నా కడసారి ప్రార్థన ముగిసింది. ఇహనన్ను కాల్చంతే. కాని నా ప్రియుణ్ణి మాత్రం ఏమీ అనకండి 'డాక్టర్!

[డాక్టర్ సీరియస్‌గా ఆ లేఖలు చదువు కుంటాడు. క్రమక్రమంగా అతని ముఖకవళి కలు మారిపోతాయి. సుభద్ర ఆయన్ని గమ నించీ గమనించనట్లుంటుంది. రావ్ ఏదో అర్థం కాని వెర్రివానిలా ఒక భంగిమలో ఉంటాడు. తరువాత డాక్టర్ ఆ లెటర్సు టేబిల్‌మీద పడేసి, ఒక్కమాటుగా పొట్ట చెక్కలయేటట్లు నవ్వడం మొదలు పెడతాడు.]

రావ్ : డాక్టర్, డాక్టర్! ఎందు కండీ నవ్వుతారు? (డాక్టర్ రావ్ వంకచూస్తూ ఒక భంగిమ పెట్టి మరో మాటు బిగ్గరగా నవ్వుతాడు.) ఏమైందీ చెప్పండి డాక్టర్!

డాక్టర్ : మన ఇద్దరం ఫూల్సుం అయినామయ్యా! మన ఇరువురినీ ఫూల్సును చేసింది సుభద్ర!

రావ్ : అదేమిటి డాక్టర్!

డాక్టర్ : అది అంతేనయ్యా, సుభద్ర నిన్నూ నన్నూ ఒక ఆట ఆడించింది. ఇరువురం ఆవిడచేతుల్లో చిత్తయిపోయాం!

రావ్ : ఏం డాక్టర్? ఆ ప్రేమ లేఖలు ఆమెవి కావా?

డాక్టర్ : ఆవిడవేనయ్యా.

రావ్ : మరి?

డాక్టర్ : మిస్టర్ రావ్! ఇంకా నీవు మైకంలోనే ఉన్నావుటయ్యా. ఆ ప్రేమలేఖలు ఆవిడకు నేనేరాశాను!

రావ్ : మైగాడ్! What a wonder it is! మీ కథా అడ్డం తిరిగిందే, డాక్టర్!

డాక్టర్ : నీ కథ, నా కథ-కథంతా కామెడీ అయిందయ్యా, మిస్టర్ రావ్!

రావ్ : అవుతే డాక్టర్, ఆ లెట ర్సులో సంతకం "జానీ'అని ఉందేమిటి?

డాక్టర్ : అవునయ్యా, నేను ఇంగ్లండులో ఉన్నప్పుడు ఆమెకు ఆ పేరుతోనే లెటర్సు రాసేవాణ్ణి. సుభద్ర నాకు పెట్టిన ముద్దుపేరది !

రావ్ : What a wonder it is!

డాక్టర్ : సుభద్రా ! What a silly girl you are ! ఎంత నాటకం ఆడావు !

సుభద్ర : బంతి నాకు చిక్కిందీ, మీ ఇద్దరూ పెద్ద హీరోస్‌లా నిలుచున్నారూ— ఆడాను; ఇద్దర్నీ గోల్ చేశాను. అయినా డాక్టర్, ఏం మగవాళ్ళండీ మీరు ! ఇంతసేపూ ఇద్దరూ ఆవేశపడతారే కాని ఆలోచించుకోరేమండీ ?

డాక్టర్ : కరెక్టుగా చెప్పావు. ఆలోచన వదిలి ఆవేశంలో పడ్డాం. ఏమైనా సుభద్రా ! నీ ప్రదర్శన అద్భుతంగా ఉంది. నీ గెలుపుకు ఏం ప్రైజ్ ఇవ్వమంటావో చెప్పు ?

సుభద్ర : నా ప్రేమలేఖలు నాకిచ్చెయండి డాక్టర్. అదే నే కోర్కే ప్రైజ్.

డాక్టర్ : ఆల్‌రైట్, ఇచ్చేశాం. వాటిని భద్రంగా పెట్టెలో పెట్టుకొని పూజచేసుకో...అన్నట్లు సుభద్రా ! ఆ లెటర్సు మాలతి కెందుకిచ్చావు ?

సుభద్ర : మన మేరేజీకి ముందు మా ఇంట్లో పెద్ద గొడవలు రాలేదుటండీ? అప్పుడు ఎందుకైనా మంచిదని వాటిని మాలతికి దాచమని ఇచ్చాను. మన వ్యవహారాలన్నీ సెటిల్ అయిన తరువాత తిరిగి పంపమని రాశాను. ఇంతలోనే ఇంత మునుదు ముంచుకొచ్చింది...ఉండండి. అరిచీ అరిచీ అలసిపోయారు. డ్రింక్స్ తెప్పిస్తాను. రామన్నా, రామన్నా !

రామన్న : (వెలుపల్నుంచి) వస్తున్నా అమ్మా! (వస్తాడు.)

సుభద్ర : లోపల ఫ్రిజిడేర్‌లోనుంచి మూడు డ్రింక్స్ పట్రా రామన్నా.

రామన్న : అలాగే నమ్మా (లోనికివెడతాడు.)

రావ్ : సుభద్రా దేవి గారూ, అంతా బాగానే ఉంది. కాని మాలతి ఏదండీ ?

డాక్టర్ : సుభద్రా! అన్నట్లు ఆ అమ్మాయి ఎక్కడ ?

సుభద్ర : మనవాళ్ళింట్లో ఉంది. 2527 ఫోన్ చెయ్యండి డాక్టర్. మొన్న మనింటికి రాలేదూ ? ఆ అమ్మాయి !

డాక్టర్ : ఓ, అలాగా! నాకు తెలీదే. అవుతే నీవే ఫోన్ చెయ్యి, సుభద్రా.

రావ్ : (ఆతృతతో) సుభద్రా దేవిగారూ! మాలతిని చూడాలి. త్వరగా ఫోన్ చెయ్యండి.

సుభద్ర : ఉండండి రావుగారూ. అన్నిటికీ అంత తొందరయితే ఎలాగ ? ఆమెకు ఫోన్ చెయ్యాలి, చెప్పాలి; ఇక్కడికి తీసుకరావాలి, ఆపిల్లకు మీరు అపాలజీ ఇవ్వాలి—ఇంత తతంగం ఉంది. అన్యాయంగా అవమానించి వెళ్ళగొట్టిన భార్య ఊరికే వస్తుందటండీ.

రావ్ : సుభద్రాదేవిగారూ ! నా మాలతికి ఒకటికాదు, వెయ్యి క్షమాపణలు చెప్పుకుంటాను. ముందామెను

చూడాలి. త్వరగా పిలిపించండి, సుభద్రా దేవిగారూ.

డాక్టర్ : పిలిపించు సుభద్రా! లేకపోతే మళ్ళీ అతనికి మైండ్ upset అవుతుంది! (రామన్న డ్రింక్స్ తెచ్చి టేబిల్‌మీద పెడతాడు.)

సుభద్ర : ముందు డ్రింక్ తాగండి డాక్టర్. మీరుకూడా రావుగారూ... (ముగ్గురూ డ్రింక్స్ తాగుతుంటారు.) ఏం డాక్టర్ ? రావ్‌గారికి ఇంకా ట్రీట్‌మెంట్ ఇవ్వాలా ?

డాక్టర్ : ఇంకా ట్రీట్‌మెంట్ ఎందుకు సుభద్రా ! అతని మనోవ్యాధికి మాలతే ట్రీట్‌మెంట్... ...అంతేనా మిస్టర్ రావ్ ?

రావ్ : అవును డాక్టర్. మాలతి పోవడంతో నామనస్సు మసకబారింది. మాలతి రావడంతో నాజీవితంలోకి మళ్ళీ సిరివెన్నెల వచ్చింది.

డాక్టర్ : (నవ్వుతూ) మిస్టర్ రావ్! నీ చెయ్యి ఆపరేషన్ చెయ్యొద్దూ మరి? (సుభద్రకూడా నవ్వుతుంది.)

రావ్ : కొంపతీసి అంతపని చెయ్యకండి డాక్టర్. నా కిప్పుడే ఆపరేషన్ అవసరంలేదు.

సుభద్ర : మళ్ళీ మంపులు, మతిభ్రమ మాటలు రావుకదా ?

రావ్ : లేదు సుభద్రాదేవిగారూ. మబ్బులన్నీ విడిపోయాయి. డాక్టర్ ! మిమ్మల్ని చాలా శ్రమపెట్టాను. మీరు నాపట్ల చూపిన శ్రద్ధకు ధన్యవాదాలు.

డాక్టర్ : ఆమాట సుభద్రకు చెప్పవయ్యా రావ్.

రావ్ : అవును డాక్టర్. వారికి కూడా...నన్ను మళ్ళీ మనిషిని చేశారు. ...నాకు మసిపించిన మైకంలో ఏమేమి వెర్రిమాటలన్నానో – నన్ను క్షమించండి.

సుభద్ర : రావుగారూ ! కష్టాలు అందరికీ వస్తాయి. కాని కొన్ని కష్టాలు మన తెలివితక్కువవల్ల కొనితెచ్చుకుంటాం రావుగారూ. మనం తెలివిగా సంచరిస్తే వాటిని తేలిగ్గా దాటవచ్చు. ఆడవాళ్ళను అంత చులాగ్గా అనుమానించకూడదు రావుగారూ. అంత తొందరపాటు, ఆవేశం ఎప్పుడూ పనికిరావు. వాటివల్ల ఎన్నో చిక్కులొస్తాయి...ఈమాట మీకు కూడా చెబుతున్నా డాక్టర్

డాక్టర్ : థ్యాంక్స్, ఒప్పుకున్నాం.

సుభద్ర : మీరనుకున్నట్లు మీ కష్టాలకు నేనూకొంత కారణమయ్యాను రావుగారూ. మళ్ళీ మీ భార్యాభర్తలు కలుసుకోడంతో నా కర్తవ్యం నెరవేర్చిన-దాననయ్యాను. నాకు మన శ్శాంతి ఏర్పడింది. ఆ అమ్మాయి మీకోసం కలవరిస్తున్నది రావుగారూ. నేనుండబట్టి సరిపోయింది కాని లేకపోతే ఏమయ్యేదో !

డాక్టర్ : త్వరగా ఫోన్ చెయ్యి సుభద్రా. (డ్రింక్స్ తాగడం పూర్తి అవుతుంది.)

సుభద్ర : చేస్తున్నానండీ ... మన రామన్ననిచ్చి కారుపంపండివాళ్ళింటికి.

డాక్టర్ : ఓయెస్ .. రామన్నా ! డ్రైవర్‌ను కారు బయటపెట్టమను.

రామన్న : చిత్తం బాబయ్యా! (వెలుపలికి వెడతాడు.)

సుభద్ర : (ఫోన్‌దగ్గరికి వెడుతూ) ఏమైతేనేం, బ్రహ్మాండంగా మబ్బు పట్టింది. ప్రళయంగా ఉరిమిందికూడా. కాని చివరకు చినుకుపడకుండానే తేలి పోయింది, మాయమబ్బు !

[ఫోన్ దగ్గరికి వెళ్ళి ఫోన్ ఎత్తింది. రావ్ ఫోన్‌కు కొంచెం ఎడంగా నిలుచుంటాడు. డాక్టర్ మరోవైపు ఒక angle లో నిలుచుని పైప్ కాలుస్తుంటాడు.]

(ఫోన్‌లో) హలో, హలో! ... ఆఁ ఎవరూ ? శంకరం ? ..... ఆఁ ..... సుభద్ర! ... మాలతిని పిలువు ... ఆఁ... ఆ అమ్మాయే ..హలో ! ... ఆఁ...మాలతీ ! ఆఁ...నేనే, సుభద్ర! ఆఁ... మీవారొచ్చారమ్మా!... ఆఁ షాక్ తినేవు ! పరాచకాలుకాదు, నిజం .. పిచ్చిపిల్లా! ఆ సంతోషంలో ఫోన్ పగులగొట్టేవు !...ఆఁ రామన్న నిచ్చి కారు పంపుతున్నా. వేగిరం వచ్చేయ్ ... ఆఁ ... మరేం కంగారు లేదు. ఆయనకేమమ్మా, ధోరలా వున్నాడు ! కాని మాకుమతులుపోయే ట్టు చేశాడు ! ఆఁ ... ఓ. కె.

[ఫోన్ పెట్టేస్తుండగా]

(తెర)

[ఒక హంగేరియన్ కథ ఆధారంగా]

మధువిడంబనము

కరి యిచ్చె నర మేసి కరిణికి సల్లకీ పల్లవ మ్ముల్లంబు పల్లవింపఁ
మృగమర్థిఁ గబళించి మృగికిచ్చె నంచు దర్భాంకురంబులు చిత్త మంకురింపఁ
హంస పెకు్కవనిచ్చె హంసికి నోరొ్ల్నెర నెలదూఁడు మొగముల నెలమి మిగులఁ
భృంగము దావితో భృంగికి దయనిచ్చె మధుధార ముఖరాగ మదము దలఁకఁ

గిన్నరుండు గ్రోల్చెఁ గిన్నరి వీనుల రాగ రసము మేన రాగ మెసగ
మధు విడంబనమున మగలును మగువలు విరలి గొనిరి మదన పరవశమున

—నన్నెచోడ మహాకవి.

అల్లసాని వాని అల్లిక జిగిబిగి

కవి సమ్రాట్, శ్రీ విశ్వనాథ సత్యనారాయణ, ఎం. ఏ.

---

1. అద్యతనాః కేచి దిహ ప్రజ్ఞాపారమ్య మభినయంతి సదా
పరభాషా పరికల్పిత శిక్ష్యాభ్యోహేషు క్లృప్తముఖాః

2. శీల ఇతి కవే ర్జీవిత గాథా ప్రతి ఫలన మితి నవ పథీనాః
నిర్మ్లిష్ట ధ్వని మార్గాః గర్జంతి నిరంబు జలదాభాః

3. గీర్వాణీ సమలక్షణా సకలధా త్రైలింగ భాషావధూః
తాంవాణీంచ వచః ప్రమాణధిషణాః గీర్వాణవాణీం యథా
స్వైస్వైర్గాఢ విమర్శనాధ్వ పటుభి ర్వ్యాకృత్య ర్ష చాదీపయన్
వ్యాచిఖ్యాసు రహం త్రిలింగవచసాం కేషాం కవీనాంమతీః

4. అభినవగుప్తో మమ్మట ఉజ్జ్వలధీకో మహాన్ జగన్నాథః
గీర్వాణ సుకవి కావ్యాన్ మమంథు రతి దేవ గురు మతి ప్రతిభాః

5. క్వ తే సకలశాస్త్ర నిర్మథన ధీ మహా భూభృతః
క్వ చాహ మణుభూత ధీ పరిణతాల్పవాచాంపదం
తథాపిచ వివర్తనం పటుతరాంధ్ర వాచాంద్యుతేః
కృతం న పటుశాస్త్ర విద్భి రితి ధైర్యతో యత్నవాన్

6. మయా వ్యరచి పూర్వమేవ ఖలు నన్నపార్యోజ్జ్వల
త్కథా కలిత సుప్రసన్న ఫణితి స్సుశిల్పాకృతిః
పున ర్విరచయామితావదిహ పెద్ద నార్యోజ్జ్వల
త్కథా కలిత సుప్రసన్న ఫణితిం సుశిల్పాకృతిం

౧

పెద్దన్నగారికి 'ఆంధ్ర కవితా పితామహుఁ'డని బిరుదు శ్రీకృష్ణదేవరాయల వారిచ్చినది. కృష్ణరాయఁడు విద్వత్ప్రభువు, భావుకుఁడు, సహజముగా గొప్పకవి. ఆ ప్రభువునకు తత్పూర్వమున కవిత్రయము పోతన్న శ్రీనాథుఁడు మొదలైన మహానుభావులున్నారని తెలియదా? నాచన సోమన్న యున్నాఁడని తెలియదా? పెద్దన్నకే బిరుదిచ్చుటయేమి? తాను వైష్ణవ ప్రభువు. పెద్దన్న కూడ వైష్ణవుఁడే. ఈ యభిమానము చేత నిచ్చెనా?

లేదా - ఆంధ్ర కవిత యనగా, కృష్ణరాయని యభిప్రాయము వేఱా? తత్పూర్వకవులందఱు సంస్కృత కావ్యములను తెలుఁగు చేసిరి. తొలు దొల్త స్వతంత్ర కావ్యమును తెలుఁగులో పెద్దన్న గారే వ్రాసిరి. అందుచేత నిచ్చటినుండియే యాంధ్ర కవితా ప్రారంభ మనియా? పెద్దన్నగారును మార్కండేయ పురాణములోని కథను స్వీకరించియే వ్రాసిరి. పూర్వ కవుల తెల్గుసేతయు మక్కికి మక్కిగా లేదు. కనుక నిదియే యాంధ్ర కవితా సమారంభ మనుటకు రాయలవారి బుద్ధిలో పద్య రచనయని కాదు, తెలుఁగు సేతయని కాదు - స్వతంత్ర కావ్య మనిపించుకొదగిన యాంధ్ర పద్య

గ్రంథమని నిర్ణయము చేసికోవచ్చును. ఇచట ప్రాధాన్యము కావ్య శబ్దమునకు. ఈ లెక్కను భారతము కావ్యముకాదా? పెంపులు తగ్గింపు లున్నను తెలుగులో స్వతంత్ర కావ్యము కాదు. శ్రీనాథుని నైషధముకాదు. భాగవతమును గాదు.

కావ్యలక్షణములు పట్టించినచో మను చరిత్రయే ప్రథమ కావ్యము. ఒక గ్రంథమును కావ్యముగా నిర్ణయించ వలసినప్పుడు ప్రసిద్ధమైన మార్గమొకటి కలదు. ఏక రసాశ్రయమైన కథ. శృంగార రసమైనచో నాయికా నాయకులు, తదితర రసములకు తత్తదుచిత లక్షణములు. ప్రధాన రసము, అంగరసములు, వాని పోసగింపు. నాయక లక్షణము మొదలైన వాని పరామర్శ. ఇది ప్రసిద్ధ మైన కావ్యలక్షణము.

రెండవది ప్రసిద్ధమైనదికాదు. అనగా బహు జనులచేత పర్యాలోచింపఁ బడుచున్నది కాదు. ఒక్కొకపుడీ రెండవ లక్షణము మొదటి లక్షణము గల కావ్యమునిండ నిండియుండ వచ్చును. ఈ కావ్యలక్షణము కావ్యశిల్పముతో కూడినది. శిల్ప శబ్దము సునిర్దిష్టార్థకము కాదు. శిల్పమన్న మాట సారస్వతములోనికి గౌణార్థముగా తెచ్చికొన్నది కాని, సారస్వతమునకు సహజమైనది కాదు. తన కావ్యము శిల్పమని తిక్కన్న చెప్పినాడు. అచ్చటనైన నింతే. శబ్దము నూతనము కాని ఏ యర్థము నుద్దేశించి యాశబ్దము వాడబడుచున్నదో, ఆ యర్థము కావ్య దృష్టిచేత నూతన మైనది కాదు. మొదట కావ్య లక్షణముగాఁ జెప్పిన దానియందును శిల్ప శబ్దము ప్రయోగింప వచ్చును. రసభంగము లేకుండ, ఔచిత్య భంగము లేకుండ చేసిన రచన శిల్పము కాదనటకు వీలులేదు. కాని ఈ శిల్ప శబ్దార్థము తదితరములైన విశేష విషయములయందు సమన్వయ పఱచుట యధిక సమంజసము. రసౌచిత్యాదిశబ్దము లున్నప్పుడు శిల్ప శబ్ద మెందులకు? దానినేశిల్ప మన్నచో మాకభ్యంతరములేదు కాని శిల్ప శబ్దము తదితరములైన వానియందుపయోగించుట న్యాయ్యము.

తదితరములైన వేవియో యున్నవన్న వానికి వేఱే పేర్లు లేవా? అన్నచో, వానికి నున్నవి. సూచ్యార్థ సూచనము, గండము, మొదలైనవి కలవు. అవి రూపక లక్షణమునందు చెప్పబడియున్నవి. వానిని కావ్యమునందు ప్రయోగించవచ్చును. ఇచట నివి ప్రయోగింప రాదను నిబంధన లేదు. మఱియు శిల్పమని మనము చెప్పిన విషయము బహుధాప్రపంచితమైన యలంకార శాస్త్రములో నేదో యొక విషయము కావచ్చును. అప్పుడు దీనికి ప్రత్యేకముగా నీశిల్ప మన్న పేరేమి?

దాని శిల్పమిది. మహాకవి తాను స్వీకరించిన వస్తువునకు పరమోచితములైన తత్తన్మహా విషయముల యందలి సామగ్రీ సంపాదనము చేసి తన కావ్యము పరమ శిల్పఖండముగా చేయును. ఈ కావ్య సౌందర్య మధికముగా భాసించుట తత్తద్భిన్న విషయ సంగ్రహణము చేత నగును. అప్పు డది శిల్పమని చెప్పవచ్చునేమో!

ఈ శిల్ప మన్నమాటయే 'అల్లిక జిగిబిగి'లో నున్నది. ఈ మాట ప్రసిద్ధ చాటువులోనిది

'అల్లసానివాని యల్లిక జిగిబిగి, ముక్కుతిమ్మనార్యు ముద్దుపల్కు
పాండురంగ విభుని పద గుంఫనంబును.........'

ఇందులో మువ్వురు కవుల మూడు లక్షణములు చెప్పఁబడినవి. స్థూలముగా చూచినచో నీ మూడు లక్షణములు వారి కవితా శైలులను సంబంధించినట్లుగానే కన్పించును. ముక్కుతిమ్మన్న 'ముద్దుపలుకు' పలుకు పోడిమిని చెప్పుచున్నది. 'పదగుంఫనము' పలుకు పోడిమిని చెప్పుచున్నది. అందుచేత 'అల్లిక జిగిబిగి'యు పెద్దన్నగారి శైలిని గుఱించియే చెప్పినది కావలయును. ఐనచో పెద్దన్న శైలిలో 'జిగిబిగి' కలదా? జిగిబిగి ఒక్కశబ్దమా, రెండు శబ్దములా? జిగి యనగా కాంతి, బిగి యనగా బిగువు. జగి బిగులు కావలె. లేదా సమాహారద్వంద్వము చేసి యేకవద్భావ మనుకొనవలె. కాని లోకములో నీ శబ్దమును చిక్కగా నున్న పరిస్థితికి చెప్పుట కలదు. "అది యెంతయు జిగిబిగి గా నున్నది" అని లోకము. రెండును రెండు శబ్దములైనచో, నీ రెండు గుణములు పెద్దన్నగారి శైలియందు కలవు. ఆయన సర్వ రచనయు కాంతితో కూడిన బిగువుకలదియే. ఈ జిగిబిగియే పురాణ కవిత నుండి కావ్యకవితను వేఱు చేయునది. ఇది వేఱ విషయము.

ఈ శబ్దార్థ మింతటితో పర్యవసించదు. పెద్దన్నగారి కావ్యరచనా శిల్పమును గూడ స్పృశించుదు. ఎందుకు స్పృశించ వలయును. స్పృశించినచో చాటు పద్య కర్తయొక్క మనో లక్షణమునకు భిన్నము కాదు. అతని మనో లక్షణము చూడుడు.

'పాండురంగ విభుని పదగుంఫనము'

పాండురంగ విభుఁడెవడు ? పాండురంగ మాహాత్మ్యము వ్రాసినది పాండురంగ విభుఁడా? ఆ పాండు రంగఁడే పాండురంగ మాహాత్మ్యమ వ్రాసెనా? అతని తాత్పర్యము తెనాలి రామకృష్ణ కవి యని. అతని తాత్పర్యము వేఱు, వేసిన శబ్దము వేఱు. అల్లసానివాఁడు, ముక్కు తిమ్మనార్యుఁడు, మూఁడవ కవివద్దకు వచ్చు వేళకు పాండురంగ విభుఁడయ్యెను. అట్లే ముద్దుపలుకు, పదగుంఫనము, అల్లిక జిగిబిగి దగ్గఱకు వచ్చునప్పటికి వట్టి శైలికాక మఱియొక్కటి కావచ్చును. పైగా-అల్లిక, కూర్పు. ఈ రెండు మాటలున్నవి. కూర్చుట యన్న యర్థములో అల్లిక శబ్దము వాడము. అల్పములైన విషయములను, ఒక చిన్న సందర్భములోని భిన్నాంగములను జతపఱచుట కూర్పు కావచ్చు. అల్లికయనఁగా నట్టిది కాదు. దేనికది ప్రత్యేకత గలిగిన- సమాన విషయములు కావచ్చును- విషయములను దీసికొని, పెద్ద వస్తువుగాఁ దీర్చుట పే రల్లిక. విడివిడి దారములతో నొక పట మల్ల వచ్చును. విడివిడి తుంగలతో చాపనల్లవచ్చును చాపను గూర్చెనని గాని, పటముఁ గూర్చెనని గాని యనుటలేదు. పద్యమును గూర్చుట యనిన రమ్యతకలదు. పద్యము నల్లుట యనినచో నంత రమ్యముకాదు కాని పద్యము నల్లుటయని కవులు వాడిన ప్రదేశములు కలవు. అచ్చటనైన పద్యము నల్లుటయని యెవ్వరు వాడలేదు. పద్యము లల్లుటయని బహువచనము తోడనే వాడఁబడినది.

అందుచేత నీ యల్లికయన్న శబ్దము కావ్యరచనా శిల్పసంబంధిగాని పద్యరచనా శిల్ప సంబంధికాదు. కాని ఇచట ప్రత్యేకాన్వయము చెప్పనచ్చు ననవచ్చును అట్లయినను మాకు విప్రతిపత్తిలేదు.

అందుచేత నల్లిక యన్నది కావ్యగత మహాశిల్పమునకు జిగిబిగి యన్నది దానిలోని చిక్కనకు లక్షకములుగా పర్యవసితమైనవి. శిల్పమన్నమాట వేఱే యర్థములో నేను చెప్పుచుంటిని గదా! తచ్ఛబ్దార్థము సర్వవిమర్శనము జరిగిన తర్వాత దానియంతట నదియే యవగతము కాగలదు.

ఈ గ్రంథము మను చరిత్ర మని ప్రావాహికముగా నున్నను, స్వారోచిష మను సంభవము దీని పేరు. పెద్దన్న గారే "అభ్యుదయ పరంపరాభివృద్ధిగా నా యొనర్పం బూనిన స్వారోచిషమను సంభవంబను మహా ప్రబంధంబునకు" అని చెప్పినారు.

"మనువులలో స్వారోచిష మను సంభవ మరయ" ననియు తత్పూర్వము చెప్పఁబడినది. ఇది మను సంభవము. కుమార సంభవమువంటిది. మనువు పుట్టుకకు హేతువులైన తత్పూర్వ కథా సంతతులను చెప్పు కావ్యముగాని మనువును గుఱించి చెప్పు కావ్యముగాదు. కుమారసంభవము వంటిదిగూడ కాదు కుమారసంభవము ప్రధానముగా పార్వతీపరమేశ్వరుల సంయోగకథన కావ్యము. తత్సంయోగ హేతుకమైన మన్మథ దహనాదులతో ప్రారంభింపవచ్చును. ఈమను సంభవము స్వారోచిషమనువు తండ్రియైన స్వరోచియు, నతనిభార్యయు - వారి సంగమ కథ కాదు. స్వారోచిషమనువు స్వరోచి పెండ్లియాడిన ముప్వురు భార్యలందును పుట్టినవాడు కాదు. మనోరమయందు విజయుండును, విభావసియందు మేరునందనుండును, కళావతియందు విభావసుండును నను ముప్వురు పుత్రులు స్వరోచికి జనియించిరి. వారు వేఱువేఱు రాజ్యములకు రాజులయిరి. ఈ స్వారోచిషుఁడు వనదేవతకును స్వరోచికిని బుట్టినవాఁడు.

స్వరోచి వరూధిని కొడుకు. వరూధినీ గంధర్వ సమాగమము వలన గలిగినవాఁడు. స్వారోచిష మనువు స్వరోచికి వనదేవతయందు పుట్టుట ఈ కావ్యమునందు పది పద్యములలో చెప్పఁబడిన కథ. దీనికి మనుసంభవమను పేరెందులకు ?

శిల్పము రెండులక్షణములు కలదని పూర్వము చెప్పితిని. ఇది రెండవ లక్షణమని చెప్పితిని. అనఁగా కావ్యనిర్మాణ కౌశల్యముచేత నొక విలక్షణమైన శిల్పము సంపాదించుటచేత, కావ్యమునం దేకవాక్యతను కల్గించుట. ఇది యిచ్చటి శిల్పలక్షణము.

ఈ ఏకవాక్యతా సంపాదక శిల్పమును మఱియొక వ్యాసమునందు ప్రపంచింతును, తొలుత కావ్యారంభమును పరిశీలించినచో ఆ త్రోవ కొంత సుగమ మగును.

ఈ గ్రంథమునకు తొలుత నైదుపద్యములు దేవతాస్తోత్రములు కలవు.

"ఆశీర్నమస్క్రియావస్తు నిర్దేశో వా తన్ముఖమ్" అన్నారుకదా! ఇది నమస్క్రియా రూపకమైనది. మొదటి పద్యమునందు విష్ణుమూర్తిని, రెండవపద్యమునందు బ్రహ్మను, నాల్గవ దానియందు విఘ్నేశ్వరుని, కవి, స్తోత్రముచేసి యున్నాడు. ఐదవది సరస్వతీ స్తోత్రము. ఇవి స్తోత్రములే కాని, యథార్థమునకు కృతినాయకుని నాశీర్వదించుట.

శిల్ప మనఁగా నొకమాటలో చెప్పినచో బహ్వర్థము లేకత్ర సమావేశపఱచి, పఠితయొక్క మనస్సును భావనా మయము చేసి, ఉత్పథమునందు సంచరింపఁజేయుట. ఈ బహ్వర్థములు బహు మార్గముల సంధాన పఱచవచ్చును. అది కవియొక్క నైపుణిమీఁద నాధారపడి యుండును.

సరస్వతీ ప్రార్థనము వదలి తక్కిన నాల్గు ప్రార్థనములను పరిశీలింతము. బ్రహ్మను చేసిన స్తుతిలక్షణము వేఱు. తక్కిన మూఁడు వేఱు. హరిహర వినాయకుల స్తుతులు మూఁడును భ్రాంతి మీఁద నిర్మింపఁబడిన స్తుతులు. బ్రహ్మ స్తుతిలో భ్రాంతిలేదు. కాని భ్రాంతిలేని యీ బ్రహ్మ స్తుతి వినాయక స్తుతి పూర్వము, హరిహర స్తుతి పరము. భ్రాంతి మదలంకారము సంయోజనము సేయుచు రెండు స్తుతులు వ్రాసి, మూఁడవదానియందు వదలిపెట్టి, నాల్గవదానియందు మరల నెత్తికొనుట యెందుకు?

ఈ భ్రాంతులలో భేదము చూతము. మొదటిది లక్ష్మీదేవి కుచ కస్తూరికా చిహ్నము హరి యొక్క ఱొమ్మునఁ జూచి సనక సనందనాదులు లక్ష్మితోపాటు భూదేవినిగూడ పెట్టెనేమోయని పడినభ్రాంతి భ్రాంతి సనకసనందనాదులయందు.

ఈ భ్రాంతి నిశ్చయము. అనఁగా వారు నిశ్చయముగా భ్రాంతి పొందిరి.

రెండవది అర్జునునకు పాశుపతాస్త్ర మిచ్చుచున్న హరుని పార్వతి ఉల్లసమాడినది: "నీ కుఱ ములో దయకనిపించిన"దని. శివుఁడు మాయాభిల్లుడు కాని యథార్థ భిల్లుఁడు కాడు—అని పార్వతికి తెలియును. శివునకును దెలియును. ఇది వట్టి పరాచికము. అయథార్థమని యిద్దఱికిఁ దెలిసినప్పుడు గాలిలోని పరాచికము.

నాల్గవపద్యములో వినాయకుఁడు తల్లి చనుబాలు త్రాగుచున్నాడు. బాల్యాంక విచేష్ట చేత తుండమున నవ్వలి చన్ గబళింపఁబోయినాడు ఆ వంక కుచంబుఁగానలేదు. అహి వల్లభ హారమును జూచినాడు. మృణాళాంకుర శంకతో తాకినాడు. ఇది భ్రాంతి.

మొదటిది భ్రాంతి మదలంకారము. రెండవది విషమాలంకారము. మూఁడవది భ్రాంతి. అన్నింటికి మూలభూతమైనది భ్రాంతి విశేషము. సర్వాలంకారము లుపమా మూలకములు. మొదటిది వరుసపొందిన భ్రాంతి, రెండవది హేల, మూఁడవదియు భ్రాంతియే. ఈ వరుసలో నెందుకు చెప్పఁబడెను? నడుమ బ్రహ్మస్తుతియున్నది.

ఈ కావ్యమునందు తొలుత ప్రవరాఖ్యునికథ. అందులోనిదే గంధర్వునికథ. అటువాల స్వరోచికథ. చివరకు మనువుపుట్టుట. ఈనాల్గు విషయములకూడిక ఈ మహాప్రబంధము.

వరూధిని ప్రవరాఖ్యునిచేత నిరాకరింపఁబడినది. గంధర్వుఁడు మాయాప్రవరాఖ్యుఁడుగా వచ్చెను. అతనియందు ప్రవర భ్రాంతి పొందినది. వాఁడు ప్రవరుఁడు కాఁడు; ప్రవరుని

ముద్రకలవాఁడు; లక్ష్మీదేవి కుచ కస్తూరికా చిహ్నమువలె. వరూధిని సనకసనందన స్థానీయురాలు. ఆ పడినభ్రాంతి పరమేశ్వర విషయము. పద్మవారు మహర్షులు. వరూధిని, గంధర్వునియందు ప్రవరభ్రాంతి పొందినచో నామెయొక్క ఋషుల మనోనైశ్చల్యమువంటి పరమ శ్రీ భావనా నైశిత్యమునకు లోపములేదు.

ఇక్కడికి ప్రవర వరూధినుల కథ "శ్రీ వక్షోజ" పద్యముతో స్ఫురింపఁజేయఁ బడినది.

పార్వతి శివునితో నుల్లసమాడుట గంధర్వ వరూధినుల హేలావిశేష సూచకము. ఇది విషమాలంకారము. విరూప కార్యోత్పత్తి విషమాలంకారము. ఈ విరూప కార్యోత్పత్తి స్వరూప మెట్టిది? పైకి కనపడుచున్నదికాదు. లోని యథార్థము యథార్థముగానే యుండుట. శివుఁడు మాయాభిల్లుఁ డగుట కాదు. శివుఁడు శివుఁ డగుటయే యాయన దయకు హేతువు. వరూధిని కన్న సంతానము గంధర్వునకు కనలేదు. ప్రవరునికే కన్నది ఇది ఇందులోని రహస్యము.

"మున్ను విప్రాకారమునఁ గూడుచో శంక
గను మాయఁబనిచె నా ఖచరభర్త,
యవ్వారారోహయు నాసక్తగావున
నిచ్చలో నటుసేయ నియ్యకొనియె,
నా ప్రతిజ్ఞా పూర్తి యయ్యెఁదనంత న
వ్వనితకు రతి పారవశ్యపటిమ,
నపుడు తత్ప్రవర దేహసమిద్ధ శిఖిదీప్తి
శాంబరీ మహిమచే సంగ్రహించి

నట్టి గంధర్వమూర్తి సౌఖ్యానుభూతిఁ
జలనమేదిన మానసాబ్జమున నిలువ
నెలసెఁ దేజోమయంబైన వృద్ధి నట్టి
మేటి గర్భంబు నెలలు తొమ్మిదియు నిండె.

గంధర్వుఁడు శాంబరీ మహిమచేత ప్రవర దేహ సమిద్ధ శిఖి దీప్తిని సంగ్రహించినాడు. ఆ శిఖిదీప్తి వరూధిని యొక్క చలనములేని మానసాబ్జమున నిలచినది. ఇది రహస్యము. వరూధినీ సంతానము గంధర్వసంతానముకాదు, ప్రవరసంతానము. ప్రవరుఁడు వట్టి ప్రవరుఁడుగాఁడు. శిఖిమూర్తి. సర్వవేదముల యందును చెప్పఁబడిన యగ్ని. అగ్నిమీళే పురోహితం మొదలు పంచాగ్ని విద్యాగతమైన యగ్నితోపాటు యజమానుఁడైన యగ్నివరకు వ్యాపించి నిత్యాగ్ని హోత్రికి ధ్యేయుఁడై సర్వవైదిక ప్రపంచకమునకు, వైదికాచార పరంపరకు, వైదికధర్మపరంపరకు, వైదిక కర్మ పరంపరకు మూలభూతమైన 'అగ్నిముఖా వైదేవాః' అన్నవాక్యములోని అగ్ని ప్రవర దేహగతమై యున్నది. ఆ యగ్ని వరూధినీ గర్భమునఁ బ్రవేశించినది.

ఇప్పటికి మొదటి రెండు పద్యములలోని కథాసూచ్యత్వము చెప్పఁబడినది. తరువాతిది 'నాలుగు మోముల న్నిగమనాదము' లన్నపద్యము. ఇందులో వట్టి ఉపమాలంకారము. భ్రాంతి లేదు, విషమాలంకారములేదు. ఉపమాలంకారము మాత్రమెందు కుండవలయును? మొదటి రెండు పద్యములలో స్వరోచిజననము వరకు సూచింపఁబడగా ఈ బ్రహ్మస్తోత్ర పద్యములో స్వరోచి జీవితము సూచింపఁబడినది. స్వరోచి బ్రహ్మ, ఆయనకొడుకు స్వారోచిషుఁడు మనువు. బ్రహ్మకు నాల్గుముఖములు. స్వరోచికి నలుగురు భార్యలు. నాలుగు ముఖములయందు వేదములు మ్రోగుచున్నవి. అవి విద్యాస్థానములు. మనోరమ యాయుర్వేద మిచ్చినది, విభావసి మృగపక్షి జాతుల భాషలు తెలిసికొను విద్యనిచ్చినది. కలావతి పద్మినియను విద్య నిచ్చినది. ఈ ముప్పురు

విద్యాస్థానములు. సామ ఋగ్యజు స్థానీయలు. వనదేవత యథర్వ వేద స్థానీయురాలు. ఇట్లు బ్రహ్మాస్తోత్రములో స్వరోచికథా సూచనము జరిగినది.

మిగిలినది 'అంకముఁ జేరె శైల తనయా స్తన దుగ్ధములు.' మరల భ్రాంతి మదలంకారము. స్వారోచిషమనువు జన్మించెను. మనువు జన్మించినాడు అట్లు జనియించి అకామత చిరతపం బాచరించె.

తపస్సనఁగా నేమి? స్వస్థితి! పరిణతుఁడైన జీవునియొక్క స్వస్థితి. వినాయకుఁడు అహి వల్లభ హారముచూచి మృణాళాంకుర మనుకొన్నాఁడట! మఱి యింకొకఁ డెందు కనుకోలేదు? పరమేశ్వరుఁడైన విఘ్నేశ్వరుఁడు తన సహజ లక్షణమును జూచుకొన్నాడు కాని, పెఱలక్షణము నెంచి భ్రాంతిపడలేదు. ఇందులో నొక చమత్కారమున్నది. మృణాళాంకుర మనుకొన్నాడు. మృణాళమునుండి పద్మము భాసించును. పద్మపుష్ప పూర్వరూపము మృణాళము, రూపతః.

పద్మ మనఁగా నేమి? మన సర్వ సారస్వతము విచారించినచో విష్ణునాభి పద్మము. బ్రహ్మ పుట్టినది పద్మమునందు. హృదయము పద్మము. లక్ష్మీదేవి పద్మమునుండి పుట్టినది. ఈ పద్మముయొక్క నిజమైన యథార్థమేమో తెలియదు. ఒకటిగా భాసించుచున్నది. ఇది సర్వజ్ఞానము యొక్క జనిస్థానము.

సర్వజ్ఞానము దేనినుండి పుట్టుచున్నది. తపస్సునుండి పుట్టుచున్నది. తపస్సు మృణాళ నాళాంకురము. అయథార్థమైన జగత్తు అహివంటిది. తపస్సు మృణాళనాళము వంటిది. దాని వివర మున్నది పద్మము. ఆ పద్మమే సర్వజ్ఞాన భూమి మనువుయొక్క మనస్సు.

ఇది యంతయు కల్పనయని చెప్పుటకు చాల వీలున్నది. కల్పనకాదు. విచార లక్షణము. అందుకనియే "వ్యాఖ్యానతో విశేష ప్రతిపత్తిః నహి సందేహా దలక్షణం" అన్నారు. వ్యాఖ్యానము మన సూత్రభాష్యాదిగా ప్రపంచితమైన వైదిక సారస్వతమున కాయువుపట్టు.

మొదటి పద్యమునం దొక విషయము చెప్ప వలయును. అక్కడి భ్రాంతి సనకసనంద నాదులది అని చెప్పితిమి. వారికి భ్రాంతిలేదు - ఉన్నదేమో యని కవి యుత్ప్రేక్ష. ఇది యొక ముడి. తత్ప్రవర దేహసమిద్ధ శిఖిదీప్తి శాంబరీ మహిమచే సంగ్రహించిన గంధర్వునిలో నున్న వెలుఁగు వరూధినీ గర్భమునఁ బ్రవేశించినదని విస్పష్టముగాఁ జెప్పఁబడినది గదా! భ్రాంతిలేదు, ఉత్ప్రేక్షలేదు. భ్రాంతియు నుత్ప్రేక్షయు నచట వాక్యగతములు, అవిచారిత మూలకమైన చదువు లోని భాగములు. అది లోకములో నున్నది గదా! దానిని పెద్దన్నగారు స్పృశించినారు.

ఇంక నొక్క విషయము మిగిలినది. ఈ రీతిగా భావ్యర్థసూచనము తాత్పర్యతః నాట కాదులయందు నిక్షేపింపఁదగినదికాని కావ్యములందుకాదు. అనగా అదియొక శిల్పపద్ధతి. మహాకవి తన యిచ్చవచ్చినచోట నుపయోగించును. ఏవో కొన్ని నాటకలక్షణములవంటి వానిని కావ్యము నందుచూచి నాటకమువలె వ్రాసినాడని "నరీనృత్యంతే" కదా! అట్లిక్కడగూడ చేయ వచ్చును. వారిబుద్ధిలో నాటకలక్షణము కావ్యమునందు ప్రయోగించుట యధిక శిల్పమనియే కదా!

ఏతత్సర్వ పిండితార్థమిదియ. ఉత్ప్రేక్షయందు యాథార్థ్యము లేదు. కావున కవి యుద్దేశ్యము, కలిగినది వరూధినీ గర్భ నిహిత ప్రవర తేజో నిధానముగాని, గంధర్వ తేజో నిధానము కాదు, వరూధినీ గంధర్వ సంధానము భ్రాంతి. ఇది భ్రాంతి యేల యనఁగా శరీరా ప్రాధాన్యమువలన.

జరిగినది వరూధినీ గంధర్వ సమాగమము కాఁగా, కలిగినది ప్రవర తేజో నిధానము. ఇది విరూప కార్యోత్పత్తి.

మొత్తముమీద నీ నాల్గు పద్యములయందు స్వీకరించిన యలంకారము కావ్యగత భిన్నాంశ సూచనకోసము స్వీకరింపఁబడినది. బహ్వర్థములు బహుభావములు నేకత్ర సమాయోజనచేసి పరిత బుద్ధినొరపిడిపెట్టుట శిల్పలక్షణము; శిల్పియొక్క శిల్పరహస్యము. ఇట్టి యలంకారములను గ్రహించుటలో గూడ వేఱే ప్రయోజనము కలిగియుండుట పెద్దన్న యెంత శిల్పి యన వలయును?

తుదిదివ్వె

శ్రీ కొమఱ్ఱాజు వినాయకరావు

భక్తిరస ఫుల్ల హృదయ సంభరితుఁడగుచు
స్మారకార్థమ్ముగా బింబిసార నృపుఁడు
చలువరాల కోవెలఁగట్టె శాక్యమునికి.

చల్లగాలుల సాయాహ్న సమయములను
దీప్త లోపార వెలిగించి దీపములను
బుద్ధదేవునిఁ బూలతోఁ బూజ సేయ
రాచబిడ్డలు, కోడండ్రు రమ్యమెలయ,
వచ్చి చేరుదు రాలయ వనమునందు.

*

కాల చక్రమ్ము గిఱ్ఱునఁ గదలిపోయె!
భాగవత బింబిసార భూపతి గతించె,
నతని తనయుండు రాజాయె, నతఁడు బౌద్ధ
మత విరోధియు శైవాభిమాని యగుటఁ,
దండ్రిపాలించు సౌమ్యసిద్ధాంతములను
గడిగి వైచెను బ్రజల రక్తమ్ముఁ జిమ్మి!

బౌద్ధ సిద్ధాంత పిట్టక ప్రతులుగాల్చి
క్రతువులను జేసె మదనారి కరుణఁగోరి!

*

సంజ కెంజాయ లలమె విశాల దివిని;
గాఢ శాంతమ్ము విశ్వమ్ముఁ గ్రమ్మికొనియె;
శాక్యసింహునిఁ బూజించు సమయమయ్యె!

పరమ పావన చరిత, సద్వంశజనిత,
బౌద్ధ మతమున జ్ఞాని, కృపా ప్రధాని,
చారు ధైర్య తుషారాద్రి, శాంతబోధి,
యందపు మిరాసి, 'శ్రీమతి' యనెడుదాసి-
పూత శీతల వాహినీ స్నాత యగుచు-
నపుడె పూచిన పుష్ప చయమ్ము గ్రుచ్చి,
ప్రమద మొప్పార ప్రమిదల పంక్తిఁ దీర్చి,
మేల్మి యపరంజి పళ్యమ్ము మెఱపు తీన
బుద్ధ భగవానుఁ గొల్చు విశుద్ధమతిని
భర్త్రురాలైన 'శ్రీమతి' పయనమయ్యె!

*

వినయ సంభ్రమ మొప్పగా వింతఫణితిఁ
బళ్ళెరము పూని వడిఁ దన వైపు వచ్చు
'శ్రీమతినిఁ'గాంచి, భయముతో చెదు నయన యు
గమ్ముతో మహారాజ్ఞి యీశరణి నుడివె:

"వెఱ్ఱిదానవె శ్రీమతీ! వెఱఁగులేదె?
మరణ దండన ప్రభునాజ్ఞ మనము వినమె!
బుద్ధ దేవుని జోలికే పోకు, వలదు!"

*

అంత 'శ్రీమతి' రాజకుమారు నగరి
కరిగె, నచ్చట నవ వధు వైన 'యమిత'
యమిత శృంగార మొప్పగా నమిత దీర్ఘ
లలిత నీలాలి కుల కుంతలములు రేగ,
నుంచి బంగారు టద్దమ్ము నూరు సీమ,
దంతపు పని దువ్వెనతోన తలను దువ్వి
ముడుచుకొనె; నిజముఖపద్మమున రచించె
శ్రీ కరమ్మగు కావి కాశ్మీర రేఖ!

'శ్రీమతినిఁ' గని విస్మయ వ్రేప భయము
లోలి పెనఁగొన, నవ వధు వైన 'యమిత'
పాణి పల్లవ యుగళి కంపమున రణన
సలుప మాటాడెఁ దడబాటు పలుకుతోడ:
"నెట్టి చేడ్పాటుఁ దెత్తువో యే నెఱుంగ!
జాలు! నా ప్రోల నిలువకే, సాగిపొమ్ము!

*

అంత 'శ్రీమతి' రాజ్ఞి కూతైన 'శుక్ల'
మందిరము సొచ్చె, నట 'శుక్ల' సుందరాంగి,
క్రుంకు రవిరశ్మి మైసోకఁ గుతుక మొప్పఁ
బ్రణయ మూరించి కరగించు ప్రణయగాథఁ
జూఱగొనుచుండెఁ బువు తూపు చూపుఁ బరపి!

చెలుల చెలువొందు చిన్నారి చెలియడాయఁ
జదువు పొత్తమూఁవు నుండి జార్చి, 'శుక్ల'
చెలియ శ్రవణమ్ములో నూది చెప్పె "సువిద!
సాహసము చేసి వమ్ముగాఁ జావకమ్మ!"

*

అంత 'శ్రీమతి' యింటింటి కరిగి పిలచె:
"శాక్యసింహుని సేవించు సమయమయ్యెఁ
'గదలి రారె, యంతః పుర కాంతలార!
రారె, యోయమ్మలార! వేరారె మీరు
దేవుఁ డైనట్టి బుద్ధుని సేవ కొఱకు!"

ఆమె యరుదేర భయమంది యాస్యమునకై
తలుపు బిగియించినారు కొందరు బిరాన!

నిష్టమైనట్లు మరికొందరింతు లంత
భర్తురాలైన 'శ్రీమతిఁ' బట్టి తిట్టి
నార, లపహాస్య మొనరించినారు మిపుల!

*

అంతరిక్షాన నెచటనో యలరు రాజ
భవన శిఖరంపుఁ బైడిపైఁ బగటి తోలి
యంత్యకిరణాళి నటియించి యస్తమించె!

అణగెఁ బురమున సందడి, గణ గణ గణ
మ్రోగెఁ ముక్కంటి గుడిలోని మూఁగ గంట!

అచట రాణుల యారామ మతి ప్రశాంత
తా నిశాంతమై, సొబగుమైఁ దవరె! నంతఁ
గృష్ణ తిమిరాళి కబళించెఁ గేళి వనము;
అంధ తమసమ్ముఁ జీల్చుక, నంద మొలుక
గౌర కాంతులు విరఁజిమ్మెఁ దారకాళి!

అపుడు గుప్పున శ్యామ వనాంతసీమ
శాక్యసింహుని మంటప సముఖ మందు

బారు దీర్చిన ప్రమిదల పంక్తు లట్టె
ఒక్కమారున నున్నటులుండి వెలిగె!

*

"ఎవ్వరెవ్వ?" రనుచు బొబ్బలిడుచు వేగ
రాజ్ఞి వనపాలకులు నృపు నాజ్ఞ జేసి
వెలుగు దీపాలకై పరు వెత్తినారు.

*

"భగవ దవతారు సిద్ధార్థు పాదదాసి
శ్రీమతి!" నటం చొకానొక స్త్రీ గళమ్ము
మంజులమ్మగ, మృదువుగా, మధురఫణితి,
భయ లవమ్మైన లేనట్లు బదులు పలికె!

*

కత్తి వ్రేటులఁ దెగి చిమ్మె, కాంతహృదయ
జీవ రుధి రార్క రుచి కప్పె సిత శశాంక
దివ్య పాషాణ ఖచిత వేదీ ముఖమ్ము!
ఆ ప్రశాంత మనోజ్ఞ తారా ప్రకాశ
మంగళోత్సవ కర మైన మాపు నందు,
నారెఁ గోవెలఁ దుది దివ్వెయందు "జ్యోతి"!

[రవీంద్రకృతి బౌద్ధగాధ లాధారముగా]

చిత్త వృత్తి

'పెర విట్టి తెఱఁ, గిది వెంగలి తన' మని యెల్లవాఁడును, దన యెఱిఁగి నట్టి
తెరఁగున, నిజకార్య దృష్టియ కయికొను: నొరుల నేర్పులు పట్టనొల్లఁ; డాత్మ
బుద్ధియ మేలని పొగడు, నన్యుల చిత్త వృత్తుల నిందించు; వివిధ గతులఁ
జెందెడు నాత్మీయ చేతః ప్రవర్తన మరయఁడు; తాన బాల్యమునఁ దలఁచు

తలఁపు గీడు చేసి, యెలప్రాయమున నొండు తలఁపునందుఁ బట్టుకొలుపుఁ బ్రీతి;
ముదిమి వచ్చిన తఱి, నదియును విడిచి, యన్యంబు లైన నేర్పు లాచరించు.

— మహాకవి తిక్కన.

సంస్కృత బాలశిక్ష

శ్రీ జి. సత్యనారాయణ, ఎం. ఏ.

౧

సంస్కృత భాషలోని శబ్దములను రెండు తెగలుగ విభజింపవచ్చును. అవితిజన్తములు, సుబంతములు. అందు క్రియాబోధక శబ్దములనే తిజన్తము లందురు. ఈ తిజన్తములను పది గణముల క్రింద వైయాకరణులు వర్గీకరించిరి. అవి భ్వాదులు, అదాదులు, జుహోత్యాదులు, దివాదులు, స్వాదులు, తుదాదులు, రుధాదులు, తనాదులు, క్ర్యాదులు, చురాదులు. ఈ పదిగణములలోని ప్రతి ధాతువును పదిలకారములలో ప్రయోగించుటకు వీలుగలదు. ఒక క్రియాబోధక శబ్దము ఏ కాలము నుద్దేశించి ప్రయోగింప బడుచున్నదను విషయమును కొన్ని లకారములు సూచించును. మరికొన్ని వక్త (చెప్పువాని) యొక్క వేర్వేరు ఉద్దేశ్యములను తెలుపును. మొత్తముమీద లకారములు పది. అవి లట్, లోట్, లఙ్, విధిలిఙ్, లుట్, లృట్, ఆశీర్లిఙ్, లృఙ్, లేట్‌లు. అందు లేట్‌కు వేదమునందే వ్యవహారము.

ప్రతిలకారమునకును మూడు పురుషలలోను తదనుబంధములగు మూడు వచనములలోను ప్రయోగములుండును,

వాడు నమస్కరించుచున్నాడు. వారు నమస్కరించుచున్నారు. పై రెండు వాక్యములలోను డు, రు, లు ఆయా క్రియా పదములు ప్రథమ పురుషకు సంబంధించిన ఏకవచనములోను బహువచములోను ఉన్నవనుటకు గుర్తులు. తెలుగు భాషలో ఒక తిజన్తమునకు సంబంధించిన శబ్దము ద్వివచనములో నున్నదా, బహువచనములో నున్నదా అని తెలుపుటకు ప్రత్యేకముగా గుర్తులేమియు లేవు. కాని సంస్కృతభాషలో నా ధాతువులకు సంబంధించిన శబ్దములను గుర్తించుటకు ప్రత్యేకముగా వీళ్ళు కలవు.

తి—తః—అన్తి అను నీమూడును ఒక క్రియాపదము ప్రథమ పురుషలో నున్నవనుటకు గుర్తులు. అంతియే గాక వీనిలో ప్రతిగుర్తును ఒక క్రియా పదము ఏవచనములో నున్నదియు గూడ తెలుపును. వచనమనగా సంఖ్యాబోధక శబ్దము అనగా ఒక పనిని చేయునది, ఒకడా, ఇరువురా, పలువురా తెలుపునది. నమతి. అను క్రియా పదములోని "తి" అనునది ఆక్రియ ప్రథమ పురుషకు సంబంధించిన ఏకవచనములో నున్నదనుటకు గుర్తు. అనగా నమస్కరించునది ఒక్కడే యని అర్థము. అంతియేగాక ఆ నమస్కరించు వ్యక్తి "నీవు"ను, "నేను"ను గాక ఈ రెండింటికిని వేరగు మరియొక వ్యక్తి నమస్కరించు చున్నాడని యర్థము. నమతః అను పదములోని "తః" అనునది ఆక్రియ ప్రథమ పురుషకు సంబంధించిన ద్వివచనములో నున్నదనుటకు గుర్తు. అనగా నమస్కరించునది యిరువురని యర్థము.

నమన్తి అను పదములోని "అన్తి" అనునది ఆక్రియ ప్రథమపురుషబహు వచనములో నున్నదనుటకు గుర్తు. అనగా నమస్కరించువారు అనేకులు అని అర్థము. నమసి అనుక్రియా పదము లోని "సి"అనునది ఆ పదము మధ్యమ పురుషకు సంబంధించిన ఏకవచనము నకు గుర్తు. ఒక వ్యక్తి తన కెదురుగా నున్న వ్యక్తితో నాతడు (ఆవ్యక్తి) చేసిన పనిని గూర్చి యాతనితోనే చెప్పుటను తెలుపు క్రియ మధ్యమ పురుషలో నున్నట్లగును. ఇచట నమసి అనగా "నీవు ఒక్కడవే నమస్కరించు చున్నావు" అని అర్థము.

నమథః అను పదములోని "థః" అనునది మధ్యమ పురుషకు సంబంధించిన ద్వివచనమునకు గుర్తు. అనగా" మీరిరువురు నమస్కరించుచున్నారని యర్థము. 'నమథ' అను పదములోని "థ" అనునది మధ్యమ పురుషకు సంబంధించిన బహువచనమునకు గుర్తు.

ఒక వ్యక్తి తానుజేసిన పనిని తాను జెప్పుకొన్న విషయమును ఒక క్రియ తెలుపునపుడు ఆక్రియ ఉత్తమ పురుషలో నున్నట్లగును. 'నమామి' అను పదములోని "మి" అనునది ఆ క్రియ ఉత్తమ పురుషకు సంబంధించిన ఏక వచనములో నున్నదనుటకు గుర్తు. అనగా నేను నమస్కరించు చున్నాను అని అర్థము. నమావః అను క్రియాపదములోని "వః" అనునది ఆ క్రియాపదము ఉత్తమ పురుషకు సంబంధించిన ద్వివచనములో నున్నదనుటకు గుర్తు. అనగా మేమిద్దరము నమస్కరించుచున్నామని అర్థము. "నమామః" అను క్రియాపదములోని "మః" అనునది ఆ క్రియాపదము ఉత్తమ పురుషకు సంబంధించిన బహు వచనములో నున్నదనుటకు గుర్తు.

ఈ క్రిందిపట్టిక ఒక క్రియాపదము ఏ పురుషలో నున్నదియు ఏవచనములో నున్నదియు తెలుపును.

	ఏక	ద్వి.	బహు
ప్ర.	తి	తః	అన్తి
	నమతి	నమతః	నమన్తి
మ	సి	థః	థ
	నమసి	నమథః	నమథ
ఉ.	మి	వః	మః
	నమామి	నమావః	నమామః

ఒక ధాతువునకు ప్రత్యయములను చేర్చి నడుమ అకారమును (వికరణి)ని గలిపినచో వానినిబట్టి ఆయా క్రియా పదములను వేర్వేరు పురుషలలోని రూపములను పొందింపవచ్చును.

నమ్ అను ధాతువునకు అకారము జేర్చి 'తి' ప్రత్యయము చేర్చినచో నమ్ ధాతువునకు లట్టులో ప్రథమ పురుషకు సంబంధించిన ఏకవచనము 'నమతి'అగు నని తెలిసికొనవచ్చును. అట్లే భ్వాది గణములోనున్న తదితర లడ్రూప క్రియాపదములకు సంబంధించిన వేర్వేరు పురుషలలోని రూపములను ఏర్పరుపవచ్చును. మిగిలిన లకారము లను గురించి మున్ముందు వివరింప బడును.

తిజన్తములు కాని శబ్దములను సుబంతములందురు. ఇవి రెండు తె— అవి అజన్తములు, హలన్తములు.

స్తములనగా అచ్చులు అంతముగా గలవి. ఒక శబ్దము యొక్క అంతము హల్లునకు సంబంధించిన అక్షర మైనపుడు ఆ శబ్దము హలన్త శబ్దమగును. "అ" కారమునుండి 'ఔ' కారమువరకు నడుమ గల యక్షరములు అచ్చులు తక్కినవి హల్లులు. రామ, హరి, శంభు, ధాతృ, గో మొదలగు శబ్దములు అజన్త శబ్దములు. జలముక్, భిషక్, విద్వత్, మొదలగు శబ్దములు హలన్త శబ్దములు.

ప్రతి సుబంత శబ్దమునకు సంబోధన ప్రథమతో గలిపి ఎనిమిది విభక్తులలోను మూడు వచనములలోను ప్రయోగము లుండును.

ఒక శబ్దము ఏ విభక్తిలో ఏ వచనములో నున్నదియు తెలుపుటకు కొన్ని ప్రత్యయములు గలవు. ముందు తెలుగులో ఈ ప్రత్యయముల విషయముపరామర్శింతము. డు, ము, వు, లు అనునవి ప్రథమా విభక్తికి సంబంధించిన ప్రత్యయములు. ఈ ప్రత్యయములు చేరక పూర్వ మున్న శబ్దములను ప్రాతిపదికలందురు. ఈ ప్రాతిపదికలకు పై ప్రత్యయములను చేర్చినచో ప్రథమావిభక్తికి సంబంధించిన శబ్దరూపము లేర్పడును. రాముడు, విష్ణువు, హరిణము, సామెతలు మొదలగునవి. సంస్కృత శబ్దములకు మూడు వచనములకును మూడు ప్రత్యయము లుండును. అకారాన్త, ఇకారాన్త, ఉకారాన్త, ఔకారాన్త శబ్దములకు ప్రథమా విభక్తికి సంబంధించిన ఏకవచన ప్రత్యయము విసర్గ (ః). ఉదా: రామః. హరిః, శంభుః, గౌః. ద్వివచన, బహువచన ప్రత్యయములు శబ్దముయొక్క అంతమును బట్టి మారుచుండును.

అకారాన్త శబ్దముల వేర్వేరువిభక్తుల లోని వేర్వేరు వచనములకు సంబంధించిన ప్రత్యయములను గూర్చి విచారింతము. ప్రాతిపదిక శబ్దములకు 'ః' చేర్చినచో ప్రథమా విభక్తికి సంబంధించిన ఏకవచన రూప మేర్పడును. ఉదా: దేవ+ః = దేవః అనగా ఒక దేవుడని యర్థము. ఇది ప్రథమా విభక్తికి సంబంధించిన ఏకవచనము. ద్వివచన ప్రత్యయము "ఔ" దేవ+ఔ=దేవౌ అనగా ఇద్దరు దేవులని యర్థము. బహువచన ప్రత్యయము "అః".

ఉదా:- దేవ + అః = దేవాః అనగా నిద్దరికంటె ఎక్కువ దేవత లని యర్థము. ఈ క్రింది పట్టిక అకారాన్త శబ్దముల వేర్వేరు విభక్తి ప్రత్యయములను చూపును.

	ఏక.	ద్వి.	బహు.
ప్ర	ః దేవః (దేవుడు)	ఔ దేవౌ (ఇద్దరు దేవులు)	అః దేవాః (బహుదేవులు)
సం. ప్ర.	హే దేవ (ఓ దేవా)	హే దేవౌ (ఓ ఇద్దరు దేవుళ్లారా)	హే దేవాః (ఓ బహు దేవులారా)
ద్వి.	మ్ దేవం (దేవుని)	ఔ దేవౌ (ఇద్దరు దేవులను)	అన్ దేవాన్ (బహు దేవులను)
తృ.	(అ+ఇన) ఏన దేవేన (దేవుని చేత)	భ్యాం దేవాభ్యాం (ఇద్దరు దేవులచేత)	ఐః దేవైః (బహు దేవులచేత)

చ.	య	భ్యాం	భ్యః
	దేవాయ	దేవాభ్యాం	దేవేభ్యః
	(దేవునికొరకు)	(ఇద్దరు దేవులకొరకు)	(బహు దేవులకొరకు)
పం.	అత్	భ్యాం	భ్యః
	దేవాత్	దేవాభ్యాం	దేవేభ్యః
	(దేవునికంటె)	(ఇద్దరు దేవులకంటె)	(బహు దేవులకంటె)
ష.	స్య	ఓః	నాం
	దేవస్య	దేవయోః	దేవానాం
	(దేవునికి)	(ఇద్దరు దేవులకు)	(బహు దేవులకు)
స.	ఇ	ఓః	షు
	దేవే	దేవయోః	దేవేషు
	(దేవునియందు)	(ఇద్దరు దేవులయందు)	(బహు దేవులయందు)

ఒక శబ్దము ఏ అంతమునందుండునో ఉచ్చారణమును బట్టి తెలియవలయును. దేవశబ్దము అకారాన్తము. హరిశబ్దము ఇకారాన్తము. సంస్కృత శబ్దములు మూడులింగములలో నుండును. పుంలింగము, స్త్రీలింగము, నపుంసకలింగము అను నీమూడును లింగములు. సామాన్యముగ ఆజన్త శబ్దములలో దీర్ఘాక్షరము అంతముగాగల శబ్దము లన్నియు స్త్రీలింగ శబ్దములు. ఉదా:-రమా - లక్ష్మీ - వధూ. పుంలింగ శబ్దములను, స్త్రీలింగ శబ్దములను గుర్తుపట్టుటకు ఆయా శబ్దముల ప్రథమా విభక్తి రూపములను గమనింపవలయును. అకారాన్త శబ్దముల విషయమున ప్రథమా విభక్తికి సంబంధించిన ఏకవచన రూపములో 'ః' చివర నున్నయెడల అది పుంలింగ శబ్దమగును. "మ్" అనునది యున్నయెడల అది నపుంసక లింగ శబ్దమగును.

ఉదా:- జ్ఞానమ్.

STATEMENT ABOUT OWNERSHIP AND OTHER PARTICULARS ABOUT

NAVA-BHARATHI

A Literary & Cultural Telugu Monthly

FORM VI. (See Rule 8). The Registration of News-Papers (Central) Rules, 1956.

1. Place of Publication : Gandhinagar, Vijayawada-2.
2. Periodicity of its Publication . First week of Every month.
3. Printer's Name : Sri J. Radhakrishna Reddy
   Nationality · Indian. Address · Vijayawada.
4. Publisher's Name · Sri J. Radhakrishna Reddy
   Nationality: Indian. Address : Vijayawada.
5. Editor's Name . Sri J. Radhakrishna Reddy
   Nationality . Indian. Address Vijayawada.
6. Names and Addresses of Individuals who own the News - Paper and Partners or Share - holders, holding more than one per-cent of the total capital.

Names ·	Addresses:
Sri CHADALAVADA PITCHAYYA	VIJAYAWADA.
Sri J. RADHAKRISHNA REDDY	VIJAYAWADA.

I, J. Radhakrishna Reddy, here by declare that the particulars given above are true to the best of my knowledge and belief.

1—6—1958

J. Radhakrishna Reddy

Signature of Publisher.

ఆయుర్వేద లక్ష్యము

వైద్యశ్రీ ప్రకాశచంద్ర శతపథి

ప్రాచ్యవిద్యల హారమునందు ఆయుర్వేదము ఒక మణిపూసవంటిది. సర్వతోముఖమైన వివిధ విజ్ఞానములకు కాణాచి వేదములు. అట్టి వేదములలో ఋగ్వేదమున కుపవేద మీ ఆయుర్వేదము. 'ఋగ్వేదస్యాయుర్వేదోపవేదః' అథర్వణవేదమునందలి, జపతపార్చన హోమ విధానములు కూడా యిందభివర్ణింపబడి యుండుటచే ఆయుర్వేదము అథర్వణవేదమున కుపవేద మని మరి కొందరు వక్కాణింతురు. ఆయుర్వేద మన - సర్వమతములసారము, సర్వవిజ్ఞానముల సంపుటీకరణము అని చెప్పనొప్పును. ఆయుర్వేదము ఒక శాస్త్రమేగాక కళ కూడా. అందువలన నిత్యమూ అధ్యయనముచేసి అనుభూతికి దెచ్చుకొని మననం చేసిననాడే ఆయుర్వేద విశిష్టత గ్రాహ్యము కాగలదు.

ఒక వంక శీలమును వేరొక వంక ఆరోగ్యమును, మరియొక వంక మేధాబలశక్తులను ప్రసాదించునట్టి శాస్త్ర మాయుర్వేదము. మానవ జీవితము సుఖదుఃఖముల, మంచిచెడ్డల కూడికయై యున్నది. మానవ జీవితమందలి సుఖదుఃఖములకు హితాహితములకు కారణము ఆహారాచ్చార చేష్టలని ఆయుర్వేదముయొక్క తలంపు. ప్రతివ్యక్తీ తనకు తానుగా హితాన్ని సుఖాన్ని పొందుటకు చేయూత నిచ్చునట్టి దాయుర్వేదము. సంపూర్ణాయుర్దాయమును ప్రతివ్యక్తికీ ప్రసాదించునదే ఆయుర్వేదము.

ఆయుర్వేద నిర్వచనము

"ఆయురస్మిన్ విద్యతేఽనేనవాఽఽయుర్విన్దతీత్యాయుర్వేదః."

దేనివలన ఆయువు తెలియబడునో, దేనివలన ఆయువు విచారించ బడునో, లేక దేనివలన ఆయుస్సును పొందనగునో అదే ఆయుర్వేదము. నేడు ప్రపంచముననున్న తక్కిన వైద్యశాస్త్రములు రోగ నివారణమే తమ లక్ష్యమని చెప్పగల్గునట్టివిగాని, ఆయుఃసంరక్షణ తమ ధ్యేయమని చెప్పగల్గునట్టివి లేవు. శరీరము, ఇంద్రియములు, మనస్సు, ఆత్మ - వీటి యొక్క సంయోగమే ఆయువు. "శరీరేంద్రియ సత్త్వాత్మ సంయోగా దాయు రుచ్యతే." శరీరము, ఇంద్రియములు, మనస్సు, ఆత్మ - వీటి యొక్క సరియైన కూడికయే ఆయువని, అదే జీవితమని ఆయుర్వేదము యొక్క సిద్ధాంతము. శరీరము, ఇంద్రియములు మాత్రమే సరిగా వుండి, మనస్సు, ఆత్మ సరిగా లేనపుడు ఆ జీవితము సౌఖ్యవంతము కాజాలదని, ఆ వ్యక్తికి పూర్ణాయుర్దాయము లభ్యము కాజాలదని ఆయుర్వేదము యొక్క సిద్ధాంతము. మనస్సు ఆత్మల యొక్క విచారము ఇతర వైద్యశాస్త్రములందు లేదు. వారికి రోగనివారణమే ముఖ్యముగాని ఆరోగ్యము కాదు. ఆయుర్వేదమునందు రోగము వేరు. రోగ నివారణ వేరు. స్వస్థత వేరు. ప్రతి వ్యక్తికి స్వస్థసంరక్షణ చేయడమే ప్రధానాశయముగా గలది ఆయుర్వేదము. ధన్వంతరి సుశ్రుతునకు ఆయుర్వేద ప్రయోజనమును చెప్తూ: "వత్స! సుశ్రుత! ఇహ ఖల్వాయుర్వేద ప్రయోజనం: వ్యాధ్యుపసృష్టానాం వ్యాధి పరిమోక్షః, స్వస్థస్య రక్షణం చ." వ్యాధులను రాకుండా చేయడం, వ్యాధి పీడితులను వ్యాధులనుండి రక్షించడం, స్వస్థుని ఆరోగ్యాన్ని కాపాడ్డం ఆయుర్వేద ప్రయోజనము లని అన్నారు.

అష్టాంగ శోభితమైన ఆయుర్వేద శాస్త్రమున రసాయన, వాజీకరణ తంత్రములు రెండున్నూ ప్రత్యేకించి స్వస్థుని స్వాస్థ్యసంరక్షణకుగాను నిర్దేశింప బడి యున్నవి.

రసాయన తంత్రమును గూర్చి చెబుతూ యిలా పేర్కొన్నారు. "రసాయనతన్త్రం నామ వయః స్థాపన మాయుర్మేధాబలకరం, రోగాపహరణ సమర్థంచ" అని.

ముసలి తనమును దరిచేరనీయక వయఃపాటవమును నిల్పుచూ, బుద్ధిని, బలమును, ఆయువు నొసగి, రోగముల హరించునట్టిది రసాయన తంత్రము.

వాజీకరణ తంత్రమును గూర్చి ఇట్లు చెప్పిరి.

"వాజీకరణ తన్త్రం నామాల్ప దుష్ట క్షీణ విశుష్క రేతసా మాప్యాయన ప్రసాదోపచయ జనన నిమిత్తం ప్రహర్ష జననార్థంచ".

ప్రకృతి చేతనే అల్పమగు రేతస్సుగలవారికి దుష్టమైన రేతస్సుగలవారికి ఇతరకారణములచే క్షీణమగు రేతస్సుగలవారికి దోషకారణాన్ని సరిదిద్ది రేతస్సును వృద్ధిపర్చునట్టిది, వృద్ధులకు శుక్రమును జనింపజేయునట్టిది, స్వస్థునకు శుక్ర వృద్ధి స్రావముల కలుగజేయునట్టిది, వాజీకరణము.

"శరీరమాద్యం ఖలు ధర్మసాధనం." అన్ని ధర్మముల సాధనకు శరీరం ముఖ్యం. అందువలన శరీరాన్ని దృఢంగా, బలంగా నుంచుట కేర్పడినవే రసాయన, వాజీకరణ తంత్రములు. ఈ రెండు చికిత్సావిధానములు ఇతర వైద్య సిద్ధాంతములందు యీ రీతిన కానరావు.

ఆయుర్వేదమున తతిమ్మా చికిత్సాభాగములు:

1. శల్యతంత్రం 2. శాలాక్యతంత్రం ; ఈ రెండు తంత్రములు శస్త్ర చికిత్సా పరములు.

3. కాయచికిత్స : జ్వరము, కుష్టము, అతిసారము, కుష్టు, క్షయ, ప్రమేహం మున్నగు శారీరకమైన వ్యాధుల నుపశమింప జేయునది.

4. భూతవిద్య.

5. కౌమారభృత్యము : బిడ్డల పోషించుట; స్తన్యమందలి దోషములు, గర్భిణీ ఉపచారములు, ప్రసవానంతర విధులు, బిడ్డలరోగములు వీటినిగూర్చి ప్రత్యేకముగా నిందు వివరింపబడును.

6. అగద తన్త్రం. విషజంతువుల కాట్లనుండి రక్షించుకొను విధానములను, వాటి చికిత్సలను తెలుపు ప్రత్యేక చికిత్సాభాగము.

ఈ ఆరున్నూ పైన వివరింపబడిన రసాయన వాజీకరణ తంత్రములున్నూ కలిసి అష్టాంగములతో ఆయుర్వేదము విరాజిల్లుచున్నది నేడు శల్యశాలాక్య తంత్రములందు వైద్యులకు ప్రవేశము లేకుండా పోయినది. ఈ యెనిమిది తంత్రములేగాక ప్రత్యేకించి స్వస్థవృత్త మను పేర ఒక ప్రత్యేకభాగము ఆయుర్వేదమునందు కేటాయించబడి యున్నది. ఋతుచర్య, దినచర్యయను పేరిట ఏ యే ఋతువునం దెట్టి

ఆహార విహారముల ననుసరించవలెనో, పగటి పూట యే ఆహారవిహారముల ననుసరించవలెనో, రాత్రివేళ యెట్టి ఆహారవిహారముల ననుసరించుట ఆరోగ్యకరమో విపులముగా పేర్కొనబడినది.

ఆరోగ్యము : ఆయుర్వేదము

ఆయుర్వేద రీత్యా ఆరోగ్య మన ఒక్క శారీరక మైనదే కాదు, మానసిక మైనది కూడా. శారీరక మైన వ్యాధులు మనస్సును, మానసిక వ్యాధులు శరీరాన్ని క్లేశపర్చును.

కనుక రోగనిర్మూలన చేయుటమంటే శరీరాన్ని మనస్సును పీడనుండి విముక్తి చేయడం అవసరం. ఆయుర్వేద చికిత్సారహస్యమిదే. ఆయుర్వేద శాస్త్రమున నిట్లు పేర్కొనబడినది:
సమదోషస్స మాగ్నిశ్చ సమధాతుమలక్రియః
ప్రసన్నాత్మేంద్రియ మనాః స్వస్థ ఇత్యభిధీయతే

శరీరం దోషధాతు మలముల కూడిక. 'దోష ధాతుమల మూలం హి శరీరం.'

అట్టి శరీరమున వాత పిత్త కఫములనే త్రిదోషములు, రసం, రక్తం, మాంసం, మేదస్సు, మజ్జ, అస్థి, శుక్రం అనే సప్తధాతువులు, మూత్రం, స్వేదం, పురీషం అనే మలములు, విషమ, తీక్ష్ణ, మందములనే అగ్నులు (జీర్ణక్రమమును రూపొందించే శక్తులు) హెచ్చు తగ్గులుగా లేకుండా సమంగానుండి: మనస్సు, ఆత్మ, ఇంద్రియములు నిర్మలముగా నుండుటయే ఆరోగ్యము.

చతుర్విధ రోగములు

ఆయుర్వేదమునందు వ్యాధులు నాల్గురకములుగా పేర్కొనబడి యున్నవి. శారీరకం, ఆగంతుకం, మానసికం, స్వాభావికం అని.

శారీరకమైనవి: దోషధాతుమలముల వైషమ్యముచేత యేర్పడునట్టి జ్వరము, కాస, గ్రహణి, అతిసారం మున్నగునవి.

ఆగన్తుకములు. అభిఘాతము (దెబ్బ) చేత, పులి మున్నగు క్రూరజంతువులచే కాట్లు, దెబ్బలు, పిడుగు మున్నగునవి పడినందువ కలిగే బాధలు - యివి ఆగన్తుకములు.

స్వాభావికములు, క్షు – దప్పి, జర, మృత్యువు.

మానసిక వ్యాధులను పేర్కొంటూ ఆయుర్వేదం ఇలా అంది

"మానసాస్తు క్రోధ - శోక - భయ - హర్ష- విషా - దేర్ష్యా-భ్యసూయా - దైన్య - మాత్సర్య కామ - లోభ - ప్రభృతయ ఇచ్ఛాద్వేషభేదై ర్భవన్తి" క్రోధము, శోకము, భయము, హర్షము, విషాదము, ఈర్ష్య, అభ్యసూయ (ఇతరుల గుణములందు దోషముల నారోపించుట), దైన్యము, మాత్సర్యము, కామము, లోభము - ఇవి మానసికములైన రోగములు ఇవి ఇచ్ఛాద్వేషములచే జనించు నని ఆయుర్వేదము తెలిపినది ఇవికూడా లేకుండా వున్నప్పుడే ప్రసన్నాత్మేంద్రియమనః స్వస్థ ఇత్యభిధీయతే" అన నొప్పును

కామక్రోధలోభ మోహాదులు వ్యాధులుగా నిర్ణయించిన శాస్త్ర మొక్క ఆయుర్వేదమే. అవి లేకున్న స్థితినిగాని ఆరోగ్యమని చెప్పవలను పడదని చెప్పిన శాస్త్రము ఆయుర్వేదము. ఈ వ్యాధుల బారి బడకుండా మానవలోకమును కాపాడడమే ఆయుర్వేదమునకు లక్ష్యము. స్వస్థవృత్తమందుకే నిర్దేశింప బడియున్నది

ఒక వంక ఆరోగ్యమును, వేరొక వంక ఇంద్రియ విజయమును, మరియొకవంక మేధా బలశక్తులను చేకూర్చునట్టి విధానములననుసరించ వలసినదిగా ఆయుర్వేద ముపదేశించి యున్నది దీని ననుసరించిననాడు, లోకమున సుఖశాంతులు వర్ధిల్లగలవు. భారత జాతీయవైద్య మయిన ఆయుర్వేద శాస్త్రాభ్యున్నతికి భారతప్రభుత్వము పూనికవహించి, ప్రజారోగ్య సంరక్షణకు తోడ్పడవలసి యున్నది.

మాసఫలములు

[జూన్ 1958]

శ్రీ 'బుధ'

[ఏ సంవత్సరమున పుట్టినను, పుట్టిన తేదీగల రాశిని బట్టి, ఫలము తెలిసికొనునది.]:

గ్రహస్థితి : మిథున కర్కాటకములలో రవి, మీన మేషములలో కుజుడు, వృష మిథున కర్కాటకములలో బుధుడు, వృషమిథునములలో శుక్రుడు, తులలో గురుడు, ధనుస్సున శని, తులా మేషములందు రాహుకేతువులు, సింహములో యురేనస్, వృశ్చికమునందు నెప్ట్యూన్.

గ్రహగతులు ; గురుశనులు వక్రులు, రవి శనులకు సమసప్తకము. శుక్రవరుణులకు సమాంతరము. ఇవి దేశారిష్ట సూచకములు. దుర్భిక్షము, అనావృష్టి, క్షామము, రోగభీతి, యుద్ధ భయము, కొన్నిచోట్ల అరాచకము, అవినీతి, స్వార్థపరత, అధికార వ్యామోహము. ఉత్తర భారతమున ప్రజలకు సైనికులకు అరిష్టము, సాంఘిక విప్లవములు కలుగును. హృద్రోగముచే పెక్కు మరణములు. రవిగురులు వాయుతత్వ రాశులందును, శని కుజు లగ్నితత్వరాశులందును సంచరించుటచేత వైజ్ఞానిక రంగమున కళాసారస్వతముల కధిక గౌరవము. విద్యా విధానమున సంస్కరణములు.

మేషము

మార్చి 21 నుండి ఏప్రియల్ 20 వరకు

ఆవేశము, భ్రాంతి, ఉత్సాహము, తీవ్రత నిర్లక్ష్యము. ఉన్నతాశయములు. మనః ప్రవృత్తి పరిపరి విధముల నుండుట ఆశాజనకములైన అవకాశములు. సాహసప్రయత్నములు. బాధ్యత కార్యదీక్ష. జర్నలిజము, ఎలెక్ట్రిసిటీ, తంతి, పోస్టుహోండు, మిలిటరీ, ఇంజినీరింగ్ శాఖల వారికి 20 తేదీలోపల ప్రమోషను అహంకారము, నిర్లక్ష్యము పైకిరానీయకూడదు.

ప్రమాద పరిస్థితి తప్పి స్థిరత్వం గౌరవం కలుగును. ఉష్ణాధిక్యము, కురుపులు, స్వల్ప అనారోగ్యం, కుటుంబసౌఖ్యము, వ్యవహారపు పేచీ. అన్యసహాయముతో కావలసిన పనులు 19 తేదీ పిదప కాగలవు.

వృషభము

ఏప్రియల్ 21–మే 22

ఆత్మకారక రాశికి ద్విర్ద్వాదశములందు రవి కుజ కేతు సంచారముచే ప్రాణహాని, లేదా, గౌరవహాని. కుజశనుల ద్వాదశాష్టమ స్థితివలన నిరాశా నిస్పృహలు. గురురాహుల షష్ఠస్థితిచే శత్రుప్రాబల్యము, అపనిందలు, లోకవిరోధం. పట్టుదల విడిచి, సమయాన్ని బట్టి నడచుకొనుట మంచిది. సాంఘిక రాజకీయవాదులకు ప్రభువులకు భూస్వాములకు శత్రురోగ ఋణ బాధలు, శరీరశ్రమ, మనోవ్యథ, ప్రచ్ఛన్న వైరము. జన్మరాశియందున్న శుక్రుడు కష్టములను తొలగించి విజయము గూర్చును. 19 తర్వాత కొందరు శత్రువులు మిత్రులగుదురు.

మిథునము

మే 23–జూన్ 21

జన్మరాశియం దాత్మకారకుడగు రవి, గురు దృష్టి, బుధసంబంధము కలిగియుండుటచేతను, జన్మరాశికి ముందు కుజశుక్రు లుదయించుట చేతను, కొన్ని సత్ఫలితములు కలుగును. వైజ్ఞానిక విషయములందలి ప్రతిభ పైకివచ్చును. వ్యవహారములలోను రాచకార్యములలోను జయము. బహువ్యాపకత్వము, కీర్తిప్రతిష్టలు ఆదాయము స్వల్పము వర్తకులకు కొలదినష్టము. స్పెక్యులేషను లాభించదు. ఏజెన్సీ కాంట్రాక్టు వ్యాపారములందు కొలదిలాభము. భూమివలని ఆదాయంగానీ, ఋణద్రవ్యంగానీ చేతికివస్తుంది. దూరప్రయాణాలు. శుభకార్యాలకై వ్యయం. ఇతరుల వ్యవహారములలో మధ్యవర్తిత్వము. ఆప్తమిత్రులతో అభిప్రాయభేదములు. తన వృత్తివారితో వైరము. కళత్రానారోగ్యము.

కర్కాటకము

జూన్ 22-జూలై 22

షష్ట వ్యయములలో రవి శనుల సమసప్తకము కీడు. వృత్తి వ్యాపారాలలోని పొరపాట్లు, గుట్టుమట్లు బిక్కులకు దారితీస్తాయి. ఈ కష్టాలు కనిపెట్టి శత్రువులు దెబ్బతీస్తారు. క్రిమినల్‌గా జరిమానా, లేక శిక్ష. ప్రతిష్ఠకోసం సాహసకార్యాలు, లోకనింద, ధనవ్యయం. జాతకునకుగాని కళత్రమునకుగాని అనారోగ్యము, ప్రమాదభయము. ఈ అశుభ ఫలములు 15 వ తేదీనుండి తగ్గును. రాజ్యలాభములందు కుజ శుక్రుల స్థితిచేత జయము వ్యాపారము వలన, మిత్రులవలన, స్త్రీ మూలమున ధనలాభము. ప్రయాణములలో జాగ్రత్త అవసరము

సింహము

జూలై 23 - ఆగస్టు 22

అనుకూల గ్రహస్థితి. ఆశయ సాఫల్యము. కృషిఫలము ధనముకంటె గౌరవమే అధికము. సంగీత సాహిత్య శిల్ప కళాకారుల కిది మంచి కాలము. వృత్తి వ్యాపారములలో నూతన ప్రయత్నములకు అనుకూల్యము. శత్రుజయము. గృహమందు శుభకార్యము. శని కుజుల కోణ స్థితిచేత సంతానమున కశుభము. మాతాపితలకు మంచిదికాదు. స్పెక్యులేషన్ తగదు.

కన్య

ఆగష్టు 23-సెప్టెం. 22

ఈ రాశివారికి సహజముగా గల విజ్ఞానము కళారూపములో వ్యక్తపడుతుంది. వ్యాపార కాంక్ష, ధన వ్యయము సందిగ్ధఫలము. శని కుజులు రహస్య స్థానములందు ధగోచరులై యుండుటచే మిత్రులవలన ద్రోహము ఒకొక్కప్పుడు తన మాటలే తనకడ్డువచ్చుట సాధన సంపత్తి సహకూరకుండుట రాజకీయములైన ఆటంకములు వీనివలన వృత్తివ్యాపారములందు నష్టము. ఈ రాశివారు రెండు విధముల ధనార్జన చేయగలవారగుటచే నేదో ఒక విధముగా నిలబడగలరు. శుక్రుని భాగ్యస్థితిచే నూతన వస్తువాహనప్రాప్తి. 20 వ తేదినుండి యత్న కార్యములం దనుకూలత.

తుల

సెప్టెం. 23-అక్టో. 22

లగ్నమున గురుడు, నవమకోణమున రవి బుధు లుండుటచే కళాభిరుచి. దానివలన ధన గౌరవములు. వ్యాపార వ్యవహారములలో అనుకొన్నంత లాభం కలుగదు. 19 వ తేదీనుండి, గురు సవ్యగతివలన, కొంత కార్యసిద్ధి. భాగస్వాములతోను, మిత్రులతోను, సంఘముతోను, కళత్రముతోను భేదాభిప్రాయములు. జన్మ గురుని వలన గౌరవప్రతిష్టలు, విజ్ఞానాభివృద్ధి, ఆధ్యాత్మిక చింతన, సత్కార్మాపేక్ష, స్వల్ప ఆదాయము.

వృశ్చికము

అక్టోబరు 23 - నవంబరు 21

ప్రతికూల గ్రహస్థితి. పార్టీకి సంఘమునకు సంబంధించిన శత్రు ప్రాబల్యము. వ్యవహారపు చిక్కులు. స్వల్ప అనారోగ్యము. అస్థిరత, శత్రు రోగ ఋణబాధలు. క్రొత్తదారులు త్రొక్కపురోగమించుట. శుక్రుని సప్తమ స్థితిచే ఆర్థిక మాంద్యము కొంత సడలును.

20 వ తేదీ తర్వాత శుభ పరిణామము. వృత్తి వ్యాపారములకై గ్రామాంతర ప్రయాణము.

ధనుస్సు

నవం. 22- డిసెం. 22

లాభమున, గురుని సవ్యమార్గ పురోగతిచేత గడచిన నాల్గు నెలలుగా కానిపనులు, ఈనెల 19 నుండి, ఒక దారికి రాగలవు. ఆధ్యాత్మిక వికాసము కలుగును. భావనాశక్తి, సంస్కృతి, కళానిపుణత పైకిరాగలవు.

జన్మ శని వక్రతచే ఆర్థిక అసంతృప్తి, 12, 13, 14 తేదీలలో రవిశనుల సమసప్తకము ప్రమాదకరము. అభిప్రాయ భేదముల వలన కార్యహాని. మాతాపితలకు అనారోగ్యము. దూరప్రయాణములు - ధనలాభము.

మకరము

డిసెంబరు 23-జనవరి 20

శని వ్యయస్థితిచే 1956 అక్టోబరు నుండియు మంచిదికాదు. ఇప్పుడు వక్రియగుటచే మరి

యును. ధనవ్యయము, శత్రురోగ ఋణబాధలు నూతన ప్రయత్న విఘ్నములు అంతఃకలహములు, ప్రచ్ఛన్న శత్రుత్వము. ఐనను గురుశుక్రుల శుభస్థితిచే మిత్రుల తోడ్పాటువలన కొంత విజయము. కార్యసాఫల్యము. స్త్రీ మూలక లాభము. 19 వ తేదీ తర్వాత కొంతధనలాభము. కుటుంబమున అనారోగ్యము. చికాకు.

ఈ రాశివారికి కొందరికి హఠాన్మరణము, కొందరికి రాజదండనము కలుగును.

కుంభము

జనవరి 21—ఫిబ్రవరి 19

అనుకూల గ్రహస్థితి. శుభఫలము. సాహిత్యాది వైజ్ఞానిక కృషిసాఫల్యము. కాంట్రాక్ట్స్, స్పెక్యులేషన్‌లలో లాభము. ధర్మాసక్తి, ఆధ్యాత్మిక వికాసము. ఆరోగ్యము. బంధుమిత్రులవలని సుఖము. అకస్మాత్ ధనలాభము, సంతానమునకు మేలు. స్థిరాస్తి సంపాదన. గృహమున శుభకార్యము. వృత్తి వ్యాపారములకై దూరప్రయాణము

మీనము ఫిబ్రవరి 20—మార్చి 20

వక్రి గురు శనుల అష్టమ రాజ్యస్థితిచే నూత్న ప్రయత్న వైఫల్యము. ప్రస్తుత స్థితి గతులకు భంగసూచన.

20 వ తేది తర్వాత కొంత యత్న కార్యసిద్ధి. స్వల్పఆదాయము. కాని ఆదాయముకంటె అధిక వ్యయము అనారోగ్య కారణమున కుటుంబ సౌఖ్యము లేకుండుట. సాంఘిక వివాదములు. మాతా పితల కరిష్టము. ఆప్తబంధు మరణము.

Printed & Published by Sri J Radhakrishna Reddy, Vijayawada 2
Printed at Sri Ramakrishna Printing Works, Vijayawada-2.